




# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :25 సంచిక :62 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు ఆదివారం 12 జూలై 2026 పేజీలు :12 వేల రూ5 /-


## కేసీఆర్ కు ఏమైంది...

**హైదరాబాద్, జూలై 11:**తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లయింది. తెలంగాణను సాధించి.. రాష్ట్రాన్ని తొమ్మిదిన్నరేళ్లు పాలించిన కేసీఆర్‌ను కొట్టడం ఎవరికీ సాధ్యం కాదనుకున్నారు. కేసీఆర్, కేటీఆర్ కూడా బీజేపీపై ఫోకస్ పెట్టారు. కానీ రేవంత్‌రెడ్డి బాహుబలిలా షాక్ ఇచ్చాడు. బలమైన కేసీఆర్‌ను ఒంటిచేత్తో ఓడించాడు. రెండున్నరేళ్లుగా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. ఇలాంటి పరిస్థితిలో కేజీఆర్ రాజకీయ జోష్యాలు చెబుతూ మళ్లీ వచ్చేది బీఆర్ఎస ప్రభుత్వమే.. ముఖ్యమంత్రి అయ్యేది కేసీఆరే అంటూ చెప్పుకుంటున్నారు. ఇవి తెలంగాణ రాజకీయ వాతావరణాన్ని సంక్లిష్టంగా మారుస్తున్నాయి.రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు ఏమీ చేయలేదని, తెలంగాణ ప్రజలు సీఎం రేవంత్, మాజీ సీఎం కేసీఆర్ పాలనను పోల్చి చూసుకుంటున్నారని పేర్కొంటున్నారు. మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని కోరుకుంటున్నారని చెబుతున్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధిలో రేవంత్ సగం కూడా చేయలేదని ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ వైఫల్యాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయన్న ధీమా కేటీఆర్‌లో



కనిపిస్తుంది. కానీ, రెండున్నరేళుల ఫామ్‌హౌస్‌కు పరిమితమైన కేసీఆర్.. రాజకీయాల్లో మళ్లీ యాక్టివ్ అయ్యే పరిస్థితిపై సందిగ్ధం నెలకొంది. కేసీఆర్‌ను ఇక శాశ్వతంగా ఫామ్‌హౌస్‌కే పరిమితం చేస్తామని రేవంత్ అంటున్నారు.ఎన్నికలు - మిగతా3లో

## మూడింటిలో రెండు
## కార్పొరేషన్లపై గురి

**హైదరాబాద్, జూలై 11**:తెలంగాణ రాజకీయాల్లో తదుపరి సమరం హైదరాబాద్ మహానగరం వేదికగా ప్రారంభం కానుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ ప్రభుత్వం పాత 1955 నాటి యాక్ట్‌ను రద్దు చేసి పాత గ్రేటర్‌ను మూడు స్వతంత్ర కార్పొరేషన్లుగా విభజించి, డివిజన్ల సంఖ్యను 150 నుండి ఏకంగా 300 కి పెంచి ఎన్నికలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తోంది. కాంగ్రెస్ వేస్తున్న ఈ త్రిశూల వ్యూహాన్ని తిప్పికొట్టి, హైదరాబాద్‌పై ఎలాగైనా జెండా ఎగరేయడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ హైకమాండ్ తన వ్యూహాలకు పదును పెట్టింది.ఇందులో భాగంగానే ఇటీవల బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అత్యంత యువ లీడర్ నితిన్ నవీన్ హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు సుదీర్ఘంగా పర్యటించి, రాష్ట్ర కోర్ కమిటీ నేతలకు గట్టి వార్నింగ్ , దిశానిర్దేశం చేసి వెళ్లారు.



నితిన్ నవీన్ తన అంతర్గత సమావేశాల్లో రాష్ట్ర నేతలకు అత్యంత స్పష్టమైన సందేశాన్ని - మిగతా3లో

## తెలంగాణలో పెట్టుబడులకు
## ఎమిరైట్స్ ఆసక్తి..

### సీఎం రేవంత్‌రెడ్డితో కీలక చర్చలు

**హైదరాబాద్, జూలై 11 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా ఎమిరైట్స్ వైమానిక సంస్థ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సార్థన్ ఈరోజు(శనివారం) సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీఎంతో చర్చించారు. ఎమిరైట్స్ వైమానిక సంస్థ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సీఎంను మర్యాదపూర్వకంగా ఎమిరైట్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కలిశారు. హైదరాబాద్‌లో ఎమిరైట్స్ A-38 సర్వీసులను ప్రారంభించేందుకు ఈ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సుముఖత వ్యక్తం చేశారు. ఎమిరైట్స్ విమాన సర్వీసులను మరిన్ని పెంచాలని సీఎం కోరారు. తెలంగాణలో మరో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు కాబోతున్న నేపథ్యంలో అక్కడ కూడా ఎమిరైట్స్ వీ=సా ఆపరేషన్స్ కొనసాగించాలన్న సీఎం సూచించారు. విమాన సర్వీసులకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్సిటీలో క్రీడాకారులకు శిక్షణ అందించేందుకు స్పాన్సర్‌షిప్‌నకు ముందుకు రావాలని సీఎం కోరారు. ఈ



విషయంపై సానుకూలంగా ఎమిరైట్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ స్పందించారు.

## గంటల్లోనే చెన్నై, ముంబై..
## తెలంగాణకు
## మూడు బుల్లెట్ ట్రైన్లు

### అశ్వినీ వైష్ణవ్ కీలక ప్రకటన
### తెలంగాణ బుల్లెట్ ట్రైన్ హబ్‌గా అవతరించబోతోందన్న అశ్వినీ వైష్ణవ్
### హైదరాబాద్ నుంచి విజయవాడకు గంటలో చేరుకోవచ్చన్న రైల్వే మంత్రి
### తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులు పరుగులు పెడుతున్నాయని వ్యాఖ్య

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టనున్న ఏడు బుల్లెట్ రైళ్లలో, ఏకంగా మూడు రూట్లు తెలంగాణకే దక్కడం విశేషమని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ వల్లే రాష్ట్రానికి ఈ భారీ ప్రాజెక్టులు వచ్చాయని, రాబోయే రోజుల్లో తెలంగాణ దేశంలోనే ఒక పెద్ద బుల్లెట్ ట్రైన్ హబ్‌గా అవతరించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ విప్లవాత్మక ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయాలు ఊహించని విధంగా తగ్గిపోతాయన్నారు. ముఖ్యంగా, హైదరాబాద్ నగరవాసులకు ఈ రైళ్లతో ప్రయాణ కష్టాలు పూర్తిగా



తీరిపోనున్నాయి. బుల్లెట్ రైలు ఎక్కితే హైదరాబాద్ నుంచి విజయవాడకు - మిగతా3లో



## స్ట్రాటజీ సర్వే వర్కౌట్ అవుతుందా...

**హైదరాబాద్, జూలై 11:**తెలంగాణ రాజకీయాలు వ్యూహ ప్రతివ్యూహాలతో రసవత్తరంగా సాగుతున్నాయి. తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికొత్త దుమారాన్ని లేపాయి. తెలంగాణలో అధికార కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఏకంగా 78 సీట్లు గెలుచుకుని మళ్లీ అధికారంలోకి వస్తుందంటూ ఆయన చేసిన కామెంట్స్ పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చేయించుకున్న అంతర్గత సర్వేల్లోనే కాంగ్రెస్ ఓడిపోతుందని తేలిందని కేటీఆర్ బాంబు పేల్చారు. కేవలం పార్టీ సర్వేలే కాకుండా, రెండు ప్రముఖ మీడియా సంస్థల సర్వేలు, అటు కేంద్ర, ఇటు రాష్ట్ర ప్రభుత్వాల ఇంటెలిజెన్స్ వర్గాలు సేకరించిన నివేదికల్లోనూ బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ వస్తుందని తేలిందని ఆయన నొక్కి చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కాస్త డీలా పడ్డ గులాబీ శ్రేణుల్లో కేటీఆర్ ప్రకటన సరికొత్త జోష్ నింపిందనే చెప్పాలి.కేటీఆర్ సర్వేల రాజకీయంపై కాంగ్రెస్ శ్రేణులు అంతే తీవ్రంగా స్పందించాయి. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలకు ఇలాంటి సొల్లు కబుర్లు చెప్పడం, పగటి కలలు కనడం అలవాటేనంటూ కాంగ్రెస్ నాయకులు ఎద్దేవా చేస్తున్నారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ప్రతి మూడు నెలలకోసారి సర్వేలు చేయించుకుని, 'మళ్లీ మనదే అధికారం, మనకు తిరుగులేదు' అంటూ చంకలు గుద్దుకునేవారని, ఇప్పుడు కొడుకు కేటీఆర్ కూడా అదే - మిగతా3లో

## భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతగా చేపట్టాలి....

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**కరీంనగర్:**భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు.భూ రీ-సర్వే, భూ భారతి అమలు, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీ, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై



మంత్రి, శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, ఉన్నతాధికారులు పాల్గొనగా..కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ చిత్రా మిశ్రా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తిస్థాయిలో చేరలేకపోయామని తెలిపారు.ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి, హైకోర్టు సమస్యను కూడా పరిష్కరించినప్పటికీ అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందని, తిరస్కరణ లకు గల కారణాలను గుర్తించి పరిష్కరించా లని అధికారులను - మిగతా3లో


## జన్మదిన శుభాకాంక్షలు



# పరుగులు పెడుతున్న అమరావతి

**విజయవాడ, జూలై 11 :**తెలంగాణ ఉద్యమం ప్రాంతీయ ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. ఆ సమయంలో పార్టీల, వర్గాల ఒక లక్ష్యం కోసం కట్టుబడ్డారు. ఆ యుద్ధ భావనతోనే ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైంది. ఆంధ్రాప్రాంత ప్రజలు వ్యతిరేకించినా.. తెలంగాణ మొత్తం ఏకమైంది. లక్ష్యం చేరుకుంది. అలాంటి ఐక్యత ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో కనిపించడం లేదు. రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు గడిచినా రాజధాని లేని రాష్ట్రంగానే మిగలిపోయింది. సీఎం చంద్రబాబు నాయుడు రాజధాని అమరావతి కోసం సంకల్పం తీసుకున్నారు. రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారు. రాజధాని నిర్మాణ పనులూ వేగంగా జరుగుతున్నాయి. అయితే ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన జగన్‌మోహన్‌రెడ్డి అమరావతిని వ్యతిరేకించడంతో రాజధానికి అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. రాజకీయ వాతావరణం, వ్యక్తిగత వ్యూహాలు, అధిష్టాన ఉద్దేశాల కారణంగా సమస్య మరింత క్లిష్టంగా మారింది.ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి ఒక బ్రాండ్ తీసుకురావడానికి సీఎం చంద్రబాబునాయుడు అహర్నిలు కష్టపడుతున్నారు. అమరావతి పరపతి మాత్రమే కాదు, హక్కు కూడా. పార్లమెంట్ ద్వారా అమరావతిని రాష్ట్ర రాజధానిగా ధ్రువీకరించి తీర్మానం ఉన్నప్పటికీ, అమరావతి ప్రాధాన్యతను అభివృద్ధి, ఆర్థిక పునర్రూపకల్పన, రైతు సంకల్పంతో కూడిన సామాజిక ఒప్పందంగా చూడాలి. ఎన్నో వేల ఎకరాలు దిగుబడిలేని భూములను రైతులు స్వచ్ఛందంగా ఇచ్చి తమ భవిష్యత్‌కు బాటలు వేసుకున్నారు. ప్రాజెక్టులు,



పెట్టుబడులు, మౌలిక సదుపాయాల రూపొందింపు ఈ పట్టదారుల ఆశలపై ఆధారపడి ఉన్నాయి.అయితే రాజకీయంగా పరిస్థితి మరోలా ఉంది. రాష్ట్రపతి స్థాయిలో అమరావతి నిర్ణయాన్ని సైతం మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వ్యతిరేకిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు, అధికారం కోల్పోయిన తర్వాత కూడా రాజధాని నిర్ణయానికి వ్యతిరేకంగా ఉన్నారు. భవిష్యత్‌లో 'మావిగన్' అంటూ కొత్త రాగం ఎత్తుకున్నారు. ఇలాంటి రాజకీయ వ్యతిరేకతలు అమరావతికి ఆటంకంగా మారుతున్నాయి.పార్లమెంటు ఆమోదం ఉన్నా, రాష్ట్ర స్థాయిలో అమలుకు అనేక సాంకేతిక, న్యాయపరమైన అంశాలు ఉన్నాయి. భూమి బదిలీలు, ప్రాజెక్ట్ ఫండింగ్, స్థానిక సంస్థల మంజూరు, వ్యవసాయ పరిష్కారాల అమలు వంటి పనులు అంతులేని కార్యయజ్ఞాలుగా మారతాయి. పెట్టుబడుల ప్రవాహం, మౌలిక వసతుల బహిర్గతత, ప్రభుత్వ లాజిస్టిక్స్ అన్ని సమన్వయం కావాలి. ఇదే సమయంలో రాజకీయ ఆందోళనలు, సహకారంతో కూడని పరిస్థితులు ఈ పనులను ఆలస్యం చేస్తాయి.అమరావతి నిర్మాణం వలన ఏర్పడే ప్రత్యక్ష ప్రయోజనాలు చాలా స్పష్టంగా కనిపిస్తాయి. స్థానిక ఉపాధి అవకాశాలు, దారిద్ర్య తగ్గింపు, నగరీకరణ ద్వారా సేవల అందుబాటు. అయితే ఈ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఆలస్యాలు, వివాదాలు ఎక్కువితే రైతుల ఆర్థిక భరోసా విచ్ఛిన్నం అవుతుందని భయంకరం. ప్రత్యేకంగా భూములను ఇచ్చిన రైతులు వారి జీవనాధారం మెరుగుపడుతుంది. రైతుల హక్కులు, పునరావాసం, పరిహారం, భవిష్య రక్షణ వంటి అంశాలు చట్టపరంగా భరోసా ఇవ్వాలి.అమరావతి నిర్మాణం ప్రజల ఆశలు, ఆశయాలతో కూడిన సంకల్పం. రాజకీయ ప్రయోజనాల కోసం దీనిని సంక్లిష్టం చేయడం బాధాకరం. రాజధాని ఇబ్బందులను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటూ రాష్ట్రాన్ని ఇంకా ఎంతకాలం రాజధాని లేకుండా చేస్తారు. ఇప్పటికైనా ప్రజల్లో మార్పు రావాలి. రాజధాని కోసం అందరూ ఏకం కావాలి. తెలంగాణ తరహాల్లో ఐక్యంగా ముందుకు సాగాలి. అమరావతి నిలబడాలంటే నాయకత్వం పారదర్శకంగా, నిబద్ధతతో, ప్రజా ఆశల ప్రకారం ఆచరణలో కనిపించాలి.

# సంపాదకీయం

## జలవివాదాలకు చెక్...

దశాబ్దాలుగా కొనసాగుతున్న అంతర్రాష్ట్ర జల వివాదాలకు కేంద్ర ప్రభుత్వం పరిష్కార మార్గం చూపుతోంది. యమునా, నర్మదా, సోన్, కృష్ణా జలాల పంపిణీపై రాష్ట్రాల మధ్య అలాగే, కావేరి వివాదంపై కూడా చర్చలు కొనసాగుతున్నాయి. ఈ చర్యలతో సాగునీటి ప్రాజెక్టులు వేగవంతం కావడంతో పాటు రైతులకు నీటి భద్రత, ప్రజలకు తాగునీటి సౌకర్యం మెరుగుపడనుంది. కేంద్ర ప్రభుత్వం చొరవతో 'నీటి యుద్ధాలు' ఆగి, సాగునీటి ప్రాజెక్టులు వేగవంతం కాబోతున్నాయి. అపారమైన జల వనరులున్నా.. కేవలం వివాదాల వల్ల ఆగిపోయిన ప్రాజెక్టులకు ఈ ఒప్పందాలు కొత్త ఊపిరి పోస్తున్నాయి. దేశ అభివృద్ధిని కుంటుపరుస్తున్న కీలక అంశాల్లో అంతర్రాష్ట్ర జల వివాదాలు ఒకటి. దశాబ్దాల పాటు సాగిన న్యాయ పోరాటాల వల్ల రైతులు, సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ప్రధాని మోదీ సూచనల మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ రంగంలోకి దిగి రాష్ట్రాల ముఖ్యమంత్రులతో చర్చలు జరపడంతో పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం దొరుకుతోంది.యమునా జలాల ఒప్పందం : దాదాపు 30 ఏళ్ల నాటి హరియాణా–రాజస్థాన్ యమునా జల వివాదం పరిష్కారమైంది. ఈ ఒప్పందంతో రాజస్థాన్‌లోని షెకావతి, హరియాణా సరిహద్దు ప్రాంతాలకు అదనపు నీటి లబ్ధి చేకూరుతుంది.నర్మదా ప్రాజెక్టుల పరిష్కారం : గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల మధ్య సర్దార్ సరోవర్, ఇందిరా సాగర్ ప్రాజెక్టుల పునరావాసం, ఆర్థిక అంశాలపై 'వన్–టైమ్ సెటిల్‌మెంట్' పూర్తయింది.కిషౌ బహుళార్థసాధక ప్రాజెక్టు హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హరియాణా రాష్ట్రాల మధ్య కీలక భేటీ జరగనుంది. టోన్స్ నదిపై కిషౌ ఆనకట్ట నిర్మాణంతో లక్షలాది మందికి తాగునీరు, విద్యుత్ అందుబాటులోకి రానున్నాయి. బీహార్, జార్ఖండ్ మధ్య సోన్ నది జలాల పంపిణీకి అంగీకారం కుదిరింది. ఒప్పందం ప్రకారం.. నీటిలో జార్ఖండ్‌కు 2 మిలియన్ ఎకరా అడుగుల (ఎంఏఎఫ్) బదులు "2 హెూఖీ", బీహార్‌కు 5.75 హెూఖీ నీరు లభిస్తుంది. దీనివల్ల ఇంద్రపురి జలాశయ ప్రాజెక్టు మార్గం సుగమమైంది.కృష్ణా జలాలు: కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీపై కూడా సానుకూల సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ మధ్యనే కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులను కేంద్రం ఒక వేదికపైకి తీసుకొచ్చింది.తమిళనాడు, కర్ణాటక మధ్య దశాబ్దాలుగా రగులుతున్న 'కావేరి జల వివాదం' ఇప్పటికీ అత్యంత సున్నితంగా ఉంది. అయితే, ఈ అంశాన్ని కూడా చర్చల ద్వారా పరిష్కరించేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఇరు రాష్ట్రాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, శాస్త్రీయమైన పరిష్కారాన్ని కనుగొనేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కేంద్రం చెబుతున్న లెక్కల ప్రకారం.. ఈ పరిష్కారాల వల్ల ప్రత్యక్షంగా రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు, రాష్ట్రాలకు విద్యుత్ అందుతాయి. రాష్ట్రాల మధ్య జలవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. ఇప్పటిదాకా ఒకటిగా ఉన్న గోదావరి–కావేరీ అనుసంధాన ప్రాజెక్టును రెండు భాగాలుగా చేపట్టాలని కేంద్రం ప్రతిపాదించింది. అందులో ఒక భాగం సమ్మక్క సాగర్ నుంచి నాగార్జున సాగర్ దాకా కాగా.. రెండోది పోలవరం నుంచి చేపట్టేది. ఈ ప్రక్రియలో భాగంగా రెండు కీలక అడుగులు పడే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఒకటి.. 88 టీఎంసీలతో తెలంగాణ చేపట్టిన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఏపీ అంగీకారం తెలపాలి. దానికి బదులుగా 167 టీఎంసీలతో పోలవరం నుంచి గోదావరి–కావేరీ అనుసంధానానికి తెలంగాణ సమ్మతి తెలియజేయాలని కేంద్రం షరతు పెట్టింది. ఇందుకు రెండు రాష్ట్రాలూ సూత్రప్రాయ ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఇవి కార్యరూపం దాల్చితే తెలుగు రాష్ట్రాలకు జల వివాదాల విషయంలో శాశ్వతంగా మేలు జరుగుతుందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది. ప్రస్తుతం పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్ కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) వద్ద పెండింగ్‌లో ఉంది. 90 టీఎంసీలతో డీపీఆర్ సమర్పించగా.. నీటి కేటాయింపులపై సీడబ్ల్యూసీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ 90 టీఎంసీల్లో 45 టీఎంసీలు పోలవరం నుంచి వచ్చే వాటా కాగా.. మరో 45 టీఎంసీలు తెలంగాణలో మైనర్ ఇరిగేషన్‌లో చేసిన పొదుపు ఖాతాలోనివి. ఈ పథకానికి అనుమతివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం చాలాకాలంగా విజ్ఞప్తి చేస్తున్న సంగతి తెలిసిందే. సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ ఇటీవలే కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి.. జలవివాదాల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. తెలంగాణ విజ్ఞప్తితోనే పాలమూరు–రంగారెడ్డికి ఆమోదం తెలుపాలని ఏపీ సీఎం చంద్రబాబును సీఆర్ పాటిల్ ప్రత్యేకంగా కోరారు. పాలమూరుకు ఆమోదం తెలుపడానికి చంద్రబాబు అంగీకారం వ్యక్తం చేశారని.. అదే సమయంలో పోలవరం నుంచి గోదావరి–కావేరీ అనుసంధానానికి తెలంగాణ సమ్మతి తెలిపేలా చూడాలని ఆయన కోరారని తెలుస్తోంది. పోలవరం ప్రాజెక్టుకు అనుమతి లభిస్తే కృష్ణా డెల్టాకు తరలించే 80 టీఎంసీలకు బదులుగా సాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలు 80 టీఎంసీలు వాడుకోవాలని బచావత్ ట్రైబ్యునల్ తీర్పు ఉంది.ఆ తీర్పు మేరకు దక్కే 45 టీఎంసీలతో పాటు గోదావరి–కావేరి అనుసంధానంలో తెలంగాణకు వాటాగా ఇవ్వదలుచుకున్న 43 టీఎంసీలు కలుపుకొని 88 టీఎంసీలతో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు ఏపీ ఆమోదం తెలపాలి. అలాగే, సమ్మక్కసాగర్‌లో తెలంగాణ తన వాటా 47 టీఎంసీలు వదులుకోవాలి. గోదావరి–కావేరీ అనుసంధానంలో ఏపీ వాటాగా లభించే 45 టీఎంసీలు, కర్ణాటక వాటా 16 టీఎంసీలు(దీనికి బదులుగా బెడ్తి– హీరేవడ్డెటి లింక్ కింద 16టీఎంసీలు కర్ణాటకకు ఇవ్వడం), గోదావరిలో ఏ రాష్ట్రమూ వినియోగించుకొని వాటా కింద 15 టీఎంసీలు, జీసీ లింక్‌లో తమిళనాడు వాటా 44 టీఎంసీలు కలుపుకొని 167 టీఎంసీలతో పోలవరం నుంచి గోదావరి–కావేరి అనుసంధానం చేపట్టడానికి తెలంగాణ గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి.

నీటి లభ్యత ఉన్నచోటి నుంచి జలాలు తీసుకెళ్లి కరువు పీడిత ప్రాంతాలకు నీటిని అందించాలనే లక్ష్యంతో 1980లో నేషనల్ పర్ స్పెక్టివ్ ప్లాన్‌లో భాగంగా హిమాయలన్ కాంపోనెంట్ నుంచి పెనిన్సులర్ కాంపోనెంట్‌కు నీటిని తరలించే ప్రతిపాదన వచ్చింది. ఇదే క్రమంలో మహానది(ఒడిశా)–గోదావరి అనుసంధానం కూడా తెరమీదికి తెచ్చారు. ఈ పథకంలో కాటన్ బ్యారేజీ(ధవళేశ్వరం) ఎగువన 230 టీఎంసీలు తెచ్చి వేయాలనేది ప్రతిపాదన. ఇదే క్రమంలో గోదావరిలో 500 టీఎంసీల మిగులు జలాలకు సంబంధించి.. ఇచ్చంపల్లి నుంచి నాగార్జున సాగర్‌తో పాటు మరో నాలుగు అనుసంధాన ప్రతిపాదనలు తెరమీదికి వచ్చాయి. 2014లో రాష్ట్ర అవతవరణ అనంతరం తెలుగు రాష్ట్రాలు గోదావరిలో ఒక్క చుక్కకూడా మిగులు జలాలు లేవని వాదించడంతో ఈ ప్రతిపాదనలన్నీ పక్కనపెట్టారు. ఆ తర్వాత గోదావరిలో ఛత్తీస్‌గఢ్ మరో 50 ఏళ్లయినా వాడుకోని వాటా(148 టీఎంసీల)తో గోదావరి–కావేరీ అనుసంధానం తొలిదశను ప్రతిపాదించారు. దీనికి ఏపీ తప్ప అన్ని రాష్ట్రాలూ సూత్రప్రాయంగా అంగీకరించాయి. ఇచ్చంపల్లికి బదులుగా పోలవరం నుంచే గోదావరి–కావేరీ అనుసంధానం చేపట్టాలని ఏపీ బలంగా పట్టుబడుతున్న సంగతి తెలిసిందే.. తాజాగా పోలవరం–బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ ప్రాజెక్టును ఏపీ తెరమీదికి తెచ్చింది. దీనికి కొనసాగింపుగానే గోదావరి–కావేరీ అనుసంధానాన్ని రెండు భాగాలుగా ప్రతిపాదించారు. ఒకటి.. సమ్మక్కసాగర్(తుపాకులగూడెం) నుంచి సాగర్ దాకా 43 టీఎంసీల తరలింపు. ఈ 43 టీఎంసీలూ సాగర్ ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి పాలమూరు–రంగారెడ్డిలో వాడుకునే వెసులుబాటు ఇవ్వనున్నారు. రెండోది పోలవరం నుంచి చేపట్టే గోదావరి–కావేరి అనుసంధానం. అందులో భాగంగా ఉమ్మడి గుంటూరుజిల్లాలోని బొల్లాపల్లిలో రిజర్వాయర్ నిర్మించి, అక్కడి నుంచి టన్నెల్స్ తవ్వడం ద్వారా నీటిని తీసుకెళ్లి.. బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌లో వేయనున్నారు. ఆ తర్వాత నీటిని సోమశిలకు తరలించి, అక్కడి నుంచి కావేరి గ్రాండ్ ఆనికట్‌కు తమిళనాడు వాటా కింద 44 టీఎంసీలు ఇవ్వనున్నారు.పోలవరం నుంచి వరద జలాల ఆధారంగా గోదావరి–కావేరి అనుసంధానం చేపట్టాలని గత కొంతకాలంగా ఏపీ పట్టుబడుతున్న విషయం విదితమే. తాజా ప్రతిపాదనలు కార్యరూపం దాల్చితే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు పోలవరం నుంచి గోదావరి–కావేరీ అనుసంధానంలో తరలించే ప్రాజెక్టులను నికర జలాలతోనే చేపట్టనున్నారు. అదే జరిగితే రెండు ప్రాజెక్టుల డీపీఆర్‌లకు ఆమోదం లభించడమే కాకుండా కేంద్ర నిధులు కూడా విడుదల కానున్నాయి.

# అల్లు అర్జున్ పొలిటికల్ పార్టీ ప్రచారం...

**హైదరాబాద్, జూలై 11:** సోషల్ మీడియా సమాజానికి ఎంత ఉపయోగపడుతోందో, అంతకంటే వేగంగా పనిలేని వారి ఊహా ప్రపంచం గా మారిపోతోంది. ముఖ్యంగా గత రెండు, మూడు రోజులుగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌ను టార్గెట్ చేస్తూ సాగుతున్న రాజకీయ ప్రచారం చూస్తుంటే.. అసలు తాను కొత్త పార్టీ పెడుతున్నానన్న విషయమో, లేదా ఒకరి ప్లాన్ ప్రకారం అడుగులు వేస్తున్నానన్న విషయమో కనీసం అల్లు అర్జున్‌కైనా తెలుసా? అనే అనుమానం రాక మానదు. రాజకీయాల్లో ఉన్న స్నేహితులతో లేదా బంధువులతో ఉండే వ్యక్తిగత అనుబంధాలతో ఒకరిద్దరితో దిగిన ఫోటోలనో, పర్యటనలనో బేస్ చేసుకుని కథలు అల్లేయడం డిజిటల్ మీడియాలో ఒక ఫ్యాషన్‌గా మారిపోయింది. తన దృష్టిని పూర్తిగా పాన్–ఇండియా కెరీర్ మీదే కేంద్రీకరించిన ఒక టాప్ హీరోను బలవంతంగా రాజకీయాల్లోకి లాగడం వెనుక సోషల్ మీడియా అల్గారిథమ్స్, వ్యూస్ వేట తప్ప మరోటి కనిపించడం లేదు.ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా నడుస్తున్న ప్రచారాల్లో ప్రధానంగా మూడు సిల్లీ థియరీలు వినిపిస్తున్నాయి. మొదటిది.. అల్లు అర్జున్ ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో రహస్య చర్చలు జరిపారని, ఒక పక్కా పొలిటికల్ స్కెచ్ సిద్ధం చేసుకుంటున్నారని కొందరు రాసుకొస్తున్నారు. మరికొందరైతే ఒక అడుగు ముందుకు



వేసి.. తమిళనాడులో దళపతి విజయ్ తరహాలోనే, బన్నీ కూడా తన మామ చంద్రశేఖర్ రెడ్డి వ్యూహాలతో, పుష్ప సినిమాలలో అరెస్టుతో అవమానించిన రేవంత్ రెడ్డిని కాదని లంగాణలో కొత్త పార్టీ పెట్టి సీఎం అయిపోతారని గాల్లో మేడలు కడుతున్నారు. ఇంకొక వర్గం.. ఏపీలో జగన్ రెడ్డి ప్లాన్ ప్రకారమే అల్లు అర్జున్ అడుగులు పడుతున్నాయని, భవిష్యత్తులో అక్కడ చక్రం తిప్పుతారని సరికొత్త స్క్రిప్ట్ వండి వారుస్తున్నారు.దక్షిణాదిలో సినిమాలకు, రాజకీయాలకు విడదీయరాని బంధం ఉందనేది నిజమే. ఎన్టీఆర్, ఎంజీఆర్ లీగసీ నుంచి నిన్నటి పవన్ కల్యాణ్, నేటి విజయ్ వరకు వెండితెర ఇమేజ్‌తో రాజకీయాల్లో సక్సెస్ అయిన వారు ఉన్నారు. అయితే, ఒక నటుడు రాజకీయాల్లోకి రావాలా వద్దా అనేది అతని వ్యక్తిగత, సిద్ధాంతపరమైన నిర్ణయం. అల్లు అర్జున్ గతంలోనే తాను రాజకీయాలకు న్యూట్రల్ అని, తనకు అన్ని పార్టీల్లోనూ స్నేహితులు ఉన్నారని స్పష్టం చేశారు. కేవలం గతంలో నంద్యాల పర్యటన లేదా హైదరాబాద్ సంధ్య థియేటర్ ఘటనల తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలను బూతద్దంలో చూపిస్తూ.. ఆయనపై రాజకీయ ముద్ర వేయాలని చూడటం సరికాదు. పుష్ప–2 రికార్డుల ప్రభంజనం తర్వాత బాలీవుడ్, టాలీవుడ్‌లలో అత్యంత క్రేజ్ ఉన్న హీరోగా, వందల కోట్ల మార్కెట్ ఉన్న గ్లోబల్ స్టార్‌గా కెరీర్ పీక్స్‌లో ఉన్న బన్నీ.. ఇప్పుడప్పుడే సినిమాలు వదిలేసి పూర్తిస్థాయి రాజకీయాల్లోకి వస్తారని ఎవరూ అనుకోరు.ప్రజాస్వామ్యంలో ఎవరికైనా పార్టీ పెట్టే హక్కు, రాజకీయాల్లోకి వచ్చే అర్హత ఉన్నాయి. ఒకవేళ అల్లు అర్జున్ భవిష్యత్తులో నిజంగానే ప్రజాసేవ వైపు రావాలనుకుంటే.. ఆ విషయాన్ని ఆయనే స్వయంగా, ధైర్యంగా లౌడ్‌గా అనౌన్స్ చేస్తారు. అంతేకాని, యూట్యూబ్ థంబ్‌నెయిల్స్ కోసమో, సోషల్ మీడియాలో ట్రెండింగ్ కోసమో పనిగట్టుకుని రాసే కథనాలు పరోక్షంగా ఒక నటుడి క్యారెక్టర్ అస్సాసినేషన్ కు దారితీస్తాయి.

# సిద్దిపేట ఎల్వి ప్రసాద్ ఆసుపత్రి ప్రజల కంటికి రక్షణ కవచం..

**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**

**సిద్దిపేట:**హరీష్ రావు మాట్లాడుతూ ఎల్వి ప్రసాద్ ఆసుపత్రి ని సద్వినియోగం చేసుకోవాలి ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే నిజమైన అభివృద్ధి నియోజకవర్గం లోని అన్ని గ్రామాల్లో ఎల్వి ప్రసాద్ సేవలు అందించాం.డ్రైవర్లు కంటి పరీక్షలు చేపించుకోవాలి ఉచితంగా కంటి పరీక్షలు, అద్దాలు ఇప్పించే బాధ్యత నాది సిద్దిపేట అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నాం.సిద్దిపేట క్యాంపు కార్యాలయం లో ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ వారికి ఉచితంగా కంటి పరీక్షలు పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు.సిద్దిపేట క్యాంప్ కార్యాలయం లో ఆటో ఎలెక్ట్రికల్ అసోసియేషన్ వారికి ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వారి సౌజన్యం తో ఉచితంగా కంటి పరీక్షల కార్యక్రమం లో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. సిద్దిపేట జిల్లా కు చెందిన పేద ప్రజలకు కంటి పరీక్షలు, అవసరమైన



ఆపరేషన్లు పూర్తిగా ఉచితంగా నిర్వహించాలని ఉద్దేశ్యం తో సిద్దిపేట లో ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి ని ఏర్పాటు చేసుకున్నామని ఆర్థికంగా సామర్థ్యం ఉన్నవారు చెల్లించవచ్చు, కానీ పేదలకు మాత్రం ఎలాంటి భారం లేకుండా చికిత్స అందించేందుకు ఆసుపత్రి ఎంతో ఉపయోగ పడుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. హైదరాబాద్‌కు వెళ్లే స్థోమత లేని ఎంతో మంది మన మధ్య ఉన్నారు. అలాంటి వారికి ఇక్కడే నాణ్యమైన వైద్యం అందించాలన్నదే ఈ కేంద్రం ప్రారంభించిన ముఖ్య ఉద్దేశం. ఇప్పటికే అనేక మందికి చికిత్సలు, ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. ముఖ్యంగా మోటార్‌బైక్, బస్సు డ్రైవర్లు, మెకానిక్‌లు, ఎలక్ట్రిషియన్‌లు వంటి వృత్తుల వారికీ ఈ సేవలు ఎంతోఉపయోగ పడుతున్నాయి.40 ఏళ్ల వయస్సు దాటిన తర్వాత చాలామందికి కంటి సమస్యలు వస్తుంటాయి. కానీ చాలా మంది పరీక్షలు చేయించుకోవడాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు. అందుకే ప్రతి ఒక్కరూ తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలి.

# బొగ్గు గ్యాసిఫికేషన్ రంగంలోకి సింగరేణి..

**భూగర్భ పైలట్ ప్రాజెక్టుకు సన్నాహాలు**

హైదరాబాద్, జులై 11 బొగ్గు వినియోగంలో నూతన సాంకేతికతలను అందిపుచ్చుకునే దిశగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కీలక అడుగులు వేస్తోంది. భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ రంగంలోకి ప్రవేశించేందుకు ఈ సంస్థ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా పైలట్ ప్రాజెక్టును బెల్లంపల్లి డిప్‌సైడ్ బ్లాక్‌లో ప్రారంభించేందుకు




సన్నాహాలు జరుగుతున్నాయి. సింగరేణి అధికారులు రామగుండం, బెల్లంపల్లి ప్రాంతాల్లో ఐదు లోతైన బొగ్గు బ్లాక్‌లను గుర్తించారు. ఈ బ్లాక్‌లలో భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్‌కు అనుకూల పరిస్థితులను పరిశీలించనున్నారు. ముఖ్యంగా భీమారం, చెన్నూరు సౌత్, నైనీ ప్రాంతాల్లో గ్యాసిఫికేషన్ అవకాశాలపై అధ్యయనాలు చేపట్టనున్నారు. భూగర్భంలో ఉన్న బొగ్గును నేరుగా గ్యాస్‌గా మార్చి వినియోగించుకునే విధానమే బొగ్గు గ్యాసిఫికేషన్. ఈ సాంకేతికత ద్వారా బొగ్గు నుంచి సింథటిక్ గ్యాస్ , అమ్మోనియా, - మిగతా3లో

# SIR ఎన్యూమరేషన్ ఫామ్ ఇస్తేనే ఓటరు జాబితాలో పేరు

**సీఈఓ సుదర్శన్ రెడ్డి**

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి కీలక స్పష్టతనిచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈ వినూత్న సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు (బీూా) పంపిణీ చేసే 'ఎన్యూమరేషన్ పత్రాన్ని' పూర్తిగా నింపి సమర్పిస్తేనే రాబోయే డ్రాఫ్ట్ (ప్రాథమిక) ఓటర్ల జాబితాలో పేరు కొనసాగుతుందని స్పష్టం చేశారు. అర్హులైన ఓటర్లను గుర్తించి, బోగస్ ఓట్లను తొలగించేందుకు దాదాపు 24 ఏళ్ల తర్వాత (చివరిగా 2002లో జరిగింది) చేపట్టిన ఈ భారీ కసరత్తులో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఒకవేళ ఏవైనా కారణాల వల్ల జూలై 31న విడుదలయ్యే డ్రాఫ్ట్ జాబితాలో పేరు లేకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో క్లెయిమ్‌లు, అభ్యంతరాల గడువులోగా 'ఫామ్–6' ద్వారా కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్ వంటి ప్రధాన పట్టణ ప్రాంతాల్లో బీఎల్వోలు ఇళ్లకు రావడం లేదని, ఎన్యూమరేషన్ పత్రాలు ఇవ్వడం లేదంటూ మీడియా ప్రతినిధులు లేవనెత్తిన ప్రశ్నలపై సీఈఓ సీరియస్‌గా స్పందించారు. బీఎల్వోలు తప్పనిసరిగా ప్రతి ఇంటికీ వెళ్లి ఫామ్‌లను స్వయంగా అందజేసి, ఓటర్ల వివరాలు సేకరించాలని, ఇందులో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని కరాఖండిగా ఆదేశించారు

# తెలంగాణలో మినీ సమ్మర్



**హైదరాబాద్, జూలై 11 :**తెలంగాణలో జూలై 15 వరకు రుతుపవనాలు బలహీనపడి బ్రేక్ మాన్‌సూన్ పరిస్థితులు ఏర్పడనున్నాయి. దీనివల్ల రాష్ట్రంలో భారీ వర్షాలు కరువై.. పగటి ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. ముఖ్యంగా జూలై 12-15 మధ్య తూర్పు తెలంగాణలో 37 డిగ్రీల సెల్సియస్ నుంచి 40 డిగ్రీల సెల్సియస్ వరకు హైదరాబాద్‌లో 35 డిగ్రీల సెల్సియస్ నుంచి 37 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని చెప్పారు. దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం వల్ల తూర్పు, ఈశాన్య భారతం మినహా మిగిలిన ప్రాంతాల్లో వర్షపాత లోటు పెరుగుతోందన్నారు.తెలంగాణలో ఈసారి విచిత్ర వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. ఫిబ్రవరి మట్నదటి వారం నుంచి ఎండలు దంచకొట్టగా.. జులై నెల సగానికి వచ్చినా సరిపడా వర్షాలు లేవు. రాష్ట్రంలో రాబోయే రోజుల్లో రుతుపవనాలు మరింత బలహీనపడనున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. జూలై 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం లేదని చెప్పారు. దానికి తోడు తీవ్రమైన రుతుపవనాల విరామం పరిస్థితులు నెలకొంటాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. జూలై మాసంలో సాధారణంగా భారీ వర్షాలు కురవాల్సి ఉండగా.. ఈసారి వాతావరణం అందుకు భిన్నంగా మారి.. ఒక మినీ సమ్మర్‌ను తలపించేలా ఎండ తీవ్రత పెరగనుంది.ముఖ్యంగా జూలై 12 నుండి 15 మధ్య కాలంలో తెలంగాణలో పగటి ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగనున్నాయి. తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండి, ఉష్ణోగ్రతలు ఏకంగా 37 డిగ్రీల సెల్సియస్ నుంచి 40 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే ఛాన్సుంది. అలాగే రాజధాని హైదరాబాద్ నగరంలో కూడా పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల సెల్సియస్ నుంచి 37 డిగ్రీల సెల్సియస్ వరకు పెరగవచ్చు. తీవ్రమైన ఉక్కపోత, ఎండల కారణంగా స్థానికంగా అక్కడక్కడ వేడి ప్రభావంతో కురిసే తేలికపాటి వర్షాలు మినహా ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాకపోవచ్చునని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు.ప్రస్తుతం దేశ వాతావరణాన్ని 'ఎల్-నినో' తీవ్రంగా ప్రభావితం చేస్తోందన్నారు. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు పడుతున్నప్పటికీ, తెలంగాణతో పాటు మరికొన్ని రాష్ట్రాలు తీవ్ర వర్షపాత లోటును ఎదుర్కొంటున్నాయన్నారు. కొంకణ్, మధ్య మహారాష్ట్ర ప్రాంతాల్లో మంచి వర్షాలు కురిసినప్పటికీ, విదర్భ, మరఠ్వాడ వంటి ప్రాంతాలు ఇంకా తీవ్ర వర్షపాత లోటులోనే ఉన్నాయని చెప్పారు. జూలై ద్వితీయార్థంలో ఇక్కడ పరిస్థితులు మరింత క్షీణించవచ్చునని చెప్పారు. రాజస్థాన్, గుజరాత్, పశ్చిమ మధ్యప్రదేశ్, ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో కేవలం రుతుపవనాల ప్రారంభంలో మాత్రమే వర్షాలు పడ్డాయని.. ఆ తర్వాత అక్కడ కూడా పెద్దగా వర్షాలు లేవని చెప్పారు. మాన్సూన్ ట్రఫ్ ఉత్తర దిశగా విస్తరించడం, అలాగే ఎల్‌నినో అనుకూల వాతావరణ పరిస్థితుల వల్ల కేవలం ఒడిశా, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, ఈశాన్య రాష్ట్రాల్లో మాత్రమే మంచి వర్షాలు కురుస్తున్నాయన్నారు.ప్రస్తుతం భారతదేశం మొత్తం మీద సగటు వర్షపాతం సాధారణం కంటే మైనస్ 14 శాతం లోటుతో నడుస్తోందని చెప్పారు. రుతుపవనాలు బలహీనంగా ఉండటం వల్ల జూలై చివరి నాటికి ఈ లోటు 20 నుండి 25 శాతానికి పెరిగే ప్రమాదం ఉందన్నారు. జూలై రెండో భాగంలో కొన్ని అల్పపీడనాలు ఏర్పడినప్పటికీ.. తెలంగాణకు మాత్రం జూలై చివరి 10 రోజులు మాత్రమే వర్షాలు కురిసే ఛాన్సుందన్నారు. ఒకవేళ ఆ సమయంలో కూడా వర్షాలు కురవకపోతే.. ఇక ఆగస్టు నెలపైనే ఆశలు పెట్టుకోవాల్సి వస్తుందని చెబుతున్నారు.

### రంగారెడ్డి జిల్లా హత్యలపై మంత్రి సీతక్క దిగ్భ్రాంతి..

# కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం

**షాబాద్, దైవాలగూడ ప్రాంతాల్లో ఆరుగురిని హత్య చేసిన రాజ్ కుమార్**

**తనపై పోక్సో కేసు పెట్టి జైలుకు పంపించారని కక్ష**

**బెయిల్ పై బయటకు వచ్చిన వెంటనే హత్యలు చేసిన వైనం**



రంగారెడ్డి జిల్లా షాబాద్, దైవాలగూడ ప్రాంతాల్లో జరిగిన ఘోర హత్యల ఘటనపై రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాజస్థాన్ పర్యటనలో ఉన్న మంత్రి, ఘటన వివరాలు తెలియగానే సంబంధిత పోలీస్ కమిషనర్‌తో ఫోన్ ద్వారా మాట్లాడి సమాచారం సేకరించారు. నిందితుడిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని, కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని పోలీసు అధికారులను మంత్రి ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితులకు తక్షణం సహాయం అందించాలని, మానసిక-సామాజిక తోడ్పాటు కల్పించాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులను సూచించారు.మహిళలు, పిల్లల భద్రతకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, నేరస్థులు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని సీతక్క హెచ్చరించారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అప్రమత్తంగా ఉంటుందని స్పష్టం చేశారు. కేసు వివరాల్లోకి వెళితే... రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడలో జరిగిన దారుణ హత్యల వెనుక పోక్సో కేసు కక్ష ఉందని పోలీసు దర్యాప్తు వెల్లడైంది. నిందితుడు రాజ్‌కుమార్ (28) తనపై పోక్సో కేసు నమోదు చేసి జైలు పంపిన బాలిక, ఆమె తల్లి, నానమ్మను కత్తితో నరికి చంపాడు. అనంతరం తన భార్య సరిత (పార్వతి సరిత), 3 ఏళ్ల కుమార్తె, 2 ఏళ్ల కుమారుడిని కూడా కిరాతకంగా హత్య చేశాడు. ఈ ఘోర ఉదంతంలో మొత్తం ఆరుగురు మృతి చెందారు. గత మే 16న బాలికను వేధించాడని ఆమె తల్లి ఫిర్యాదు చేయగా, పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి మే 26న రాజ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. శుక్రవారం బెయిల్‌పై విడుదలైన వెంటనే ఈ దారుణం చేశాడని పోలీసులు తెలిపారు.

### కోదాడలో నియోజకవర్గ కేంద్రంలో 17 కోట్ల రూపాయల తో

# నూతన ఆర్టీసీ బస్ స్టేషన్‌కు శంకుస్థాపన

**మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి**





**కోదాడ:** మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గ కేంద్రం అధునాతన హంగులతో నూతన ఆర్టీసీ బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసుకొని భూమిపూజ చేసుకున్న సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు.ప్రజా పాలన ప్రభుత్వం రాగానే రాష్ట్రంలో ముఖ్యమైన ప్రాంతాల్లో ఆర్టీసీ బస్ స్టేషన్ లను నిర్మించడానికి ప్రత్యేక ప్రణాళిక ద్వారా ముందుకు పోతున్నాం.ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడగానే 48 గంటల్లో మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించాం.ఇప్పటివరకు 327 కోట్ల మంది మహిళలు జీరో టికెట్స్ ఉపయోగించుకున్నారుదాదాపు 11400 కోట్ల పైన ఉచిత ప్రయాణం చేసి డబ్బులు ఆదా చేసుకున్నారు రాష్ట్రంలో మహిళలు ఎక్కడికి వెళ్లాలన్నా ఉచితంగా బస్సు ప్రయాణం చేస్తున్నారు.రాష్ట్రంలో 65 లక్షల మంది ఆర్టీసీలో ప్రతిరోజు ప్రయాణం చేస్తుంటే అందులో 35 లక్షల మంది అక్కా చెల్లెల్లు ఉచితంగా బస్సు ప్రయాణం చేస్తున్నారు రాఖీ పౌర్ణమి రోజు చరిత్రలో నిలిచిపోయే విధంగా అక్క చెల్లెలు ప్రయాణం చేశారు.ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి ప్రయాణికుల సౌలభ్యం మూడు అంశాలు ప్రాధాన్యత గా నడుస్తుంది కొత్త నియామకాలు చేపడుతున్నాము కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నాము కారుణ్య నియమాకాలు చేపట్టాం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఆర్టీసీ కి సహకారం అందిస్తున్నారు.తెలంగాణ ఆర్టీసీని దేశంలోనే నంబర్-1 ప్రజా రవాణా సంస్థగా తీర్చిదిద్దుతాం దేశంలోనే ఎక్కడ లేని విధంగా మహిళలు ఉచితంగా ప్రయాణం చేయడమే కాదు మహిళలను ఆర్టీసీ బస్సులకు యజమానులను చేసిన ఘనత ప్రభుత్వంది.గ్రామ గ్రామాన ఎక్కడ బస్సులు అవసరం ఉంటే అక్కడికి బస్సులు నడుపుతుంది.ఉత్తమ్ కుమార్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు గా ఉన్నప్పుడు నేను వర్కింగ్ ప్రెసిడెంట్ గా పని చేశా సీనియర్ రాజకీయ నాయకులు నిరంతరం మీకోసం పని చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి,ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి,జిల్లా కలెక్టర్,ఇతర ముఖ్య నేతలు,అధికారులు పాల్గొన్నారు

# లేబర్ క్యాంపులో గంజాయి విక్రయాలు

**పోలీసుల అదుపులో ఐదుగురు పెడ్లర్లు**

**సంగారెడ్డి:**కొల్లూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మై హోమ్ సయుక్ నిర్మాణ సంస్థ లేబర్ క్యాంపు లో కార్మికులకు గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు పెడ్లర్లను పోలీసులు అరెస్ట్ చేసారు. బీహార్ రాష్ట్రం నుండి గంజాయిని తీసుకవచ్చి అమ్మేందుకు ప్రయత్నిస్తుండగ 5.5 కిలోల గంజాయి స్వాదీనం చేసుకున్నారు.బీహార్ రాష్ట్రానికి చెందిన నిందితుల్లో ప్రధాన నిందితుడు అస్సదుల్లా పరారులో ఉండగా మిగతా నలుగురు ఎండి కైఫ్, ఎండి సైఫ్, ఎండి తుఫెల్, ఎండి ఖలీమ్ లపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

# భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతగా చేపట్టాలి

- మొదటి పేజీ తరువాయి

ఆదేశించారు.భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ-సర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇందు కోసం శిక్షణ పొందిన లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లైసెన్స్ సర్వేయర్లకు ఉద్యోగం లేదా రెగ్యులరైజేషన్ హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి ములుగుమాడు గ్రామ రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేశారని గుర్తు చేశారు.తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ-సర్వే చేపట్టినట్లు తెలిపారు.రీ-సర్వేకు అవసరమైన అత్యుత్తమ నాణ్యత గల పరికరాలను జిల్లా స్థాయిలో కొనుగోలు చేయాలని, కొనుగోలు ముందు రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్లు భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుని అవసరమైన సిబ్బంది,పరికరాలు, మౌళిక వసతులు సమకూర్చాలని ఆదేశించారు.ప్రతి నెల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షిస్తామని, మార్చి-2027 నాటికి మూడు విడతల్లో రీ-సర్వే పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.రీ-సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల కోసం మరో రూ.10 చెల్లించి మొత్తం రూ.60 అందజేస్తామని తెలిపారు. చెల్లింపులు వెంటనే జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.విధుల్లో చేరని లైసెన్స్ సర్వేయర్లకు గడువిచ్చి, గడువులోగా చేరని వారి లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు. లైసెన్స్ సర్వేయర్లకు బీమా,సామాజిక భద్రత కల్పించే చర్యలు కూడా తీసుకుంటామని వెల్లడించారు. ఒక సర్వే నంబరులో కొంత భూమి మాత్రమే ప్రభుత్వ అవసరాలకు సేకరించినప్పటికీ మొత్తం భూమిని నిషేధిత జాబితాలో ఉంచడం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ చిత్రా మిశ్రా జిల్లా అధికారులతో మాట్లాడారు. జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో భూముల రీ సర్వేకు సంబంధించి.. గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. సమస్యలున్న చోట దరఖాస్తులు స్వీకరించి సత్వరం పరిష్కరించాలని పేర్కొన్నారు. గ్రామాల వారీగా జేపీఓ, ఏఈఓ, సర్వేయర్లను భాగస్వాముల్ని చేసి ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. భూములను రీ సర్వే చేసే లైసెన్స్ సర్వేయర్లు వెంటనే విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. సర్వేకు అవసరమైన పరికరాలను కొన్నింటిని ఇప్పటికే తెప్పించామని.. మరికొన్నింటిని త్వరలోనే తీసుకొస్తామని పేర్కొన్నారు.

## కేసీఆర్ కు ఏమైంది..

- మొదటి పేజీ తరువాయి

కేవలం ప్రత్యర్థి అనుభవ లోపాలపై ఆధారపడి జరుగవు. నాయకత్వం, కమ్యూనికేషన్, స్థానిక శ్రేణులలోని శక్తి సమీకరణం, సందర్భోచిత సంఘటనలు కూడా ఫలితాన్ని నిర్ణయిస్తాయి. కాబట్టి కాంగ్రెస్ విఫలమైందనే కారణంతో బీఆర్ఎస్ నిర్బంధ విజయమనే జోస్యం తాత్కాలికమే. కేసీఆర్ కూతురు పార్టీ నుంచి బయటకు వచ్చి ధైర్యంగా రాజకీయాలు చేస్తున్నారు. కేటీఆర్ మాత్రం ఇప్పటికీ తండ్రి పేరు చెప్పుకుంటున్నారు. కేసీఆరే కాబోయే ముఖ్యమంత్రి అంటున్నారు. తనను తాను సీఎంగా ప్రొజెక్టు చేసుకోలేకపోతున్నారు.బీఆర్ఎస్‌కి పెద్ద పట్టు ఉన్నా, కుటుంబ రాజకీయాలకు సంబంధించిన అనుబంధ, అంతర్గత విభాగాల ఒత్తిళ్లు, కవిత వంటి నాయకత్వ కొత్త అంశాలు పార్టీకి కొత్త సవాళ్లు తీసుకురావచ్చు. ఒక పార్టీకి నిరంతరంగా అధికారంలో ఉండటానికి సమర్థ నాయకత్వానికి తోటి స్థాయి వ్యూహపరమైన నవీనత, యువ శ్రేణుల ఆకర్షణ, పాలనా ప్రదర్శనలో నిరంతర ఉత్తేజం అవసరం. బహుశా ప్రస్తుతం బీఆర్ఎస్ కీలకంగా కనిపించినా, గెలుపు హామీ సులభంగా చెప్పలేం.తెలంగాణలో బీజేపీ ప్రభావం కూడా పెరిగింది. కేంద్ర స్థాయి మద్దతు, వనరుల వినియోగం, స్థానిక మద్దతుదారుల ఆకర్షణ వ్యూహాలు చివరికి స్థానిక బలహీనతలను ఉపయోగించవచ్చు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే అంటోంది. బెంగాల్ తర్వాత తెలంణపై ఫోకస్ పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సమయంలో బీఆర్ఎస్ కాంగ్రెస్ వైఫల్యాలను నమ్ముకోవడం కుక్క తోక పట్టుకుని గోదావరి ఈదినట్లే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.తెలంగాణ రాజకీయ స్థితి ఒకే పరీక్ష పెడుతున్న సమయం. ఈ సమయంలో పార్టీని, క్యాడర్‌ను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతిపక్ష నాయకులపై ఉంది. మరో ఏడాది గడిస్తే ఎన్నికల మూడ్ వస్తుంది ఆలోగా బలోపేతం కాకుంటే భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుంది.

## మూడింటిలో రెండు కార్పొరేషన్లపై గురి

- మొదటి పేజీ తరువాయి

ఇచ్చారు. పట్టణ ప్రాంతాలు, ముఖ్యంగా హైదరాబాద్ వంటి కాస్మోపాలిటన్ సిటీలు ఎప్పుడూ బీజేపీకి బలమైన కోటలు. లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ చుట్టుపక్కల ఎంపీ స్థానాలు గెలిచినంత మాత్రాన సరిపోదు.. ఈ మూడు కార్పొరేషన్ల ఎన్నికల్లో మన సత్తా చాటకపోతే, తెలంగాణలో అధికారం చేపడతామనే బీజేపీ కల భవిష్యత్తులో కేవలం కలగానే మిగిలిపోతుంది అని ఆయన కుండబద్దలు కొట్టారు. నేతల మధ్య ఉన్న అంతర్గత విభేదాలను పక్కనబెట్టి, కలిసికట్టుగా పోరాడకపోతే జరిగే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. గ్రేటర్‌ను విభజించడం వెనుక కాంగ్రెస్ పొలిటికల్ స్కెచ్ ఉంది. ఓల్డ్ సిటీ పరిధిలోని హైదరాబాద్ , ఐటీ కారిడార్ ఉన్న సైబరాబాద్ , ఉద్యోగులు-మధ్యతరగతి ఎక్కువగా ఉండే మల్కాజ్‌గిరి .. ఈ మూడింటికీ వేర్వేరు వ్యూహాలు కావాలని నితిన్ నవీన్ స్పష్టం చేశారు. రాష్ట్ర బీజేపీ నేతలకు ఇవి కేవలం మున్సిపల్ ఎన్నికలు కావు.. వారి సొంత రాజకీయ భవిష్యత్తును, ఉనికిని చాటుకోవడానికి ఒక అగ్నిపరీక్ష. అందుకే జాతీయ అధ్యక్షుడి పర్యటన ముగిసిన వెంటనే తెలంగాణ బీజేపీ నేతలంతా గ్రేటర్ మున్సిపల్ పరిధిపై అంతర్గత కసరత్తు తీవ్రం చేశారు. గత 2020 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 48 స్థానాలు గెలుచుకుని బీఆర్ఎస్ గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. ఇప్పుడు బీఆర్ఎస్ బాగా బలహీనపడిన తరుణంలో.. ఆ ఓటు బ్యాంక్ కాంగ్రెస్ వైపు వెళ్లకుండా పూర్తిగా తమ వైపు తిప్పుకోవడమే బీజేపీ ముందున్న అసలైన టాస్క్.కొత్తగా ఏర్పడిన సైబరాబాద్ , మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల పరిధిలో ఐటీ ఉద్యోగులు, వలస ప్రజలు, ఇతర రాష్ట్రాల ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. ఈ సెగ్మెంట్ సాంప్రదాయకంగా ప్రధాని మోదీ నాయకత్వాన్ని ఇష్టపడుతుంది కాబట్టి, ఇక్కడ క్షేత్రస్థాయిలో సరైన అభ్యర్థులను నిలబెడితే మేజర్‌గా లాభపడొచ్చని బీజేపీ భావిస్తోంది. ఇటు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సంక్షేమ పథకాలు, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు బూచీని చూపిస్తూ గ్రేటర్ ఓటర్లను ఆకట్టుకోవాలని చూస్తోంది. ఈ తరుణంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ, మూడు కార్పొరేషన్ల పరిధిలోని 300 డివిజన్లలోనూ బూత్ స్థాయి కమిటీలను పటిష్టం చేసే పనిలో బీజేపీ శ్రేణులు నిమగ్నమయ్యాయి.ఈ త్రిముఖ కార్పొరేషన్ పోరు తెలంగాణ భవిష్యత్తు రాజకీయ గమనాన్ని మార్చనుంది. కాంగ్రెస్ అధికార బలాన్ని, వ్యూహాలను తట్టుకుని నిలబడాలంటే బీజేపీ కేవలం సోషల్ మీడియా పాలిటిక్స్ నమ్ముకుంటే సరిపోదు.. క్షేత్రస్థాయిలో రోడ్ల పైకి వచ్చి పోరాడాల్సి ఉంటుంది. జాతీయ నాయకత్వం పంపిన అల్టిమేటంతో అప్రమత్తమైన తెలంగాణ బీజేపీ లీడర్లు.. ఈ ఎన్నికలను జీవన్మరణ సమస్యగా భావించి సరికొత్త కార్యాచరణతో ముందుకు కదులుతున్నారు. ఒకవేళ ఈ మూడు స్థానాల్లో బీజేపీ మెజారిటీ సాధిస్తే.. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామేనని నిరూపించుకునే గోల్డెన్ ఛాన్స్ దక్కుతుందని పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు.

## గంటల్లోనే చెన్నై, ముంబై..
## తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్లు

- మొదటి పేజీ తరువాయి

కేవలం ఒక గంట పది నిమిషాల్లోనే చేరుకోవచ్చని రైల్వే మంత్రి వివరించారు. అలాగే వ్యాపార రాజధాని ముంబైకి రెండు గంటల ఇరవై నిమిషాలు, అటు చెన్నై నగరానికి కేవలం రెండు గంటల్లోనే దూసుకుపోవచ్చని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ దేశ రవాణా రంగంలోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. ఇదే గ్యాప్‌లో ఈ ప్రాజెక్టుల క్రెడిట్ కోసం కొందరు పాకులాడుతున్నారంటూ విపక్షాలపై మంత్రి మండిపడ్డారు. దీని పూర్తి క్రెడిట్ ప్రధాని మోదీకే దక్కుతుందని, గత యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో కేవలం రూ. 800 కోట్లు మాత్రమే ఇస్తే, తమ ప్రభుత్వం ఒక్క తెలంగాణకే ఏకంగా రూ. 5000 కోట్ల రైల్వే నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. ఈ నిధుల వరద వల్లే రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులు పరుగులు పెడుతున్నాయనిస్పష్టం చేశారు.

## స్ట్రాటజీ సర్వే వర్కౌట్ అవుతుందా...

- మొదటి పేజీ తరువాయి

అలవాటును కొనసాగిస్తున్నారని విమర్శిస్తున్నారు.తాము బీఆర్ఎస్ నాయకుల్లాగా కేవలం కాగితాలపై ఉండే సర్వేలను నమ్ముకుని రాజకీయం చేయమని, క్షేత్రస్థాయిలో ప్రజల కోసం పనిచేస్తామని కాంగ్రెస్ స్పష్టం చేస్తోంది. అధికారంలోకి వచ్చిన నాటి నుండి అమలు చేస్తున్న ప్రజా రంజక పాలన, ఆరు గ్యారెంటీలపైనే తమకు నమ్మకం ఉందని, ఇలాంటి మైండ్ గేమ్స్‌కు భయపడే ప్రసక్తే లేదని కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణలో సర్వేల రాజకీయం కొత్తేమీ కాదు. అయితే, కేవలం సర్వేలను నమ్ముకుని సంబరపడితే మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. గతంలో దేశవ్యాప్తంగా, అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ పలు రాజకీయ పార్టీలు అంతర్గత, ఐవీఆర్ఎస్, మీడియా సర్వేలను నమ్మి, క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరించి బొక్కబోర్లా పడ్డ ఉదాహరణలు అనేకం ఉన్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూడా బీఆర్ఎస్ అనుకూలంగా అనేక సర్వేలు వచ్చాయని, కానీ క్షేత్రస్థాయిలో ప్రజల మూడ్ వేరేలా ఉందనే విషయాన్ని గ్రహించకపోవడం వల్లే ఆ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.సర్వేలు అనేవి ఒక నిర్దిష్ట సమయంలో ప్రజల మానసిక స్థితిని అంచనా వేయడానికి మాత్రమే పనికొస్తాయి. కానీ అవి శాశ్వత విజయానికి గ్యారెంటీ ఇవ్వలేవు. నిజమైన ప్రజాభిమానం క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించినప్పుడు, వారి నమ్మకాన్ని గెలుచుకున్నప్పుడు మాత్రమే లభిస్తుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## బొగ్గు గ్యాసిఫికేషన్ రంగంలోకి సింగరేణి..

- మొదటి పేజీ తరువాయి

హైడ్రోజన్ వంటి విలువైన ఉత్పత్తులను తయారు చేసే అవకాశాలు ఉంటాయి. భవిష్యత్‌లో ఇంధన రంగంలో ప్రత్యామ్నాయ మార్గాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సింగరేణి ఈ ప్రాజెక్టుపై దృష్టి పెట్టింది. కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల అమలు విధానాలను అధ్యయనం చేసేందుకు సింగరేణి ప్రత్యేక బృందం ఇతర ప్రాంతాల్లో పర్యటించనుంది. అలాగే అమ్మోనియం నైట్రేట్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రత్యామ్నాయ అవకాశాలను కూడా పరిశీలించనుంది. ఈ ప్రాజెక్టు అమలులో కేంద్ర ప్రభుత్వం అందించే వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ వినియోగంపై సింగరేణి దృష్టి సారిస్తోంది. ప్రాజెక్టు సాంకేతికంగా విజయవంతం కావడానికి సీఎంఐఎఫ్ఆర్ ) శాస్త్రవేత్తల సాంకేతిక సహకారం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. బొగ్గు ఆధారిత ఇంధన వ్యవస్థను మరింత ఆధునీకరించడం, బొగ్గు నిల్వలను సమర్థవంతంగా వినియోగించడం, విలువ ఆధారిత ఉత్పత్తులను పెంచడం వంటి లక్ష్యాలతో సింగరేణి చేపడుతున్న ఈ చర్యలు కీలకంగా మారనున్నాయి.

వార్తాతరంగాలు

ఆదివారం 12 జూలై 2026

## రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రం పోక్సో కేసులకు అడ్డాగా మారింది



**హైదరాబాద్:**పోక్సో నిందితులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎందుకింత ప్రేమని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. రాఉ్ం పోక్సో కేసులకు అడ్డాగా మారిందని అయన ఆరోపించారు.బండి భగీరథ్ ను 9 రోజులు అరెస్ట్ చేయలేదు. రాజ్ కుమార్ ను 55 రోజులు అరెస్ట్ చేయలేదు. ఫ్యూచర్ సిటీలో అమ్మాయిలకు రక్షణ లేదు. రియల్ ఎస్టేట్ దందా చేసే రేవంత్ బంధువులకే రక్షణ కల్పిస్తున్నారు. ఆరుగురి అమాయకుల హత్య ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు.రేవంత్ రెడ్డి పాలనలో అమ్మాయిలకు రక్షణ లేదు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రం పోక్సో కేసులకు అడ్డాగా మారింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 18 గంటల రివ్యూ చేసిన తర్వాత కూడా, పోక్సో నిందితులకు బెయిల్ లభిస్తుంది. నిందితుడిపై కేసు పెట్టిన తర్వాత 50 రోజుల వరకు అరెస్ట్ చేయలేదు. నిందితుడు ఆంటిసిపేటరీ బెయిల్ తీసుకుంటుంటే పోలీసులు ఏం చేశారు? నిందితుడు ఆరుగురు చంపిన తర్వాత కూడా పోలీసులు ఇంకా అరెస్ట్ చేయలేదు. నిందితుడు ఇంకా పరారీలో ఉన్నాడు. పోలీసులు సరైన సమయంలో స్పందించి, నిందితున్ని అరెస్ట్ చేసి జైలుకు పంపితే ఇంతటి దారుణం జరిగేది కాదు. ఫ్యూచర్ సిటీ కమీషనరేట్ పరిధిలోనే ఈ దారుణం జరిగింది. ఫ్యూచర్ సిటీ కమీషనరేట్ పరిధిలో అమ్మాయిలకు రక్షణ లేదు. ఇటీవల బండి సంజయ్ కొడుకు బండి భగీరథ్ ను కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం 9 రోజుల వరకు అరెస్ట్ చేయకుండా కాపాడింది. అలాగే రాజ్ కుమార్ అనే నిందితున్ని 55 రోజులుగా అరెస్ట్ చేయకుండా కాపాడారు. ఇపుడు ఆ నిందితుడే ఆరుగురిని చంపి పరారీలో ఉన్నాడు. నిందితుడు యాంటిసిపేటరీ బెయిల్ తెచ్చుకుంటే పోలీసులు ఏం చేశారు. బాధిత కుటుంబం ప్రాణ భయం ఉందని చెప్పిన తర్వాత కూడా పోలీసులు పట్టించుకోలేదు. బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి వెళితే అరెస్ట్ చేశారు. షాబాద్ పోలీస్ స్టేషన్ ముందు వేలాది మంది ధర్నా చేస్తుంటే..రేవంత్ రెడ్డి ఖమ్మం పిక్నిక్ టూర్ లో బిజీగా ఉన్నారు. ఇప్పటివరకు మరణించిన వారికి పోస్ట్ మార్టం చేసే దిక్కు లేదు. అరెస్ట్ చేసిన సబితా ఇంద్రా రెడ్డి,సత్యవతి రాథోడ్ ని వెంటనే వదిలేయాలని అన్నారు.

## మాలల హక్కులే నాకు ముఖ్యం

**మంత్రి వివేక్**



**హైదరాబాద్:**తనకు పదవుల కంటే , మాలలు హక్కులే ముఖ్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి అన్నారు. రోస్టర్ పాయింట్స్ సవరించాలని డిమాండ్ చేస్తూ ఖైరతాబాద్లోని చింతల బస్తీలో ది నేషనల్ అంబేద్కర్ సేన అధ్యక్షుడు మన్నే శ్రీధర్ చేపట్టిన అమరణ నిరాహార దీక్షకు మంత్రి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మాలలు ఐక్యంగా ఉద్యమించినప్పుడే హక్కులు దక్కుతాయన్నారు. ఎస్సి వర్గీకరణ కారణంగా మాలలు అన్యాయానికి గురవుతున్నారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. రోస్టర్ పోయింట్లు సవరించి , మాలలకు దక్కాల్సిన ఐదు శాతం రిజర్వేషన్లు సాధించేందుకు తాను ముందుంటానని స్పష్టం చేశారు. ఎస్సీ గ్రూప్-3లోని మాలలతో పాటు 25 ఉపకులాలకు మొదటి రోస్టర్ పాయింట్లు ప్రస్తుతం ఉన్న 22వ స్థానం నుంచి 16వ స్థానానికి మార్చాలని నిరసనకారులు ప్రభుత్వాన్ని కోరారు. చేవెళ్ల డిక్లరేషన్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లను 15 శాతం నుంచి 18 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. పెంచే అదనపు 3 శాతం రిజర్వేషన్లను మాల ఉపకులాలకే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నేషనల్ అంబేద్కర్ సేన నాయకులు హెచ్చరించారు.

## ఈ నెల 14న తెలంగాణ వ్యాప్తంగా కళాశాలల బంద్ కు పిలుపునిచ్చిన ఏబీవీపీ

**ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విషయంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందన్న ఏబీవీపీ**

**వీటిపై ఆధారపడి 20 లక్షల మంది విద్యార్థులు చదుకుంటున్నారని వెల్లడి**

**ప్రభుత్వం, ప్రైవేట్ కాలేజీలు కలిసి విద్యార్థులను మోసం చేస్తున్నాయని మండిపాటు**




ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై తెలంగాణ ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని ఏబీవీపీ విమర్శించింది. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లలో జరుగుతున్న ఆలస్యాలను నిరసిస్తూ ఈ నెల 14న రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల బంద్‌కు పిలుపునిస్తున్నట్టు ఏబీవీపీ ప్రకటించింది. వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించిన ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు ఈ ప్రకటన చేశారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి చదువుకుంటున్నారని రాంబాబు తెలిపారు. ప్రభుత్వం సకాలంలో ఫీజు విడుదల చేయకపోవడంతో రూ. 11 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రతి సంవత్సరం 2 లక్షల మంది విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారని, వేల మంది సర్టిఫికెట్లు తీసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ప్రైవేట్ కాలేజీలు, ప్రభుత్వం కలిసి విద్యార్థులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కేంద్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర నాయకులు మదూరి సందీప్ రావు, జూపల్లి దీపిక, ఆరిపెల్లి సుజిత్, బెల్లం కార్తీక్, వేల్పుల రాజ్‌కుమార్, గుగులోత్ నవీన్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

## ఎంత ఖర్చైనా నేనున్నా: చిన్నారి ప్రాణాలు కాపాడేందుకు రాజగోపాల్ రెడ్డి అభయం

**మరోసారి తన ఉదారతను చాటుకున్న రాజగోపాల్ రెడ్డి**

**తన మనవడిని కాపాడాలంటూ రాజగోపాల్ రెడ్డిని ఆశ్రయించిన వృద్ధుడు**

**తన ఫౌండేషన్ ద్వారా పూర్తి వైద్యం చేయిస్తానన్న రాజగోపాల్ రెడ్డి**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి తన ఉదారతను చాటుకొని ఒక నిరుపేద కుటుంబానికి కొండంత అండగా నిలిచారు. తల్లిదండ్రులు లేక, తీవ్ర అనారోగ్యంతో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఒక చిన్నారికి తమ స్వచ్ఛంద సంస్థ ద్వారా పూర్తి ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చి పెద్ద మనసు చాటుకున్నారు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న తన మనవడిని బతికించాలంటూ ఒక వృద్ధుడు కన్నీరుమున్నీరవుతూ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని ఆశ్రయించారు. తనకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని, ఆ చిన్నారి మాత్రమే తనకున్న ఏకైక ఆస్తి అని, ఎలాగైనా కాపాడాలని ఆ తాత ఎమ్మెల్యే కాళ్లపై పడి తన ఆవేదనను వెళ్లగక్కారు. ఆ వృద్ధుడి కష్టాన్ని చూసి చలించిపోయిన రాజగోపాల్ రెడ్డి తక్షణమే స్పందించారు. ఆ చిన్నారి ప్రాణాలు కాపాడటానికి ఎంత ఖర్చైనా వెనకాడేది లేదని స్పష్టం చేశారు. తమ ఫౌండేషన్ ద్వారా ఆపరేషన్ తో పాటు పూర్తి ఉచిత వైద్యం అందించి, బాబును మళ్లీ ఆరోగ్యంగా ఇంటికి పంపే బాధ్యత తనదేనని కొండంత భరోసా ఇచ్చారు. ఆపదలో ఉన్న తమను దేవుడిలా ఆదుకోవడానికి ముందుకు వచ్చిన ఎమ్మెల్యేకు ఆ వృద్ధుడు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో బాగా వైరల్ అవుతోంది.

# ఇంటి సమస్యను అధిగమించేది ఎలా...?

### కేటీఆర్, కవితకు సేమ్...సీన్



**హైదరాబాద్, జూలై 11:**తెలంగాణ రాజకీయాల్లో గులాబీ గూటి పంచాయితీ ఇప్పుడు ఊహించని మలుపు తిరిగింది. నిన్నమొన్నటి వరకు కేవలం అంతర్గత విభేదాలుగా భావించిన వ్యవహారం, ఇప్పుడు ఏకంగా పార్టీ మూలాలనే కదిలించే స్థాయికి చేరింది. సొంతంగా 'తెలంగాణ రక్షణ సేన' పార్టీ పెట్టుకున్న కల్వకుంట్ల కవిత, ఇప్పుడు దీ=ా అగ్ర నాయకత్వంపై, ముఖ్యంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లక్ష్యంగా చేస్తున్న ఆరోపణలు రాజకీయ గీతల్ని దాటిపోతున్నాయి. నిన్నటి వరకు రాజకీయ విమర్శలకే పరిమితమైన కవిత.. ఈసారి నేరుగా బీఆర్ఎస్ బ్యాంక్ అకౌంట్లలో ఉన్న పార్టీ ఫండ్, క్విడ్ ప్రో కో వ్యవహారాలను వీధిలోకి లాగడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. బీఆర్ఎస్ ను బద్నాం చేయడంలో ఇప్పుడు ప్రత్యర్థి పార్టీలకంటే కవిత పాత్రే ఎక్కువగా కనిపిస్తుండటం గమనార్హం.బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల అధికార కాలంలో కూడబెట్టిన 1400 కోట్ల నిధులపై కవిత చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి. తెలంగాణ ప్రజల సొమ్మును గత ప్రభుత్వ హయాంలో ఆంధ్రా కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని, దానికి ప్రతిఫలంగా ఆ కాంట్రాక్టర్ల నుండి భారీగా కమిషన్లు వసూలు చేసి బీఆర్ఎస్ పార్టీ ఫండ్‌గా మార్చారని ఆమె నేరుగానే ఆరోపిస్తున్నారు. సొంత పార్టీ అధినాయకత్వంపైనే, అది కూడా క్విడ్ ప్రో కో కోణంలో ఇంత పెద్ద ఎత్తున ఆర్థిక మూలాలపై దాడి చేయడం సాధారణ విషయం కాదు. గతంలో కేసీఆర్ అవినీతి రహిత పాలన అందించారని చెప్పుకునే గులాబీ శ్రేణులకు ఇప్పుడు ఈ ఆరోపణలు మింగుడుపడటం లేదు.గతంలో బీఆర్ఎస్ పార్టీ జాతీయ రాజకీయాల్లోకి వెళ్లేందుకు ఒక సొంత విమానాన్ని కొనుగోలు చేసిందనే ప్రచారం విస్తృతంగా సాగింది. ఆ వివాదం అలా ఉంచితే, తాజాగా జాతీయ ఆంగ్ల దినపత్రిక 'ది పయనీర్' ను కూడా పార్టీ నిధులతోనే కొనుగోలు చేశారంటూ కవిత సరికొత్త బాంబు పేల్చారు. తనను పార్టీ నుంచి వెళ్లిపోయేలా చేసి.. వందల కోట్ల పార్టీ ధనాన్ని వాడుకుంటూ కేటీఆర్ తన సొంత సామ్రాజ్యాన్ని నిర్మించుకుంటున్నారని, మీడియా సంస్థలను చేతుల్లోకి తీసుకుని బలపడుతున్నారనే ఆవేదన, ఆగ్రహం కవిత మాటల్లో స్పష్టంగా కనిపిస్తోంది.పార్టీలో తనకు ప్రాధాన్యత లేకపోవడంతో కవిత 'తెలంగాణ రక్షణ సేన' అని పేరుతో పార్టీ పెట్టుకున్నారు. కానీ కేటీఆర్ ఆ పేరు రాకుండా పెద్ద ఎత్తున లాబీయింగ్ చేశారని కవిత నమ్ముతున్నారు. తెలంగాణ సెంటిమెంట్ బలాన్ని తాను పొందేందుకు, గ్రౌండ్ లెవెల్‌లో క్యాడర్‌ను సమీకరించుకునేందుకు తాను కొత్తగా టీఆర్ఎస్ పేరుతో పొలిటికల్ ప్లాట్‌ఫారమ్‌ను పునరుద్ధరించాలని చేస్తున్న ప్రయత్నాలను కేటీఆర్ తీవ్రంగా అడ్డుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ పేరును తానే రిజిస్టర్ చేయించుకుని కవితకు చెక్ పెట్టాలని కేటీఆర్ చూడటంతో ఆమెలో అసహనం కట్టలు తెంచుకుంది. అటు సెంటిమెంట్ పేరు దక్కకపోవడంతో.. నైతికంగా దెబ్బకొట్టే ప్రయత్నం చేస్తున్నారు.రాజకీయాల్లో ప్రత్యర్థులు చేసే ఆరోపణలకు, సొంత కుటుంబ సభ్యులు.. అదీ మాజీ ముఖ్యమంత్రి కూతురు చేసే ఆరోపణలకు చాలా వ్యత్యాసం ఉంటుంది. ప్రతిపక్షాలు ఎంత మొత్తుకున్నా రాని మైలేజ్, ఇప్పుడు కవిత చేసిన వ్యాఖ్యల ద్వారా బీఆర్ఎస్ వ్యతిరేక పార్టీలకు సులువుగా దొరికింది. బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్ కుటుంబాన్ని టార్గెట్ చేయడానికి ఇంతకంటే బలమైన అస్త్రం ప్రత్యర్థులకు దొరకదు. కవిత చేసిన ఈ క్విడ్ ప్రో కో, 1400 కోట్ల కమిషన్ల ఆరోపణలు బీఆర్ఎస్ పార్టీని నైతికంగా కోలుకోలేని దెబ్బతీసే అవకాశం ఉంది.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో డ్యూయల్ బ్రాండింగ్ రాజకీయం

**ఖమ్మం, జూలై 11:**రాజకీయాల్లో ఎప్పుడు, ఏ రంగులు ఎవరికి అంటుకుంటాయో ఊహించడం ఎవరి తరం కాదు. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో నడుస్తున్న డ్యూయల్ బ్రాండింగ్ రాజకీయం చూస్తుంటే అలాగే ఉంటుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని ప్రత్యర్థులు ఎప్పుడూ టీడీపీ ఖాతాలోనే వేస్తుంటారు. అదే సమయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపై వైసీపీ మార్క్ వేయడానికి ట్రై చేస్తుంటారు. అయితే, ఈ పొలిటికల్ ట్యాగ్‌లు కేవలం మాటలకే పరిమితం కాకుండా.. ఇప్పుడు ఏకంగా అధికారిక సభల ఫ్లెక్సీల సాక్షిగా బట్టబయలు కావడం ఖమ్మం జిల్లాలో పెద్ద హాట్ టాపిక్‌గా మారింది.ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో నిర్వహించన రైతు ఆశీర్వాద సభ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కలిసి హాజరవుతున్నారు. ఇద్దరూ కలిసి ఒకే వేదికపైకి వస్తుండటంతో, జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు భారీగా ఏర్పాట్లు చేశాయి. అయితే, సభా ప్రాంగణంతో పాటు ఇరువైపులా ఉన్న రోడ్ల పొడవునా వెలిసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు ఇప్పుడు అసలు మ్యాటర్‌ను పక్కనబెట్టి జనాలకు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇస్తున్నాయి. ఇద్దరు నేతలకు వారి వారి పాత, కొత్త సానుభూతిపరులు వేర్వేరుగా డిజైన్ చేసిన ఫ్లెక్సీలు కట్టడమే ఇందుకు కారణం.ఒకవైపు రేవంత్ రెడ్డికి స్వాగతం పలుకుతూ స్థానిక టీడీపీ సపోర్టర్లు, పాత మిత్రులు పెద్ద ఎత్తున బ్యానర్లు కట్టారు. రేవంత్ రెడ్డి పొలిటికల్ హిస్టరీని గుర్తుచేస్తూ, ఆయనలోని పాత లీడర్‌ను ఓన్ చేసుకునేలా ఈ బ్యానర్లు ఉన్నాయి. ఇక దీనికి పోటీగా.. మరోవైపు భట్టి విక్రమార్కకు మద్దతుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సపోర్టర్లు, వైఎస్సార్ అభిమానులు పోస్టర్లు, ఫ్లెక్సీలు వేసి కలరింగ్ ఇచ్చారు. ఒకే కాంగ్రెస్ ప్రభుత్వంలో నంబర్-1, నంబర్-2 స్థానాల్లో ఉన్న ఇద్దరు నేతలకు.. ఇటు తెలుగుదేశం, అటు వైసీపీ శ్రేణులు పోటీ పడి మరీ ఓన్ చేసుకోవడం చూసి, అసలు అక్కడ జరుగుతోంది కాంగ్రెస్ సభేనా? లేక ఆంధ్రప్రదేశ్ పాలిటిక్స్ ఏమైనా షిఫ్ట్ అయ్యాయా? అని స్థానిక రైతులు ముక్కున వేలేసుకుంటున్నారు.రేవంత్ రెడ్డిని టీడీపీ వాడిగా, భట్టిని వైసీపీ వాడిగా ప్రజలు ముద్ర వేస్తుంటే.. వాటన్నింటినీ భరిస్తూ హస్తం గుర్తు కింద ఇద్దరూ కలిసి పాలిస్తున్నారు. కాస్త ఆలోచిస్తే ఇది కాంగ్రెస్ కు మేలే. అటు టీడీపీ, ఇటు వైసీపీ సానుభూతిపరుల మద్దతు కాంగ్రెస్ కే లభిస్తుంది.



# ఈటెల వ్యూహం ఏమిటీ



**కరీంనగర్, జూలై 11:**బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు పార్టీలో చర్చనీయాంశమయ్యాయి. తనకు తెలంగాణ రాష్ట్రం ముఖ్యమని, ఆ తర్వాతే పార్టీ అని, ఆ తర్వాతే వ్యక్తిగతమని ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీలో లోతైన చర్చకు కారణమయింది. ఈటల రాజేందర్ మావోయిస్టుల నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన తెలంగాణ రాష్ట్ర ఉద్యమం నుంచి బీఆర్ఎస్ లో పనిచేశారు. బీఆర్ఎస్ ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నప్పటికీ ఆయన తనదైన ముద్రను వేసుకున్నారు. బీసీ నేతగా ఉన్న ఈటల రాజేందర్ తొలి నుంచి వివాదాలకు దూరంగా ఉన్నారు. అయితే బీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ తో పొసగకపోవడంతో పాటు ఆయన వైఖరిని వ్యతిరేకించడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేశారు.. దీంతో ఈటల రాజేందర్ ఈటల రాజేందర్ బీజేపీ లో చేరారు. హుజారాబాద్ లో ఓటమి పాలయినా 2024 ఎన్నికల్లో ఈటల రాజేందర్ మల్కాజ్ గిరి నుంచి బీజేపీ తరుపున పోటీ చేసి ఎన్నికయ్యారు. అయితే సామాజికవర్గం కోటాలతోతనకు మంత్రి పదవి లభిస్తుందని ఆశించారు. కానీ రాకపోవడంతో పాటు తాను గతంలో ప్రాతినిధ్యం వహించిన హుజూరాబాద్ కు మాత్రం ఆయనను దూరం చేయడంతో పాటు పార్టీలో సరైన ప్రాతినిధ్యం కల్పించకపోవడంతో కొంత ఈటల రాజేందర్ ఇబ్బందులు పడుతున్నారని గతంలోనూ ప్రచారం జరిగింది. అయితే తిరిగి బీఆర్ఎస్ లో చేరతారన్న ప్రచారాన్ని డు ఈటల రాజేందర్ కొట్టిపారేశారు. కానీ ఇటీవల ఒక వివాహ వేడుకలో మాజీ మంత్రి కేటీఆర్ ను కలవడం, ఆయన కుటుంబ సభ్యులతో కలసి మాట్లాడటంతో మరొకసారి ఈ ప్రచారం ఊపందుకుంది. కానీ ఈటల రాజేందర్ మాత్రం తాను బీజేపీలోనే కొనసాగుతానని చెబుతున్నారు. కానీ ఆయన ఉన్నట్లుండి తనకు తెలంగాణ ముఖ్యమని ఎందుకన్నారు? పార్టీ తర్వాతేనని అన్న మాటకు అర్థం ఏంటన్న దానిపై కూడా బీజేపీ రాష్ట్ర నేతలు ఆరా తీస్తున్నారు. ఈటల బీజేపీలో ఇమడలేకపోతున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. మొదట తనకు మంత్రిగా అవకాశం వస్తుందనుకున్నారు. ఆ తర్వాత బీజేపీ అధ్యక్ష పదవి దక్కుతుందన్న ప్రచారం జరిగినా, ఎప్పటికప్పుడు చెక్ పెడుతూ వచ్చారు తన వైరి వర్గం నేతలు. ఆ తర్వాత కొంత సైలెంట్ గా ఉన్నా, కాళేశ్వరం విషయంలో ఈటల రాజేందర్ దూకుడుగా మాట్లాడుతున్న తీరు ఇప్పుడు చర్చనీయాంశం అయ్యింది.కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ వద్ద ఉన్న కన్నేపల్లి పంప్ హౌజ్ నుండి వాటర్ లిఫ్టింగ్ పై కొంతకాలంగా కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. బీజేపీ దాదాపు సైలెంట్ గా ఉన్నా, ఈటల మాత్రం వాయిస్ బీఆర్ఎస్ కు అనుకూలంగా పెంచుతూ వస్తున్నారు. అవినీతి వల్ల మేడిగడ్డ కుంగింది, వాటర్ లిఫ్టింగ్ సాధ్యం కాదని సీఎం రేవంత్, ప్రభుత్వం వాదిస్తుంటే... వాటర్ లిఫ్టింగ్ సాధ్యమేనని బీఆర్ఎస్ వాదిస్తుంది. బీఆర్ఎస్ వాదనను ఎంపీ ఈటల స్ట్రాంగ్ గా సపోర్ట్ చేస్తూ వస్తున్నారు.అవినీతి విషయంలో, అరెస్టుల విషయంలోకి నేను రాను. కానీ కన్నేపల్లి వద్ద ప్రభుత్వం రాజకీయంగా చూస్తూ వాటర్ లిఫ్ట్ చేయటం లేదన్నది ఈటల వాదన. తాను ఎవరో మాట్లాడిస్తే మాట్లాడే వాడిని కాదని, తెలంగాణ మట్టిబిడ్డను, ఉద్యమకారుడిని కాబట్టి అడుగుతున్నా. రైతుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటానంటూ ఈటల మరోసారి స్పందించారు.ఇటీవల మాజీ ఎంపీ వినోద్ కొడుకు పెళ్లిలో కేటీఆర్ దంపతులతో ఈటల ఉన్న వీడియోలు వైరల్ కావటం, ఇప్పుడు ఉద్యమకారుడిని అంటూ చెప్తూనే కాళేశ్వరం విషయంలో బీఆర్ఎస్ వాదనతో ఏకీభవించటం, బీజేపీలో ఉన్న గ్రూప్ రాజకీయాలను చూస్తుంటే... ఈటల మనసు మారుతోందా? అన్న అనుమానాలు బలపడుతున్నాయని, రాజకీయాల్లో శాశ్వత శత్రువులు- శాశ్వత మిత్రులు ఉండరన్న విషయం మర్చిపోరాదని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.యాధృచ్ఛకంగా అన్న మాటలేనా? లేక ఇందులో ఏదైనా అంతరార్థం ఉందా? అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. అయితే ఆయన బీఆర్ఎస్ లో చేరనని చెప్పడంతో బీజేపీలోనే కొనసాగుతూ తన అసంతృప్తిని వెళ్లగక్కే అవకాశముందని కూడా అంటున్నారు. తనను కేవలం ఒక ప్రాంతానికే పరిమితం చేయడంపైన కూడా ఈటల రాజేందర్ గుర్రుగా ఉన్నట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎంత వరకైనా పోరాడాతానని ఈటల అనడం పైనా కూడా సోషల్ మీడియాలో వివిధ కామెంట్స్ వినపడుతున్నాయి. ఇప్పటికే బండి సంజయ్, కిషన్ రెడ్డిలతో ఈటల రాజేందర్ కు అంత సంబంధాలు మంచిగా లేవని, ఈటల రాజేందర్ ఎందుకు అన్నారన్నది కాలమే నిర్ణయిస్తుందని అంటున్నారు.

## రంగారెడ్డిలో దారుణం

**హైదరాబాద్, జూలై 11:**రంగారెడ్డి జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. రాజ్ కుమార్ అనే వ్యక్తి ఆరుగురిని కత్తితోపోడిచి దారుణంగా హత్య చేశాడు. భార్య, ఇద్దరు పిల్లలతో పాటు మరో ముగ్గురిని హత్య చేశాడు. పోక్సో కేసు పెట్టారన్న కక్షతో నిందితుడు ఈ హత్యకు పాల్పడ్డాడు. మే 16వ తేదీన బాధితురాలి తల్లి కేసు పెట్టారు. ఈ నేపథ్యంలో 28 సంవత్సరాల వయస్సున్న రాజ్ కుమార్ బెయిల్‌పై తిరిగొచ్చి కక్షతో బాధిత బాలిక, బాలిక తల్లి, నానమ్మ, నిందితుడి భార్య సరిత, మూడేళ్ల కుమార్తె, రెండేళ్ల కుమారుడు హత్యకు గురైనట్లు పోలీసులు తెలిపారు.జిల్లాలోని షాబాద్ మండలం దైవాలగూడలో ఈ ఘటన చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న సీపీ తరుణ్ జోషి, డీసీపీ యోగేష్ గౌతమ్‌లు ఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.ఇదిలా ఉండగా, ఆరుగురిని హత్యచేసి నిందితుడు పరారయ్యాడు. అలాగే ఆరుగురిని హత్య చేశానని, తాను కూడా ఆత్మహత్యచేసుకుంటానని తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పినట్లు తెలుస్తోంది. నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు.

## బోనాల జాతర కు భారీ బందోబస్తు

**సికింద్రాబాద్:**లష్కర్ లో జరిగే ఉజ్జయిని మహంకాళి జాతర కోసం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షితమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా విశ్వకర్మ సంఘంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఆగస్టు 2,3 తేదీలలో జరిగే ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు, రంగం కార్యక్రమం సజావుగా సాగేందుకు ఇప్పటినుండే అన్ని ఏర్పాట్లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. బోనాలతో వచ్చే మహిళల కోసం ప్రత్యేకంగా రెండు క్యూ లైన్లతో పాటు మొత్తం నాలుగు క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బోనాల ఉత్సవాల కోసం వచ్చే భక్తులకు, మహిళలకు,వయోవృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతో పాటు వారికి కావలసిన మౌలిక వసతుల కల్పన చేయనున్నట్లు వెల్లడించారు. శాంతి భద్రతల దృష్ట్యా ఆలయ పరిసరాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా వ్యవస్థను పటిష్ట పరుస్తామని అన్నారు. జాతర సమయానికి అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తవుతాయని, ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# రాజనాల శ్రీహరి చూపు జనసేన వైపు..!

## తెలంగాణ కాంగ్రెస్‌కు భారీ షాక్..?
## తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామంచోటుచేసుకోబోతోందా..?

**హైద్రాబాద్ జులై 11;**వరంగల్‌కు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు రాజనాల శ్రీహరి జనసేన వైపు అడుగులు వేస్తున్నారా..?అంటే అవును అనే సమాధానం వస్తుంది. తాజాగా చోటుచేసుకున్న పరిణామాలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి.వరంగల్‌కు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు రాజనాల శ్రీహరి శుక్రవారం జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీలో చేరికకు సంబంధించిన అంశాలతో పాటు తెలంగాణలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, భవిష్యత్ రాజకీయ పరిణామాలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం.జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ రామ్ తాళ్లూరి ఆధ్వర్యంలో ఈ కీలక భేటీ జరిగింది. తెలంగాణలో జనసేన పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడం, పార్టీ విస్తరణతో పాటు రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన రాజకీయ కార్యాచరణపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది.ఈ భేటీ సందర్భంగా రాజనాల శ్రీహరి, ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని పవన్ కళ్యాణ్ కు బహూకరించారు. అనంతరం తెలంగాణ రాజకీయ పరిస్థితులు, రాష్ట్రంలో జనసేన పార్టీ భవిష్యత్ కార్యాచరణపై ప్రత్యేకంగా చర్చించారు.రాబోయే రోజుల్లో తెలంగాణలో జనసేన పార్టీని మరింత బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దే దిశగా కీలక అడుగులు పడుతున్నట్లు తాజా పరిణామాలు సంకేతాలిస్తున్నాయి. రాజనాల శ్రీహరి జనసేనలో చేరితే వరంగల్‌తో పాటు తెలంగాణ రాజకీయాల్లోనూ ప్రభావం చూపే అవకాశం ఉందనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.మొత్తానికి... రాజనాల శ్రీహరి చూపు జనసేన వైపు మళ్లడం తెలంగాణ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఆయన జనసేనలో చేరిక తెలంగాణ కాంగ్రెస్‌కు రాజకీయంగా భారీ షాక్‌గా మారే అవకాశముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఈ సమావేశంలో జనసేన పార్టీ వైస్ ప్రెసిడెంట్ బొంగునూరి మహేందర్ రెడ్డి ,తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్ , గ్రేటర్ హైదరాబాద్ నాయకులు రాధారం రాజలింగం తెలంగాణ ప్రచార కార్యదర్శి సాగర్ , తెలంగాణ రాష్ట్ర నాయకులు తనీష్ మచ్చ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు..



## రంగారెడ్డి జిల్లా షాబాజ్ హత్యల కేసు..
# వివరాలు వెల్లడించిన సీపీ తరుణ్ జోషి

**రంగారెడ్డి జిల్లా జులై 11** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో కలకలం రేపిన హత్యల కేసులో నిందితుడు రాజ్‌కుమార్ ఒక్కడే ఆరుగురిని కిరాతకంగా చంపినట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ (సీపీ) తరుణ్ జోషి వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో ఒకే రాత్రి జరిగిన ఆరుగురి ఘోర హత్యల ఉదంతం తీవ్ర కలకలం రేపింది. ఈ హ్యతకు సంబంధించిన వివరాలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి మీడియాకు వెల్లడించారు. ఈ ఘటనలో ఎలాంటి గ్యాంగ్ ప్రమేయం లేదని నిందితుడు రాజ్‌కుమార్ ఒక్కడే ఆరుగురిని చంపినట్లు సీపీ స్పష్టం చేశారు. నిందితుడిపై గతంలో మే 16న ఒక పోక్సో (గూజూూ) కేసు నమోదైందని, ఆ కేసులో ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చాడని సీపీ పేర్కొన్నారు. సీపీ తరుణ్ జోషి మాట్లాడుతూ 'నిందితుడు రాజ్‌కుమార్ రాత్రి 11 నుంచి 11:30 గంటల మధ్య వ్యవధిలోనే ఈ ఆరుగురినీ హతమార్చాడు. మొదట బాధితురాలి ఇంట్లోకి చొరబడి ఆమె తల్లి, నానమ్మలను చంపేశాడు. రాత్రి 11 గంటల సమయంలో బాలికను బలవంతంగా దైవాలగూడ చెరువు దగ్గరకు తీసుకెళ్లి అక్కడ ప్రాణాలు తీశాడు. తర్వాత తన ఇంటికి వెళ్లి భార్య, ఇద్దరు పిల్లలను కూడా అతికిరాతకంగా హతమార్చాడు. అనంతరం రాజ్‌కుమార్ తన తండ్రికి ఫోన్ చేసి విషయం చెప్పి, ఆ వెంటనే మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి పరారయ్యాడు. నిందితుడి నేర చరిత్రను పరిశీలిస్తే గతంలో అతడిపై పోక్సో కేసుతో పాటూ మరో కేసు కూడా నమోదైంది. రాజ్‌కుమార్‌కు బెట్టింగ్, గ్యాంబ్లింగ్ వంటి వ్యసనాలు ఉన్నాయి. దీనివల్ల అతనికి దాదాపు రూ. కోటిన్నర వరకు అప్పులు ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం పరారీలో ఉన్న రాజ్‌కుమార్‌ను పట్టుకోవడానికి ఏడు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాం' అని సీపీ అన్నారు.



## షాబాద్ ఘటన.. గ్రామస్తులతో కలెక్టర్ నారాయణరెడ్డి చర్చలు..



**ఎస్ఐ రమేశ్ సస్పెన్షన్**

**రంగారెడ్డి జిల్లా, జూలై 11:** షాబాద్‌లో జరిగిన ఆరు హత్యల ఘటన నేపథ్యంలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులతో జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి స్వయంగా చర్చలు జరిపారు. పోక్సో కేసులో బాధిత కుటుంబానికి రక్షణ కల్పించి ఉంటే ఈ దారుణం జరిగేది కాదని గ్రామస్తులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్ఐ రమేశ్‌ను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. దర్యాప్తులో బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే హత్యాకాండలో ప్రాణాలతో బయటపడిన దివ్యాంగ బాధితురాలికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. కలెక్టర్ హామీలతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.


## రూ.263.25 కోట్లతో
# రెవెన్యూ శాఖకు కొత్త భవనాలు..

**షాద్ నగర్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**



**రంగారెడ్డి జిల్లా, జూలై 11 (స్కై న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ శాఖలో అద్దె భవనాలు, శిథిలావస్థలో ఉన్న కార్యాలయాలకు శాశ్వత పరిష్కారంగా కొత్త భవనాల నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం రూ.263.25 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసిందని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో ఆర్.టి. నెం.375 ప్రకారం రాష్ట్రంలోని 10 ఆర్డీవో కార్యాలయాలు, 107 తహసీల్దార్ కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మించనున్నట్లు చెప్పారు. ఒక్కో భవనానికి సుమారు రూ.2.25 కోట్లు కేటాయించగా, షాద్‌నగర్ నియోజకవర్గంలోని నందిగామ మండలానికి కూడా నూతన తహసీల్దార్ కార్యాలయ భవనం మంజూరైనట్లు వెల్లడించారు. ఈ నిర్మాణ పనులను తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు అప్పగించినట్లు పేర్కొన్న ఆయన, కొత్త భవనాల నిర్మాణంతో రెవెన్యూ శాఖ సేవలు మరింత మెరుగుపడి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

## భక్తులతో పులకరించిన కురుమూర్తి కొండలు



**చిన్న చితకుంట జూలై 11 (స్కై న్యూస్);** గోవిందా నామ స్మరణలతో పులకరించిన శ్రీ కురుమూర్తి స్వామి కొండలు చిన్నచింతకుంట మండల పరిధిలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో ఏడుకొండల మధ్య కాంచన గుహలో స్వయంగా వెలిసిన శ్రీ కురుమూర్తి స్వామి దర్శనానికి ఉమ్మడి జిల్లాల నలుమూలల నుంచి భక్తులు తండోప తండలుగా కదిలించి, పవిత్రమైన పుష్కరిలో పవిత్ర స్నానం చేసి తడి గుడ్డలతో క్యూలైన్లో నిలిచి ఆపద మొక్కల వాడ, వడ్డీ కాసుల వాడ అంటూ వివిధ నామాలు స్మరిస్తూ వివిధ ఆలయాల దర్శించుకుని స్వామి వెలసిన కాంచన గుహ లో స్వామికి ప్రత్యేక మొక్కులు చెల్లించుకొని కొండ దిగువ భాగంలో స్వామికి ధూప దీప నైవేద్యములు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ నిర్వహిస్తున్నారు.

## కొత్త మండలాలకు
# కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి..

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**రంగారెడ్డి జిల్లా, జూలై 11 (స్కై న్యూస్):** గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త మండలాలను ఏర్పాటు చేసినప్పటికీ, వాటికి అవసరమైన మౌలిక వసతులు, ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణాన్ని విస్మరించిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విమర్శించారు. షాద్‌నగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయని అన్నారు. హెచ్ఎండీఏ నుంచి ఇప్పటికే నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.100 కోట్లకు పైగా నిధులు సమీకరించినట్లు తెలిపారు. నర్సప్పగూడ--నందిగామ డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.7.30 కోట్లు, లాల్‌పహాడ్--చౌదరిగూడ డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.7.50 కోట్లు, నందిగామ తహసీల్దార్ కార్యాలయ నూతన భవనానికి రూ.2.20 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. ఈ అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రశేఖర్, కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చించోడులో ప్రపంచ
# జనాభా దినోత్సవ అవగాహన ర్యాలీ




**రంగారెడ్డి జిల్లా, జూలై 11 (స్కై న్యూస్):** చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ స్రవంతి ఆదేశాల మేరకు హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీని ఎంఎల్‌హెచ్‌పీ వైద్యాధికారి డాక్టర్ ముస్తకిన్ అహ్మద్ ప్రారంభించారు. ర్యాలీలో కుటుంబ నియంత్రణ, తల్లి--శిశు ఆరోగ్యం, చిన్న కుటుంబం, జనాభా నియంత్రణ, వనరుల పరిరక్షణపై నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు మాట్లాడుతూ, పెరుగుతున్న జనాభా వల్ల కలిగే సామాజిక, ఆర్థిక, ఆరోగ్య సమస్యలపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడమే ప్రపంచ జనాభా దినోత్సవం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ముస్తకిన్ అహ్మద్, డాక్టర్ కార్తీక్, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ దినేష్, డాక్టర్ సంధ్య, డాక్టర్ ప్రవీణ్, హెల్త్ సూపర్వైజర్ శ్రీరామ్, ల్యాబ్ టెక్నీషియన్ అశోక్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్



**రంగారెడ్డి జిల్లా జూలై 11 (స్కై న్యూస్):** షాద్‌నగర్ పట్టణంలోని పటేల్ రోడ్డుకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త దేవేందర్ తండ్రి జంగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం షాద్‌నగర్ పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన రబ్బానీ మృతిచెందిన విషయం తెలుసుకుని ఆయన కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, ఈ విషాదాన్ని ఎదుర్కొనేందుకు మనోధైర్యంతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చేగూరి వేణుగోపాల్, కౌన్సిలర్లు వసంత శ్రీనివాస్, శారద శేఖర్, మహమ్మద్ ఎజాజ్ (అడ్డు), పిన్నమోని గోపాల్, మాజీ కౌన్సిలర్ వెంకట్రాం రెడ్డి, యుగంధర్, నాయకులు చీపిరి రవి యాదవ్, బాలాజీ, ఫరీద్, అజహర్, రహమత్ అలీ, పాండు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యం.. ఉద్యమాలకు సిద్ధం కావాలి

**టిడబ్ల్యూజేఎఫ్ నాయకుల సమావేశం**




**రంగారెడ్డి జిల్లా, జూలై 11 (స్కై న్యూస్):** జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షాద్‌నగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ నెల 13న రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన, 15న రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. హెల్త్ కార్డులు అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలు చేయాలని, అక్రిడిటేషన్ కార్డులు వెంటనే జారీ చేయాలని, ఇళ్ల స్థలాలు, నెలకు రూ.10 వేల పెన్షన్, జర్నలిస్టుల పిల్లలకు 100 శాతం ఫీజు రాయితీ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆగస్టు నెలాఖరులో రాష్ట్ర మహాసభలు నిర్వహించి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు రాకేష్, కృష్ణ, మహేష్, శివకుమార్, మల్లేష్, రాజు, శేఖర్, వారణాసి జగన్, దర్శనం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిఖని బస్టాండ్ అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**పెద్దపల్లి జిల్లా గోదావరిఖని జూలై 11 (స్కై న్యూస్)** బస్టాండ్ ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దే విధంగా ముందుకు వెళ్తున్నలి ఆటో డ్రైవర్లకు ప్రయాణికులకు మంచినీటి సౌకర్యం వాష్రూమ్స్ తో పాటు వివిధ సౌకర్యాలను ఉండే విధంగా అభివృద్ధి చేస్తా గోదావరిఖని: రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీ ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గారు శనివారం స్థానిక గోదావరిఖని బస్టాండ్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌ను ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. బస్టాండ్‌లో ఆధునిక ప్లాట్‌ఫారమ్‌లు, ప్రత్యేక ఆటో స్టాండ్, ఆటో డ్రైవర్లకు అవసరమైన సౌకర్యాలు, ఫుట్‌పాత్‌లు, తాగునీరు, పరిశుభ్రతతో పాటు ప్రయాణికులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించాలని ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బస్టాండ్‌ను అభివృద్ధి చేసి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే కోరారు.ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి , డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య , సింగరేణి జనరల్ మేనేజర్, సంబంధిత శాఖల అధికారులు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## షాబాద్ ఆరు హత్యల కేసు..

**రాజ్‌కుమార్‌పై ఎఫ్ఐఆర్ లో కీలక అంశాలు**



**రంగారెడ్డి జిల్లా, జులై 11 (స్కై న్యూస్):** షాబాద్ ఆరు హత్యల కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. రాజ్‌కుమార్‌పై ఫైల్ అయిన ఎఫ్ఐఆర్‌లోని వివరాల మేరకు నిందితుడు రాజ్‌కుమార్‌పై గతంలోనే ఓ కేసు ఉంది. భూతగాదాలో రాజ్‌కుమార్ ఇద్దరిని కొట్టి బెదిరించాడు. షాబాద్ పీఎస్‌లోనే రాజ్‌కుమార్‌పై కేసు నమోదైంది. బాలిక విషయంలోనూ రాజ్‌కుమార్ క్రూరంగా వ్యవహరించాడు. ప్రేమ పేరుతో బాలికను వేధించాడు. మాట్లాడాలని, కలవాలని టార్చర్ పెట్టాడు. శంషాబాద్‌లో కాలేజీకి వెళ్లే సమయంలోనూ బాలికను వేధింపులకు గురిచేశాడు. బాలిక తల్లి రాజ్‌కుమార్ భయంతో బాలికను కాలేజీకి పంపటం ఆపేసింది. అయితే, పరీక్షల సమయంలో తప్పనిసరై బాలికను కాలేజీ దగ్గరకు తీసుకెళ్లింది. పరీక్ష తర్వాత రాజ్‌కుమార్ బాలికను లాక్కెళ్లే ప్రయత్నం చేశాడు. బాలిక తల్లి రాజ్‌కుమార్‌ను అడ్డుకుని బాలికను తప్పించింది. ఈ నేపథ్యంలోనే రాజ్‌కుమార్ బెదిరింపులకు దిగాడు. బాలిక తండ్రిని చంపినట్టే అందరినీ చంపుతానంటూ వార్నింగ్ ఇచ్చాడు. రాజ్‌కుమార్ నుంచి తమను కాపాడాలని బాలిక తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాలిక తల్లి ఫిర్యాదుతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. రాజ్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. రాజ్‌కుమార్ బెయిల్ మీద బయటకు వచ్చాడు. శనివారం రాత్రి బాలికతో పాటు ఆమె తల్లి, నాన్నమ్మను చంపేశాడు. ఆ తర్వాత సొంత భార్యాపిల్లలను కూడా హత్య చేశాడు. హత్యల నేపథ్యంలో బాలిక బంధువులు షాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. హత్యలకు పోలీసుల అలసత్వమే కారణమని ఆరోపిస్తున్నారు. మే 16వ తేదీన రాజ్‌కుమార్‌పై ఫిర్యాదు చేశామని బాలిక కుటుంబసభ్యులు చెబుతున్నారు. అదుపులోకి తీసుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం వహించారని అంటున్నారు. రాజ్‌కుమార్ బయటే తిరుగుతూ చాలా సార్లు బెదిరించాడని చెబుతున్నారు.

# ఉపాధ్యాయులు ఉద్యమాలకు సిద్ధం కావాలి

## పి అర్ టి యు జిల్లా అధ్యక్షులు వై.జనార్ధన్ రెడ్డి పిలుపు

**నారాయణపేట జూలై 11: (స్కైన్యూస్)** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలకు సిద్ధం కావాలని పి ఆర్ టి యు టి ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు యాదగిరి జనార్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పి ఆర్ టియు టి ఎస్ నారాయణపేట మండల శాఖ అధ్యక్షులు ఎం రఘువీర్, మండల ప్రధాన కార్యదర్శి ఎం జనార్ధన్ ల ఆధ్వర్యంలో నారాయణపేట మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు కోటకొండ, కొల్లంపల్లి, జాజాపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల తిరుమలపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు కోటకొండ,అమ్మిరెడ్డిపల్లి,కొల్లంపల్లి,జాజపూర్ తదితర పాఠశాలలో పి ఆర్టియు టీఎస్ 2026- 2027 విద్యా సంవత్సరము సభ్యత్వ నమోదును కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా శాఖ అధ్యక్షులువై.జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వము వెంటనే 51 శాతం ఫిట్మెంట్తో పిఆర్సిని అన్ని పెండింగ్ డి ఎ లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. నెలరోజుల్లోగా ప్రభుత్వము పిఆర్సి నివేదికను తెప్పించుకొని పీఆర్సిని అమలు చేయక పోతే ఉపాధ్యాయ లోకము ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపు




నిచ్చారు.కేవలం జీతభ త్యాల మీద ఆధారపడి నిరంతరం ప్రభుత్వ పాఠశాలను పరిరక్షిస్తున్న ఉపాధ్యాయులు అసహనమునకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వము వారి అసహనాన్ని పరీక్షిస్తే ఉద్యమం మొదలవుతుందని స్పష్టం చేశారు. తీవ్రమైన ఉద్యమరూపం దాల్చకముందే పి ఆర్ సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా హెల్త్ కార్డుల విషయంలో ఉపాధ్యాయులు ఎలాంటి అపోహలకు వెళ్లకుండా ఆందోళన చెందవలసిన అవసరం లేదని ప్రస్తుతం నాణ్యమైన వైద్యం అందేలా చర్య తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సర్వీస్ లోని ఉపాధ్యాయులకు టెట్ ను ఆన్లైన్లో కాకుండా ఆఫ్లైన్లో నిర్వహించి క్వాలిఫై మార్కులను తగ్గించాలని కోరారు. మరీ ముఖ్యంగా సర్వీసు రూల్స్ రూపొందించి మండల విద్యాశాఖ అధికారులు, జూనియర్ లెక్చరర్లు తదితర ప్రమోషన్లను అందజేయా లని అన్నారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వై నారాయణ రెడ్డి, కే శ్రీనివాస్,జిల్లా సైన్స్ అధికారి భాను ప్రకాష్,రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింగ్ రావు,జిల్లా కార్యవర్గ సభ్యులు సాయిలు ఆయా పాఠశాలలప్రధానోపాధ్యాయులు డాక్టర్ సునీత,
భారతి,శ్రీనివాసరావు,వెంకటేశ్వర్లు,పవన్,నవీన్,వినయ్,ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం నారాయణ, తిరుపతి రెడ్డి,శివకుమార్, వెంకట చారి,మధుసూదన్,శిరీష,నిర్మల, విజయమ్మ బాల కృష్ణప్ప, స్నేహలత,పరిమళ తిమ్మప్ప,భాస్కర్,రజిని,రాములు రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత సొసైటీ అధ్యక్షుడు వెంకటయ్య ను సన్మానించి న కాకర్ల



**నారాయణపేట జూలై 11( స్కైన్యూస్):**నారాయణపేట పట్టణంలో చేనేత సొసైటీ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన చింత వెంకటయ్యను శనివారం మూడో వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ శాలువా పూలమానులతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నారాయణమ్మ మాట్లాడు తూ నిరుపేద చేనేత కార్మిక సమస్యలపై ఎన్నో పోరాటాలు చేస్తూ వారికి చేదోడు వాదోడుగా ఉంటూ చేనేత కార్మికులను అభివృద్ధిలోకి తీసుకువచ్చేం దుకు వెంకటయ్య ఎంతో కృషి చేశారని అన్నారు. అంతేకాకుండా గతంలో చేనేత కార్మికుల అభివృద్ధి కోసం చేనేత సొసైటీలో ఎన్నో పదవులు పొందిన కూడా కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ కార్మికులకు ఎలాంటి సమస్యలైనా పరిష్కరించే దిశగా ఆయన కృషి చేస్తున్నారని తెలిపారు. డిసిసి వైస్ చైర్మన్ గా పనిచేసిన సమయంలో కూడా చేనేత కార్మికుల కోసమే పోరాటం చేశారని ఆమె గుర్తు చేశారు.ఈ సందర్భంగా అధ్యక్షులు చింత వెంకటయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవిని అప్పగించినందుకు చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరిస్తూ ప్రభుత్వం నుండి కార్మికులకు వచ్చే సంక్షేమ పథకాలను అందించేందుకు తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత కార్మిక సంఘం నాయకుడు కెశీ చి నారాయణ, మాజీ కౌన్సిలర్ గురు లింగప్ప, పళ్ళ వెంకట్ రాములు, జంగిటి వెంకటేష్, జింగిటి రవికుమార్ అట్టు, రాజు, జింగిటి మల్లేష్, కాకర్ల భీమయ్య లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మణ్ నాయక్ పార్థివదేహానికి నివాళులర్పించిన బీఆర్ఎస్ నేత రవీందర్ యాదవ్..



**రంగారెడ్డి జిల్లా, జూలై 11 (స్కై న్యూస్):** అనారోగ్యంతో మృతిచెందిన కేశంపేట మండల కేంద్రం నాగర్లగడ్డ తండాకు చెందిన సభవాత్ లక్ష్మణ్ నాయక్ పార్థివదేహానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. లక్ష్మణ్ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, ఉపసర్పంచ్ రాజు, నాయకులు దశరథ్, శేఖర్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, మూడవత్ శంకర్, కాట్రవత్ శంకర్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కొత్తగూడెం ఏరియాలో ఎల్పీజి సిలిండర్ల డోర్ డెలివరీ టెండర్కు గడువు పొడిగింపు




**సింగరేణి జూలై 11 (స్కై న్యూస్):** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కొత్తగూడెం ఏరియా పరిధిలో హెచ్పీసీఎల్ , బీపీసీఎల్ గ్యాస్ గోదాముల నుంచి వినియోగదారుల ఇళ్లకు ఎల్పీజీ సిలిండర్ల డోర్ డెలివరీ సేవలను అవుట్సోర్సింగ్ పద్ధతిలో నిర్వహించేందుకు పిలిచిన టెండర్ గడువును మరోసారి పొడిగించారు. ఈ టెండర్కు సంబంధించి ఇప్పటికే నాలుగు సార్లు గడువు పొడిగించినప్పటికీ ఎలాంటి బిడ్లు అందకపోవడంతో టెండర్ సమర్పణ, ప్రారంభ తేదీలను మళ్లీ సవరించినట్లు కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం విడుదల చేసిన సవరణ నోటీసులో పేర్కొంది.సవరించిన తేదీలు:టెండర్ పత్రాల జారీకి చివరి తేదీ 15 జూలై 2026 సాయంత్రం 4 గంటల వరకు ,టెండర్ పత్రాల స్వీకరణకు చివరి తేదీ 16 జూలై 2026 మధ్యాహ్నం 12 గంటల వరకు ,టెండర్ పత్రాల ప్రారంభం 16 జూలై 2026 మధ్యాహ్నం 3 గంటల తర్వాత కొత్తగూడెం రుద్రంపూర్ గ్యాస్ గోదాముల నుంచి వినియోగదారుల నివాసాలకు ఎల్పీజీ సిలిండర్ల సరఫరా సేవలను రెండు సంవత్సరాల కాలానికి యూనిట్ రేట్ విధానంలో నిర్వహించేందుకు ఈ టెండర్ను ఆహ్వానించినట్లు అధికారులు తెలిపారు. టెండర్ ప్రక్రియలో పాల్గొనదలచిన ఆసక్తి గల సంస్థలు సవరించిన గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

## విద్యారంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుంది...

### ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి



**దేవరకద్ర, కొత్తకోట జులై 11 (స్కై న్యూస్)** కొత్తకోటలో దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి శనివారం పాఠశాల భవన నిర్మాణం జరుగుతున్న తీరును, అందుబాటులో ఉన్న మౌలిక వసతులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నాణ్యమైన విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని, అందుకోసం ఈ నూతన పాఠశాలల్లో విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విద్య ఆధునిక వియోగశాలలో ( ల్యాబ్స్) అత్యాధునిక వసతులతో కూడిన భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు.నిర్మాణ పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా, ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తరగతి గదులు, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శివాలయం పునర్నిర్మాణం కోసం డాక్టర్ సురేందర్ రెడ్డి 50,000 వేలు వితరణ

**చిన్న చింతకుంట జులై 11 (స్కై న్యూస్);** చిన్న చింతకుంట మండల పరిధిలోని లాల్ కోట గ్రామ శివాలయం పునర్నిర్మాణం కోసం ఆలయ కమిటీ నిర్వాకులు సహాయం చేయాలని డాక్టర్ సురేందర్ రెడ్డి ని అడగగా వెంటనే స్పందించి, శనివారం దమగ్నపురం గ్రామ వాస్తవ్యులు స్వర్గీయ తోకల వెంకటేశ్వరమ్మ తోకల చిన్న ఎల్లారెడ్డి జ్ఞాపకార్థం నిమిత్తం శివాలయం పునర్ నిర్మాణం కోసం 50,000 వేల చెక్కు ను వితరణ చేసినట్లు శివాలయం నిర్వాకులు తెలిపారు.

# వేములవాడ లో కేంద్ర మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలు

## అగ్రహారం శ్రీ జోడు ఆంజనేయ స్వామి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించిన బీజేపీ నేతలు

**వేములవాడ జులై 11 (స్కై న్యూస్)** వేములవాడ అర్బన్ మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షులు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో అగ్రహారం ఆంజనేయస్వామి దేవాలయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించి, వారు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, కరీంనగర్, తెలంగాణతో పాటు దేశ ప్రజలకు మరింత సేవ చేసే అవకాశాలు కలగాలని, రాజకీయాల్లో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రార్థించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు పండ్లను పంపిణీ చేశారు.



అనంతరం వేములవాడ పట్టణంలోని నంది కమాన్ చౌరస్తాలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బండి సంజయ్ ప్రజా సేవలో ఎల్లప్పుడూ ముందుంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లింగంపల్లి శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చింతపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు జింక అనిల్, చంద్రగిరి ప్రశాంత్, గుండెకార్ల లక్ష్మణ్, ఎరుగోకుల రమేష్, చల్ల నరసయ్య, పేరంగాని మల్లేశం, కంసాని రాము, సంజీవరెడ్డి, పడగేల బాబు, నాంపల్లి తిరుపతి, రెడ్డవేని రాజు, పోచంపల్లి భాను, ఎడ్ల హరీష్, చర్ల దేవరాజ్, జింక శేఖర్, లింగంపల్లి సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నకు అండగా రైతు భరోసా... జిల్లాలో రూ.318.42 కోట్ల నిధుల జమ

## 1.78 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా

## రైతు భరోసా నిధులను ఇతర బకాయిలకు సర్దుబాటు చేయొద్దు: బ్యాంకులకు జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశం

**కొత్తగూడెం జూలై 11( స్కై న్యూస్):**వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంతో పాటు రైతులకు సాగు పెట్టుబడికి అవసరమైన ఆర్థిక తోడ్పాటును సకాలంలో అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద జిల్లాలో అర్హులైన రైతులందరి బ్యాంకు ఖాతాల్లో నిధుల జమ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. రైతులు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా సాగు పనులను ప్రారంభించేందుకు ప్రభుత్వం విడతల వారీగా నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందని పేర్కొన్నారు.జిల్లాలో మొత్తం 1,78,828 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.318.42 కోట్ల రైతు భరోసా నిధులను జమ చేయడం ద్వారా పంపిణీ ప్రక్రియను పూర్తిచేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు వ్యవసాయ, రెవెన్యూ, బ్యాంకింగ్ శాఖల సమన్వయంతో పారదర్శకంగా, వేగవంతంగా నిధుల పంపిణీ నిర్వహించినట్లు చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రైతు భరోసా, రైతు బీమా, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా, సాగునీటి సౌకర్యాల కల్పన తదితర కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. రైతు భరోసా పథకం ద్వారా రైతులకు సాగు పెట్టుబడిపై ఆర్థిక




భరోసా కల్పించి వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.రైతు భరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో జమయ్యే నిధులను బ్యాంకులు ఎట్టి పరిస్థితుల్లోనూ రుణ బకాయిలు, సేవా ఛార్జీలు లేదా ఇతర బకాయిల పేరుతో నిలుపుదల చేయడం, డెబిట్ చేయడం లేదా సర్దుబాటు చేయరాదని జిల్లా కలెక్టర్ అంకిత్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రైతుల సాగు పెట్టుబడి కోసం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం పూర్తి మొత్తంలో రైతుల వినియోగానికి అందుబాటులో ఉండేలా అన్ని బ్యాంకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు భరోసా నిధులపై ఎలాంటి అనధికారిక కోతలు విధించకుండా ప్రభుత్వం జమ చేసిన మొత్తాన్ని రైతులకు పూర్తిగా అందేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

# మానవ హక్కుల ఫౌండేషన్ జిల్లా గౌరవ వర్కింగ్ ప్రెసిడెంట్గా కె. దుర్గా భవాని ఎంపిక

**కొత్త గూడెం జూలై 11( స్కై న్యూస్):** మానవ హక్కుల ఫౌండేషన్ జిల్లా గౌరవ వర్కింగ్ ప్రెసిడెంట్గా కె. దుర్గా భవాని ఎంపిక కావడం జరిగింది.కొత్తగూడెం పట్టణానికి చెందిన శ్రీమతి కె. దుర్గా భవాని, ప్రస్తుతం ఎస్ ఆర్ కె టీ స్కూల్లో ఉపాధ్యాయురాలిగా సేవలందిస్తూ, విద్యా రంగంతో పాటు వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ విశేష సేవలు అందిస్తున్నారు ఆమె చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించిన హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సంస్థ, ఆమెను జిల్లా గౌరవ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించింది.ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జడ్జి డిస్ట్రిక్ట్ లీగల్ అథారిటీ చైర్ పర్సన్ రాజేందర్ చేతుల మీదుగా ఐడీ కార్డ్ తీసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా దుర్గా భవాని మాట్లాడుతూ నాపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర జిల్లా నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, మానవ హక్కుల పరిరక్షణతో





పాటు సమాజ సేవకు మరింత కృషి చేస్తాను అని తెలిపారు.ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు,కుటుంబ సభ్యులు, మిత్రులు శ్రేయోభిలాషులు ఆమెకు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ బొద్దపాటి దాసు, నేషనల్ హ్యూమన్ రింగ్ అధ్యక్షురాలు వినుముల రుక్మిణి, రాష్ట్ర హ్యూమన్ అధ్యక్షులు కాల సుధాకరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదలు సుభాషిణి, జిల్లా కన్వీనర్ మాతంగి రాధ, భద్రాది కొత్తగూడెం జిల్లా ఇన్ చార్జి గడ్డం సామ్యేల్, జిల్లా కార్యదర్శి బోగ నరసింహారావు, జిల్లా అడ్వైజరీ బోర్డు ప్రెసిడెంట్ అబ్బాసు తదితరులు పాల్గొన్నారు.

# ఏడో వార్డులో జరుగుతున్న స్పెషల్ రివిజన్ ఎస్ ఆర్ ఐ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్

**ఆత్మకూర్ జూన్ 11 (స్కై న్యూస్)** ఆత్మకూరు పట్టణంలో ఏడవ వార్డులో జరుగుతున్న స్పెషల్ ఎస్ ఆర్ ఐ కార్యక్రమంలో పాల్గొని ఈ విధానాన్ని బిఎల్ఓ తో అడిగి తెలుసుకున్న ఆత్మకు టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్ గారు ప్రతి ఇంటికి వెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటర్ జాబితాలో ఓట్లు సందేశాలను నివృత చేయాలని బిఎల్ఓ ను కోరుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా బలమైన ప్రజాస్వామ్యాన్ని ప్రతి ఓటు విలువైనదేనని" నా ఓటు నాహక్కు" అనే భావనతో ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగస్వాములై ఓటర్లకు పిలుపునిచ్చారు ప్రజాస్వామ్యం బలోపేతానికి ఖచ్చితమైన ఓటర్ జాబితా అత్యంత అవసరమని ఈ నేపథ్యంలో ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరుగా నమోదు కావడం వివరాలను సరి చేసుకోవడం మరియు కొత్త ఓటర్లను చేర్పించడం మనందరి బాధ్యత అని ఆత్మకూరు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడురవి కుమార్ యాదవ్ తెలియజేశాడు



# రేవంత్ రెడ్డి ఆట మొదలు పెట్టాడు

**117 సీట్లు గెలిపించుకునే ప్లాన్ రేవంత్ రెడీ చేశాడు**
**రేవంత్ వ్యూహాలు, నిర్ణయాలకు మా మద్దతు ఉంటుంది**
**రేవంత్ ఆలోచనలతో మాకు ఏకాభిప్రాయం ఉంటుంది**
**సీట్లు ఎవరికి ఇవ్వాలనే అంశం సీఎం, పీసీసీ చీఫ్, ఇంచార్జీ నిర్ణయాన్ని బట్టి ఉంటుంది**
**అధిష్ఠానం హరీష్ పై పోటీ చేయమంటే సిద్ధమే**
**నేను సంగారెడ్డిలో పోటీ చేయనన్నాను కానీ వేరే దగ్గర పోటీ చేయనని చెప్పలేదు**
**పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గా రెడ్డి**



**హైద్రాబాద్ జులై 11 :**రేవంత్ రెడ్డి ఆట మొదలు పెట్టాడు 117 సీట్లు గెలిపించుకునే ప్లాన్ రేవంత్ రెడీ చేశాడు రేవంత్ వ్యూహాలు, నిర్ణయాలకు మా మద్దతు రేవంత్ ఆలోచనలతో మాకు ఏకాభిప్రాయం ఉంటుందని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గా రెడ్డి తెలిపారు.శనివారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ సీట్లు ఎవరికి ఇవ్వాలనే అంశం సీఎం, పీసీసీ చీఫ్, ఇంచార్జీ నిర్ణయాన్ని బట్టి ఉంటుంది ఇంత ముందు ఎన్నికల గురించి ఆలోచించడం సరైన ఆలోచనే రెండవ సారి ప్రభుత్వం తెచ్చేందుకు నిర్ణయాలు తీసుకునే హక్కు రేవంత్ కి ఉందన్నారు.
ఎవరి సర్వేలు వారికి అనుకూలంగా చేస్తారు సర్వేలను చూసి టెన్షన్ పడాల్సిన అవసరం లేదు ఎమ్మెల్యేల పనితీరు దృష్టిలో పెట్టుకునే సీఎం పలువురికి సూచనలు ఇస్తున్నారు నేను సంగారెడ్డిలో పోటీ చేయను అన్నాను వేరే దగ్గర పోటీ చేయనని చెప్పలేదన్నారు. సంగారెడ్డి నియోజకవర్గం లేడీ ఉన్నా, జనరల్ ఉన్నా నిర్మలనే క్యాండేట్ సీఎం సూచనలతో ఎమ్మెల్యేలు అలెర్ట్ అవుతున్నారు
సీఎం చెప్పడంతో పలువురు ఎమ్మెల్యేలు తమ తీరు మార్చుకుంటున్నారు సీఎం చెప్పిన తర్వాత కూడా తీరు మారకపోతే సీటు ఇవ్వాలో లేదో సీఎం, పీసీసీ చీఫ్, ఇంచార్జ్ నిర్ణయం తీసుకుంటారన్నారు. అపోజిషన్ ఎప్పుడూ రూలింగ్ పార్టీని ఎటాక్ చేస్తుందిరాజకీయ నీతి కూడా అదేకేసీఆర్ మొదటిసారి సీఎం అయినప్పుడు కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పనితీరు బాగాలేదని సర్వేలు చెప్పాయి యాక్టివ్ లేని వాళ్ళని సీఎం రేవంత్ అలెర్ట్ చేస్తున్నారు అలెర్ట్ చేసిన తర్వాత కూడా తీరు మార్చకపోతే వేటు తప్పదుమేమే తోపులు అంటే నడవదు పెద్ద పెద్ద తోపులను కూడా పక్కన పెట్టిన సందర్భాలు ఉన్నాయి సిట్టింగ్ ఎమ్మెల్యే తోపు కాదు సీఎం, పీసీసీ చీఫ్, ఇంచార్జ్ మాత్రమే తోపులు రాజకీయాల్లో పర్మినెంట్ గా ఎవరూ తోపులు ఉండరన్నారు.అధిస్థానం హరీష్ పై పోటీ చేయమంటే సిద్ధమే అధిస్థానం సిద్దిపేటలో పోటీ చేయమంటే తప్పకుండా చేస్తానన్నారు

# ఎన్యూమరేషన్ ఫారాలను తప్పనిసరిగా నింపాలి

**బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చేగూరి వేణుగోపాల్**



**రంగారెడ్డి జిల్లా, జూలై 11 (స్కై న్యూస్):** అర్హులైన ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా నింపి సమర్పించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చేగూరి వేణుగోపాల్ కోరారు. షాద్‌నగర్ పట్టణంలోని 28వ వార్డు గాంధీనగర్ కాలనీ పార్కులో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఫారంలో ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి ఒకే చోట ఓటు ఉండాలని, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు ఉండటం చట్టవిరుద్ధమని తెలిపారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొని సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

# షాబాద్ బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తుండగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అరెస్ట్



**రంగారెడ్డి జిల్లా, జూలై 11 (స్కై న్యూస్):** షాబాద్‌లో జరిగిన విషాద ఘటనలో బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని పోలీసులు చేవెళ్లలో అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఆమెతో పాటు మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, పద్మా దేవేందర్ రెడ్డిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, రెండు కుటుంబాల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పోయిన ఘటన అనంతరం బాధితులను పరామర్శించేందుకు వెళ్తుండగా అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజల ప్రాణాలు, భద్రత పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, షాబాద్ ఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

# డంపింగ్ యార్డ్ రద్దు వరకు పోరాటం కొనసాగుతుంది

**డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ**





**రంగారెడ్డి జిల్లా, జూలై 11 (స్కై న్యూస్):** సిద్ధాపూర్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్‌ను రద్దు చేసే వరకు ఉద్యమం ఆగదని డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ స్పష్టం చేశారు. శనివారం సిద్ధాపూర్ గ్రామంలో బీజేపీ, బీఆర్ఎస్ నాయకులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆయన అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడుతూ, అవసరమైతే ప్రాణాలను పణంగా పెట్టైనా డంపింగ్ యార్డ్ ఏర్పాటును అడ్డుకుంటానని ప్రకటించారు. డంపింగ్ యార్డ్ వల్ల పర్యావరణం దెబ్బతినడంతో పాటు ప్రజల ఆరోగ్యం, పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఉద్యమానికి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఉద్యమంలో పాల్గొని డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాటాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందె బాబయ్య మద్దతు ప్రకటించగా, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వడ్డే బాలయ్యతో పాటు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# బెల్లం మాధవి సేవలు అభినందనీయం



**హైద్రాబాద్ జులై 11:**సామాజుకంగా తెలంగాణా చాంబర్ అఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ చైర్మన్ బెల్లం మాధవి చేస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.నేడు మంత్రి ఆమె కార్యాలయానికి క్రిస్టియన్ మైనారిటీస్ కార్పొరేషన్ దీపక్ జాన్ తో కలిసి విచ్చేసి మాధవి సేవలను కొనియాడారు.వారిని బెల్లం మాధవి పూల గుచ్చం తో ఆత్మీయంగా ఆహ్వానించారు.అనంతరం బెల్లం మాధవి ఆస్ట్రేలియా లో జరిగే ఓ వేడుకకు సంబందించిన ఇన్విటేషన్ ఆమె వారికి అందజేశారు.

# ఏరువాక దాటిన ఏరుపారలే వరుణ దేవుడా కరుణించు వయ్యా



**ఆత్మకూర్ జులై 11 (స్కై న్యూస్ )** వానకాలం సీజను రెండు మాసాలు ప్రారంభమైన వర్షాలు కురవకపోవడంతో గ్రామంలో రైతులు వరుణ్ దేవుడు కరుణ కోసం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారుశనివారంఆత్మకూరు మండలంలో పిన్నంచర్ల గ్రామానికి చెందిన రైతులుప్రత్యేక పూజలు చేసి ఎడ్ల బండ్లు ట్రాక్టర్లు పూలతో ముస్తాబ్ చేసుకొని కృష్ణానది నుంచి పవిత్ర జలాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు అనంతరం సర్పంచ్ అద్వారంలోగ్రామాల్లోనికి ఆలయాల్లో కృష్ణాజిల్లాలతో శుద్ధి చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి వరుణ దేవుడు కరుణించువయ్య అని వేడుకుంటున్నారు వర్షం కోసం రైతులు ఆలయాల్లో అభిషేకాలు పూజలు చేస్తున్నారు మేఘాలు మబ్బులు కుమ్ముతుంటే వర్షాలు కురవడం లేదు వర్షాలు కురువకపోతే రైతులు వానకాల కష్టాలు ఎదుర్కోవాల్సిన పరిస్థితిఉంది అందుకే దేవుడా ఒక్కసారి కరుణించు అని రైతులు వేడుకుంటున్నారు

# వియత్నాంలో భారీ విషాదం

**న్యూ ఢిల్లీ జులై 11;** భారత టూరిస్టులు ప్రయాణిస్తున్న బోటు ఒకటి నీట మునిగింది. ఈ ప్రమాదంలో పర్యాటకులు గల్లంతయ్యారు. వియత్నాంలోని ఫు క్యూక్ ద్వీపం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఇందులో తెలుగువారు కూడా ఉన్నారు. ఈ మేరకు వియత్నాం హనోయిలోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. ప్రమాదం గురించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని ఎక్స్?లో పోస్టు షేర్ చేసింది. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 15 మంది చనిపోయినట్లు తెలుస్తోంది.

**ప్రమాదంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన టూరిస్టులు!**

ఇటీవల ఓ మొబైల్ కంపెనీ 250 మందితో కూడిన ఒక బృందాన్ని భారత్ నుంచి వియత్నాం పర్యటనకు తీసుకెళ్లింది. వీళ్లంతా మొబైల్ కంపెనీకి చెందిన డిస్ట్రిబ్యూటర్లుగా తెలుస్తోంది. అయితే ఇందులో 40 మంది తెలంగాణ, 35 మంది ఆంధ్రప్రదేశ్?కు చెందిన మొబైల్ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారు.

# సోషల్ మీడియా మోజుకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలి

**: షీ టీమ్ పోలీసులు**



**నారాయణపేట జూలై 11: (స్కైన్యూస్)** విద్యార్థులు సెల్ ఫోన్లకి దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని విద్యార్థులకు షి టీం పోలీసులు అవగాహన కల్పించారు.నారాయణపేట జిల్లా కేంద్రంలోని వైదిక పాఠశాలలో షీ టీం పోలీసులు విద్యార్థులకు మహిళల భద్రత, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, సోషల్ మీడియా దుర్వినియోగం వల్ల కలిగే అనర్థాలు, చదువుపై శ్రద్ధ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలను గౌరవించడం వంటి పలు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా షీ టీం పోలీసులు కవిత, జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియాకు బానిస కాకుండా అవసరమైన మేరకే వినియోగించాలని సూచించారు. మహిళలు, బాలికల పట్ల గౌరవంతో ప్రవర్తించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వంటి వేధింపులు చట్టరీత్యా శిక్షార్హమైన నేరాలని, ఇటువంటి సంఘటనలు ఎదురైనా లేదా తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.సోషల్ మీడియా ద్వారా అపరిచితులతో స్నేహాలు చేయడం, వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు పంచుకోవడం ప్రమాదకరమని హెచ్చరించారు. అనుమానాస్పద లింకులు, సందేశాలు, ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించేందుకు చదువుపై పూర్తి దృష్టి సారించాలని, మంచి విలువలు, క్రమశిక్షణ అలవర్చుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలను గౌరవిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు.అత్యవసర పరిస్థితుల్లో లేదా మహిళలపై వేధింపులు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వంటి సంఘటనలు జరిగినప్పుడు వెంటనే షీ టీం హెల్ప్‌లైన్ నంబర్ 8712670398కు సమాచారం అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో షీ టీం పోలీసులు చెన్నప్ప, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# 2026--27 విద్యా సంవత్సరానికి విద్యార్థి నాయకుల ఎంపిక

**సెయింట్ జోసెఫ్ హైస్కూల్ పిల్లల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించాలి**
**కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శాలెం రాజు**
**బాధ్యతాయుతమైన నాయకత్వమే విజయానికి పునాది: టూ టౌన్ ఎస్ ఐ కె. రాజశేఖర్**







**చుంచుపల్లి జులై 12 ( స్కై న్యూస్ ):**2026--27 విద్యా సంవత్సరానికి విద్యార్థి నాయకత్వ బాధ్యతలను అప్పగిస్తూ చుంచుపల్లి మండలం రుద్రంపూర్‌లోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్లో శనివారం ఘనంగా ఇన్వెస్టిచర్ సెర్మనీ నిర్వహించారు.పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శాలెం రాజ్ ముఖ్య అతిథిగా, కొత్తగూడెం టూ టౌన్ ఎస్ ఐ కె. రాజశేఖర్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు వారికి గౌరవ వందనం సమర్పించారు.ఈ సందర్భంగా ఎం. శాలెం రాజ్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఎస్ ఐ కె. రాజశేఖర్ మాట్లాడుతూ, అంకితభావం, చిత్తశుద్ధి, సేవాభావంతో పాటు నైతిక విలువలను అలవర్చుకుని సమాజానికి ఆదర్శ నాయకులుగా ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా 2026--27 విద్యా సంవత్సరానికి స్కూల్ ప్యూపిల్ లీడర్లు (బాలురు, బాలికలు), క్లబ్ జనరల్ సెక్రటరీ, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీలతో పాటు నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు గ్రీన్, రెడ్, యెల్లో, బ్లూ హౌస్‌ల కెప్టెన్లను ఎన్నుకుని, వారి చేత అతిథులు ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## షాబాద్ ఘటనపై సంఘీభావానికి వెళ్తుండగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, పట్నం నరేందర్ రెడ్డి ల అరెస్ట్



**రంగారెడ్డి జిల్లా, జూలై 11 (స్కై న్యూస్):** షాబాద్‌లో జరిగిన హత్యల ఘటనపై బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, పట్నం నరేందర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుల అరెస్టును నిరసిస్తూ శంకర్‌పల్లి బీఆర్ఎస్ నాయకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని వారికి మద్దతు తెలిపారు.

వార్తాతరంగాలు ఆదివారం 12 జూలై 2026

# భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతగా చేపట్టాలి

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

భూ భారతి విజయవంతమైన అమలుకు భూ రీ-సర్వేనే కీలకం

మార్చి-2027 నాటికి మూడు విడతల్లో రీ-సర్వే పూర్తి చేయాలి

రీ-సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ. 60 చెల్లింపు

సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీని వేగవంతం చేయాలి

ఆగస్టు 15 నాటికి ప్రతి విద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందించాలి

భూ రీ-సర్వే, ఇందిరమ్మ ఇండ్లు, సాదా బైనామా దరఖాస్తులపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రి పొంగులేటి

భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు.



**కొత్తగూడెం జూలై 11 (స్కై న్యూస్ ):**భూ రీ-సర్వే, భూ భారతి అమలు, సదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీ, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై మంత్రి, శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐ డి ఓ సి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తిస్థాయిలో చేరలేకపోయామని తెలిపారు.ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి, హైకోర్టు సమస్యను కూడా పరిష్కరించినప్పటికీ అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందని, తిరస్కరణ లకు గల కారణాలను గుర్తించి పరిష్కరించా లని అధికారులను ఆదేశించారు.భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ-సర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇందు కోసం శిక్షణ పొందిన లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లైసెన్స్ సర్వేయర్లకు ఉద్యోగం లేదా రెగ్యులరైజేషన్ హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి ములుగుమాడు గ్రామ రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేశారని గుర్తు చేశారు.తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ-సర్వే చేపట్టినట్లు తెలిపారు.రీ-సర్వేకు అవసరమైన అత్యుత్తమ నాణ్యత గల పరికరాలను జిల్లా స్థాయిలో కొనుగోలు చేయాలని, కొనుగోలు ముందు రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్లు భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుని అవసరమైన సిబ్బంది,పరికరాలు, మౌళిక వసతులు సమకూర్చాలని ఆదేశించారు.ప్రతి నెల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షిస్తామని, మార్చి-2027 నాటికి మూడు విడతల్లో రీ-సర్వే పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.రీ-సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల కోసం మరో రూ.10 చెల్లించి మొత్తం రూ.60 అందజేస్తామని తెలిపారు. చెల్లింపులు వెంటనే జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.విధుల్లో చేరని లైసెన్స్ సర్వేయర్లకు గడువిచ్చి, గడువులోగా చేరని వారి లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు.



లైసెన్స్ సర్వేయర్లకు బీమా, సామాజిక భద్రత కల్పించే చర్యలు కూడా తీసుకుంటామని వెల్లడించారు. ఒక సర్వే నంబరులో కొంత భూమి మాత్రమే ప్రభుత్వ అవసరాలకు సేకరించినప్పటికీ మొత్తం భూమిని నిషేధిత జాబితాలో ఉంచడం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.సాదాబైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించి నోటీసులు త్వరిత గతిన జారీ చేయాలని సూచించారు.పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన 6,500 రెవెన్యూ సమస్యల్లో 98 శాతం సమస్యలకు భూ రీ-సర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు.మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను ప్రస్తుత స్థితిలోనే లబ్ధిదారులకు అందజేసి, మిగిలిన పనులకు నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. నిధులు విడుదలైనా పనులు చేపట్టని చోట్ల బాధ్యులైన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను వెంటనే పూర్తి చేసి గుడిసెల్లో నివసించే కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, మొదటి విడతలో మంజూరు కాని అర్హుల ఇళ్లను కూడా రెండవ విడతలో చేర్చి మంజూరు చేయాలని సూచించారు. ఇసుక, కంకర సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో భూ రీ-సర్వేను నవంబర్ లోపు పూర్తి చేయాలని, రెండవ విడతలో మరో 70 గ్రామాల్లో మార్చి-2027లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. రీ-సర్వే పూర్తయితే సాదాబైనామా దరఖాస్తుల తిరస్కరణలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు.తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో గుడిసెలను గుర్తించిన వాటిలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ఆగస్టు నాటికి రెండు లక్షల ఇళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలని, పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని సూచించారు.సెర్ప్ సీఈవో దివ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థుల యూనిఫాంలన్నీ స్వయం సహాయక సంఘాల మహిళా టైలర్ల ద్వారానే కుట్టిస్తున్నామని తెలిపారు. టెండర్ ఆలస్యంతో వస్త్రం ఆలస్యంగా వచ్చినప్పటికీ జూలై 15లోపు రెసిడెన్షియల్ బాలికలకు, జూలై 30లోపు బాలురకు యూనిఫాంలు అందించాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలోని ప్రతివిద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందేలా కలెక్టర్లు, డీఆర్‌డీఏ, గురుకులాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ పొందిన స్వయం సహాయక సంఘాల టైలర్లు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారని తెలిపారు.జిల్లాలో భూ సర్వే పురోగతిని జిల్లా కలెక్టర్ అంకిత్ మంత్రికి వివరించారు. అక్కినేపల్లి గ్రామంలో మొత్తం 8,990 ఎకరాలకు గాను సుమారు 4,900 ఎకరాల సర్వే పూర్తయిందని తెలిపారు. గుండాల మండలంలో సర్వే పనులు కొనసాగుతున్నాయని, పెద్దవేంకటాపురం గ్రామంలో 537 ఎకరాలు, శుభంపేట గ్రామంలో 267 ఎకరాల సర్వే పూర్తయిందన్నారు. మాదారం గ్రామంలో సోమవారం నుంచి రీ-సర్వే ప్రారంభించనున్నట్లు తెలిపారు.సీతారామ ఎత్తిపోతల పథకం పరిధిలో ఈ నెలలోనే 5,000 ఎకరాలకు భూ సర్వే చేపట్టినట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో మొత్తం 17 గ్రామాల్లో రీ-సర్వే నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని, తొలి దశలో 14 గ్రామాలను ఎంపిక చేసి పాల్వంచ, గుండాల, పినపాక, దుమ్ముగూడెం, బూర్గంపాడు మండలాల్లో సుమారు 4,000 ఎకరాల సర్వే పూర్తి చేసే లక్ష్యంతో చర్యలు చేపట్టామని వివరించారు.జిల్లాలో మొత్తం 206 మంది లైసెన్స్ సర్వేయర్లు ఉన్నారని, వారిలో 56 మంది జిల్లాకు కేటాయించబడ్డారని కలెక్టర్ తెలిపారు. కేటాయించబడిన వారిలో ఇప్పటికే 16 మంది విధుల్లో చేరి భూ రీ-సర్వే పనులు నిర్వహిస్తున్నారని, మిగిలిన వారు కూడా త్వరలో విధుల్లో చేరనున్నట్లు వివరించారు. విధుల్లో చేరిన సర్వేయర్లకు రిటైర్డ్ సర్వేయర్ల ద్వారా అవసరమైన శిక్షణ అందిస్తున్నట్లు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఏడి ల్యాండ్ సర్వే అధికారి శ్రీనివాసరావు, తాసిల్దార్ లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు

## బోటు ప్రమాదంలో తెలుగువారి మృతి

సహాయ కార్యక్రమాలకు సీఎం రేవంత్ ఆదేశం



**హైదరాబాద:**వియత్నాం పర్యటనకు వెళ్లిన తెలుగు రాష్ట్రాలకు చెందిన కొందరు పర్యాటకులు అక్కడ బోటు ప్రమాదంలో మరణించారనే సమాచారంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. వియత్నాంలోని ఫూ క్వాక్ ద్వీపంలో పర్యటనకు వెళ్లిన భారతీయులు బోటు ప్రమాదంలో మరణించారన్న సమాచారంపై ముఖ్యమంత్రి వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. ప్రమాద వివరాలను తెలుసుకోవడంతో పాటు సహాయక చర్యలను ముమ్మరం చేయడంలో కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు వియత్నాంలోని భారతీయ ఎంబసీ కార్యాలయ అధికారులతో సంప్రదింపులు జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ని ఆదేశించారు. ఈ ప్రమాదంలో తెలుగువారు ఉన్నారని ప్రాథమిక సమాచారం అందిన నేపథ్యంలో పూర్తి సమాచారం తీసుకోవాలని, ఈ ఘటనలో క్షతగాత్రులకు అవసరమైన వైద్యం అందించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. బాధితులకు ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు.

## 12వ వార్డులో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం





**రంగారెడ్డి జిల్లా, జూలై 11 (స్కై న్యూస్):** షాద్‌నగర్ మున్సిపాలిటీ 12వ వార్డులో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వార్డు కౌన్సిలర్ కళ్యాణ్‌కార్ దిలీప్ కుమార్, అధికారులు, బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు, వివరాల సవరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు తమ వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు చేసుకోవాలని, బీఎల్‌వోలకు పూర్తి సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమేష్, బీఎల్‌వోలు నుశ్రత్ బేగం, చాపల శ్రీలత, భారతి, గుండు సుగుణతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతికి రూ.750 కోట్ల పర్యావరణ వరం

'సిటీ ఆఫ్ లేక్స్'గా ఆధ్యాత్మిక నగరం..

నారా చంద్రబాబు, పవన్ కళ్యాణ్,నారా లోకేష్ మార్గదర్శకత్వంలో డాలర్స్ దివాకర్ రెడ్డి భగీరథ ప్రయత్నానికి దక్కిన విజయం..

ఢిల్లీ టు తిరుపతి: డాలర్స్ దివాకర్ రెడ్డి 'వన్-మ్యాన్ ఆర్మీ' మార్క్.



**తిరుపతి:**తిరుపతి నగరాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతిష్టాత్మక "సిటీ ఆఫ్ లేక్స్ అండ్ ట్యాంక్స్" ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని సరికొత్త పర్యావరణ విప్లవానికి కేంద్రబిందువుగా మారుస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక "సిటీ ఆఫ్ లేక్స్ అండ్ ట్యాంక్స్"ప్రాజెక్టుకు రూ. 750 కోట్ల భారీ బడ్జెట్ తో ఆమోదం తెలిపింది.అమరావతి, హైటెక్ సిటీ తరహాలోనే తిరుపతిని కూడా ఎకో-ఫ్రెండ్లీ గ్లోబల్ సిటీగా మార్చాలనేది సీఎం చంద్రబాబు సంకల్పం. అందుకనే ఈ ప్రతిపాదన రాగానే **రూ. 750 కోట్లకు తక్షణ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.**

సిటీలు, గ్లోబల్ స్టాండర్డ్స్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టే లోకేష్...ఈ ప్రాజెక్టుకు అవసరమైన సాంకేతిక, పరిపాలనాపరమైన అనుమతులు వేగంగా వచ్చేలా వెన్నుదన్నుగా నిలిచారు.ఢిల్లీలో లభించిన అంతర్జాతీయ మద్దతును కేవలం ప్రతిపాదనల కే పరిమితం చేయకుండా, అటు అధినాయకత్వం నమ్మకాన్ని నిలబెడుతూ, ఇటు తిరుపతి ప్రజల నీటి అవసరాలను తీరుస్తూ డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి వంద శాతం క్రెడిట్ సాధించారు.తుడా చైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్, తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి చూపిన ప్రత్యేక చొరవ,నిరంతర కృషితో విజన్ నేడు సాకారమైంది.గత ఏడాది దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన ఐ సి ఎల్ ఈ ఐ(లోకల్ గవర్నమెంట్స్ ఫర్ సూస్తాయినబిలిటీ ) జాతీయ సదస్సులో తుడా ఛైర్మన్ డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి తిరుపతి నగరాభివృద్ధి పై ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను ప్రవేశపెట్టారు.ప్రపంచ ప్రసిద్ధ జర్మన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ కె ఎఫ్ డబ్ల్యు ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై,తిరుపతిని "సిటీ ఆఫ్ లేక్స్ అండ్ ట్యాంక్స్"గా మార్చే సమగ్ర బ్లూ ప్రింట్ ను తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి వివరించారు.

అంతర్జాతీయ వేదికపై తుడా చైర్మన్ డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి తిరుపతి పర్యావరణ అవసరాలను, భవిష్యత్తు సవాళ్లను సమర్థవంతంగా ప్రెజెంట్ చేసి, ఈ మెగా ప్రాజెక్టుకు పునాది వేశారు.రాష్ట్ర ప్రభుత్వం,తుడా మరియు వివిధ శాఖల ఉన్నతాధికారులతో తుడా చైర్మన్ డా॥డాలర్స్ దివాకర్ రెడ్డి నిరంతరం సమీక్షలు జరుపుతూ, సాంకేతిక అడ్డంకులను తొలగించి రూ.750 కోట్ల ప్రభుత్వ ఆమోదం లభించేలా చేశారు.ఈ రూ.750 కోట్ల నిధులతో తిరుపతి నగర రూపురేఖలు పూర్తిగా మారబోతున్నాయి,నగర పరిధిలోని చారిత్రాత్మక చెరువులు, జలాశయాలను ఆధునీకరించి, కాలుష్య రహితంగా మారుస్తారు.వర్షపు నీరు వృధా కాకుండా, నగరానికి వరద ముప్పు లేకుండా అత్యాధునిక డ్రైనేజీ మరియు వరద నీటి నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేస్తారు.పచ్చదనాన్ని పెంచడం ద్వారా నగర ఉష్ణోగ్రతలను తగ్గించి, పర్యావరణాన్ని సంరక్షించి,చెరువుల పరిసరాలను పర్యాటక కేంద్రాలుగా, ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే వాకింగ్ ట్రాక్‌లు, వినోద ప్రదేశాలుగా సుందరంగా తీర్చిదిద్దుతారు.ఈ సందర్భంగా తుడా చైర్మన్ డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ:ఇది తిరుపతి నగర చరిత్రలోనే ఒక సువర్ణ అధ్యాయం. ఒక ఏడాది క్రితం ఢిల్లీలో కె ఎఫ్ డబ్ల్యు బ్యాంక్ ప్రతినిధులతో నేను మాట్లాడినప్పుడు..తిరుపతి పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ఇదొక్కటే మార్గమని నమ్మాను. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ,జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు రాష్ట్ర ఐటీ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో తిరుపతిని కేవలం ఆధ్యాత్మిక నగరం గానే కాకుండా, ప్రపంచం మెచ్చే 'గ్రీన్ అండ్ స్మార్ట్ సిటీ'గా మార్చడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు.రూ.750 కోట్ల ప్రాజెక్టు తిరుపతి భవిష్యత్తును మార్చేయబోతోందని, పర్యావరణ పరిరక్షణ తో పాటు పర్యాటకంగా తిరుపతికి ఇది సరికొత్త వైభవాన్ని తెస్తుందని తుడా చైర్మన్ డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి అన్నారు. ఈ విజయంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ తుడా చైర్మన్ డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి "హృదయపూర్వక ధన్యవాదాలు." తెలిపారు.

# న్యూ ఏజింగ్ టాప్ ప్రయారిటీ

**న్యూఢిల్లీ :** వయసు పెరగడం మానవ జీవితంలో అనివార్యమైన భాగం. కానీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ప్రక్రియను మందగించి, ఆరోగ్యకరమైన జీవితకాలాన్ని పెంచడానికి భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. ఇందుకోసం సుమారు 26 బిలియన్ డాలర్లు (సుమారు 2 లక్షల కోట్ల రూపాయలు) ఖర్చు చేస్తూ ఒక జాతీయ శాస్త్రీయ కార్యక్రమాన్ని నడుపుతున్నారు. 2025లో బీజింగ్‌లో జరిగిన సైనిక కవాతు సందర్భంగా పుతిన్ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో అవయవాల మార్పిడి ద్వారా మనుషులు యువతను నిలుపుకోవచ్చని, బహుశా అమరత్వం కూడా సాధ్యమవుతుందని చర్చించినట్లు హాట్ మైక్ రికార్డింగ్ ద్వారా బయటపడింది. ఈ చర్చ 2024లో అధికారికంగా ప్రారంభమైన 'న్యూ హెల్త్ ప్రిజర్వేషన్ టెక్నాలజీస్' ప్రాజెక్టుకు సంబంధించినదిగా విశ్లేషకులు భావిస్తున్నారు. రష్యా ప్రభుత్వం దీనిని టాప్ ప్రయారిటీ శాస్త్రీయ కార్యక్రమంగా ప్రకటించిందిఈ కార్యక్రమం అనేక అధునాతన రంగాలపై దృష్టి పెట్టింది. కణాల వృద్ధాప్యాన్ని నెమ్మది చేసే చికిత్సల అభివృద్ధి. ఇది ప్రాజెక్టులో కీలక భాగం. కణజాలాలు, అవయవాలను 3డీ ప్రింటింగ్ ద్వారా తయారు చేయడం. ఇప్పటికే ఎలుకల థైరాయిడ్ గ్రంథి, మానవ కార్టిలేజ్ విజయవంతంగా ప్రింట్ చేశారు. 2030 నాటికి పూర్తి మానవ అవయవాలను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జన్యుపరంగా మార్చిన మినీ పందులలో మానవ అనుకూల అవయవాలు పెంచి, మనుషులకు మార్పిడి చేయడం. ఇది అవయవాల కొరతను తగ్గించడానికి సహాయపడుతుంది. క్రయోథెరపీ ఇవి కణాలను రక్షించడానికి ఉపయోగపడతాయి. ఈ సాంకేతికతలు ప్రపంచవ్యాప్తంగా (ముఖ్యంగా సిలికాన్ వ్యాలీలో) జరుగుతున్న పరిశోధనలతో సమాంతరంగా ఉన్నాయి. రష్యా వాటిని రాష్ట్ర స్థాయిలో ప్రాధాన్యత ఇచ్చి ముందుకు తీసుకెళ్తోంది. ఈ ప్రాజెక్టును పుతిన్ కుమార్తె, ఎండోక్రైనాలజిస్ట్ మరియా వొరొంత్సోవాకు అప్పటించారు. ఆమె నేతృత్వంలోని జన్యు పరిశోధనలతో అనుసంధానించారు. ఆమె రాష్ట్ర జన్యు కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. ఇది వ్యక్తిగత ఆసక్తిని రాష్ట్ర విధానంగా మార్చడానికి సహాయపడింది. ఈ ప్రాజెక్టు ఆశావాదాన్ని కలిగిస్తుంది. జీన్ థెరపీ, రీజెనరేటివ్ మెడిసిన్ వంటి రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. అవయవాల మార్పిడి ద్వారా జీవితకాలం పొడిగించడం సాంకేతికంగా సాధ్యమవుతుంది, కానీ పూర్తి అమరత్వం ఇప్పటికీ శాస్త్రీయంగా దూరంలోనే ఉంది. అవయవాల తిరస్కరణ, జన్యు మార్పుల భద్రత, జంతు ప్రయోగాల నైతికత వంటి సవాళ్లు ఉన్నాయి. ఇలాంటి అధునాతన చికిత్సలు మొదట్లో సంపన్నులు లేదా శక్తివంతులకు మాత్రమే అందుబాటులోకి రావచ్చు. ఇది సామాజిక అసమానతలను పెంచవచ్చు. అలాగే, జంతువులను ఉపయోగించి అవయవాలు పెంచడం వల్ల నైతిక చర్చలు రావచ్చు. రష్యాలో ఆయుర్దాయం తగ్గుతున్న నేపథ్యంలో ఈ ప్రయత్నం సానుకూలం. అయితే, యుద్ధం నేపథ్యంలో ఈ భారీ నిధులు ఇతర సామాజిక?ఆర్థిక అవసరాలకు ఉపయోగపడాలని విమర్శలు వస్తున్నాయి. చైనాతో సహకారం సాధ్యమైతే బయోటెక్నాలజీ రంగంలో రష్యా?చైనా బలం పెరగవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి పోటీ పెరగడం వల్ల మానవాళికి మంచి చికిత్సలు వచ్చే అవకాశం ఉంది. ఈ అభివృద్ధులు శాస్త్రం ఎంతవరకు మానవ సామర్థ్యాలను విస్తరించగలదో చూపిస్తాయి. ఫలితాలు ఏమైనా, ఇవి మానవాళి ముందుకు సాగడానికి ఒక ముఖ్యమైన అధ్యాయం.

# సాగుబడిని చంపేస్తిరి గదరా!

జూలై 8వ తేదీ రాత్రి... యాదాద్రి జిల్లా రామన్నపేట మండలం ఇస్కిళ్ల గ్రామం. 32 ఏండ్ల మైల సురేశ్ ఇంటి దూలానికి వేలాడుతున్నడు. ఎకరం పొలం... ఇంకొంత కౌలు... రూ.5.5 లక్షల బ్యాంకు అప్పు. పంట పండింది.. చేతికీ అందింది. కానీ కొనే దిక్కేది? దానికి గిట్టుబాటు ధర ఏది? గిట్టుబాటు లేదని అప్పులోడు ఆగుతడా! వడ్డీ మీద వడ్డీ పెరిగింది. అది రైతు మెడకు ఉరితాడై బిగిసింది. ఇది ఒక్క సురేశ్ వ్యథ కాదు. మొన్నటి ఎండాకాలంలోనే మెదక్‌లో రాజయ్య, ఖమ్మంలో సుధాకర్, సిద్దిపేటలో వెంకటేశ్, ఆదిలాబాద్‌లో మల్లేశ్... పేర్లు మారుతున్నయి, ఊర్లు మారుతున్నయి. కానీ చావులు కొనసాగుతున్నయి. తుంగతుర్తి మండలం అన్నారం గ్రామంలో రైతు ఎల్లయ్యను కదిలిస్తే.. 'కేసీఆర్ జీవం పోసిన సాగుబడిని రేవంత్ సర్కార్ చంపేస్తున్నది గదరా! ఒక్క ఓటు వేసి ఎంత పాపం మూట గట్టుకుంటిమి' అనే ఆవేదన ఆయన నోటి నుంచి వచ్చింది.

ఉమ్మడి పాలనలో తెలంగాణ భౌగోళిక, జీవ వైవిధ్యాన్ని పూర్తిగా విస్మరించిన్రు. వరి పరిశోధనలన్నీ గుంటూరు, ఉభయ గోదావరి కేంద్రాలుగానే తిరిగినయి. అప్పటి 13 జిల్లాలల్ల పది జిల్లాలు సముద్రం ఒడ్డుననే ఉన్నందున, తీర ప్రాంతపు తేమ గాలికి తగ్గ వంగడాలే సృష్టించి, బలవంతంగా మన నెత్తిన రుద్దిన్రు. మన గాలి వేరు, మన నేల వేరు, మన ప్రకృతి వేరు. కానీ తెలంగాణ గతిలేక అవే కోస్తా విత్తనాలు సాగు చేసేటోళ్లు. మొలక అలికింది మొదలు.. పంట చేతికందేదాక దినదిన గండమే. ఉల్లికోడు, అగ్గి తెగులు, పేనుబంక అన్నీ వలస పాలన విత్తనాల పుణ్యమే. పంటతో కాదు.. వలస గింజతోనే రైతు ఓడిపోయేటోడు.+వశీస్త్రతీుజూష్ట్రఱష =వటవతీవఅఎవ

మన రాష్ట్రం మనకు వచ్చాక ఈ అన్యాయాన్ని సరిదిద్దిండు కేసీఆర్. చెరువుల పునరుద్ధరణతో తెలంగాణ జరంత నిమ్మలపడ్డ తర్వాత, మన గాలికి తగ్గ వరి వంగడాల సృష్టిపైనే సీఎంగా దృష్టి పెట్టిండు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలను పురమాయిస్తే.. నికార్సయిన తెలంగాణ వంగడం 'బతుకమ్మ' పేరుతో ఎదిగింది. పెద్దఎత్తున ధాన్యం పండింది. ఆ తర్వాత తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్-15048) వచ్చింది. ఇది దేశ ధాన్యం మార్కెట్‌నే కుదిపేసింది, క్వింటాకు రూ.3,545 దాకా ధర పలికింది. కర్నూల్ సోనా బియ్యం పక్కకు పోయి తెలంగాణ సోనా బియ్యం మార్కెట్‌లోకి చేరింది. అటు జల విప్లవం, ఇటు హరిత విప్లవంతో తెలంగాణ వ్యవసాయ రూపురేఖలే మారిపోయినయి. దీనికి తోడు రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్తు, రికార్డు స్థాయి కొనుగోలు కేంద్రాల విస్తరణతోపాటు అన్నీ కలిసి తెలంగాణ రైతు తొలిసారి పంట బర్కతి చూసిండు.

ఇప్పుడు రేవంత్‌రెడ్డి బోనస్ పేరుతో రైతు మెడకు కొత్త ఉచ్చు పేనిండు. ఏడు సన్న వంగడాలకే బోనస్ అంట. ఆర్ఎన్ఆర్-15048, బీపీటీ-5204, కేఎన్ఎస్-1638, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, వరంగల్-44, కేఎన్ఎం-7715. ఈ రకాలనే సాగు జేయాలె, అన్నెన్ల నమోదు జేయాలె అంటున్నరు. మిగతా 26 రకాల్ని ఒక్క కలం పోటుతో అవతల పడేసిన్రు. మిర్యాలగూడ రైతన్న తరతరాలుగా పండించే 'చిట్టి' (చిట్టి ముత్యాలు)కు జన్యు ధ్రువీకరణ లేదని పక్కన పెట్టిన్రు.

చిట్టి ఇప్పటి వడ్లు కాదు.. అవి కృష్ణదేవరాయల కాలం నుంచి వారసత్వంగా వచ్చాయని ఈ పాలకులకు ఎవరు చెప్పాలి? కావేరి వద్దంట... జెయింట్ బీపీటీ వద్దంట.. రైతు తన నేలకు, తన అనుభవానికి, తన మార్కెట్‌కు తగ్గ గింజను తానే ఎంచుకొని పండిస్తానంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అంగీకరించదట. ఉమ్మడి రాష్ట్రంలో కోస్తా వంగడాలు రుద్దినట్టే... ఇప్పుడు సచివాలయంలో కూర్చొని నిర్ణయించిన ఏడు వంగడాలనే తెలంగాణ రైతుపై మళ్లీ రుద్దుతున్నరు. ఇది బోనస్ విధానమా? లేక రైతు స్వేచ్ఛకు సంకెళ్లు వేసే మంత్రాంగమా?

ఇదొక్కటే కాదు.. జూన్ నెలలో 58% లోటు నమోదైందని చెప్తున్నరు. 15 జిల్లాల్లో 59% మైనస్ వర్షపాతం కురిసిందని, ' సంవత్సరాల్లో ఎన్నడూ లేని అనావృష్టి' అని చెప్తున్నరు. ఇట్లాంటి కరువు పరిస్థితుల్లో కాళేశ్వరం ప్రాజెక్టును వాడుకుంటే ఎట్లుండేది? దేవుడు ఇచ్చిన వరంలా నిలబడేది. తాజా లెక్కల ప్రకారం.. మేడిగడ్డ వద్ద గోదావరిలో 70 వేల క్యూసెక్కులకుపైగా ప్రవాహం కొనసాగుతున్నది. ఆ నీటిని అన్నారం, సుందిళ్ల మీదుగా మల్లన్నసాగర్, కొండపోచమ్మ, మధ్యమానేరు వంటి రిజర్వాయర్లకు ఎత్తిపోస్తే.. తెలంగాణ అంత నారుమళ్లతో పచ్చగా ఉండేది.

కానీ కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానంటూ ప్రగల్భాలు పలుకుతున్న రేవంత్‌రెడ్డి రాజకీయ కక్షతో ప్రాజెక్టును పక్కన పెట్టిండు. కానీ కాళేశ్వరం ప్రాజెక్టును నిలిపేయడం వల్ల నష్టపోయింది కేవలం నీటి పారుదల వ్యవస్థ కాదు... తెలంగాణ రైతు భరోసా అని కాంగ్రెస్ పాలకులు గుర్తించాలి. పంట పండించినా రైతుకు గిట్టుబాటు లేదు. కేంద్ర ప్రభుత్వం మక్కకు క్వింటాకు రూ.2,410 మద్దతు ధర ప్రకటించినా, గన్నీ బ్యాగులు, రవాణా, అదనపు తూకాల పేరుతో రైతు చేతికి అందేది రూ.2,050 వరకే. కొన్ని జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలే లేక దళారులకు రూ.1,700-1,750కే అమ్ముకోవాల్సి వస్తున్నది. పసుపు రైతుదీ ఇదే దుస్థితి.

ఎంఎస్పీ కాగితాలకే పరిమితమైంది. వరి పండించిన కౌలు రైతుల్లో కేవలం 17-20 శాతం మంది, పత్తి రైతుల్లో 6.7 శాతం మంది మాత్రమే ప్రభుత్వానికి నేరుగా విక్రయించగలుగుతున్నరు. మిగతావాళ్లంతా దళారుల దయా దాక్షిణ్యాల మీద పంట అమ్ముకుంటున్నారని తెలంగాణ కౌలు రైతుల సర్వే-2026 తేల్చి చెప్పింది. ఐదు ఎకరాల లోపు రైతు రూ.3-5 లక్షల అప్పులో చిక్కుకొంటే ఆత్మహత్యల ప్రమాదం పెరుగుతుందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నరు. 'దేశంలో రైతుల సగటు అప్పుల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో, తెలంగాణ రెండో స్థానంలో ఉన్నట్టు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు తేల్చి చెప్పాయి.

రైతుకు విత్తనపు గింజ ఎంపిక స్వేచ్ఛను పాలకులు కుదించిండ్రు. సన్న వడ్ల బోనస్‌పై ఆంక్షలు పెట్టిన్రు. కాళేశ్వరం నీళ్లను దూరం చేసిన్రు. కొనుగోలు వ్యవస్థను నిర్వీర్యం చేసిన్రు. రైతు భరోసాను వాయిదాల పాల్జేసిన్రు. యాప్ పెట్టి యూరియా అందకుండా చేసిన్రు. కేసీఆర్ వేసిన వ్యవసాయ పునాదులను ఒక్కొక్కటిగా బలహీనపరుస్తూ సాగుబడినే సంక్షోభంలోకి నెట్టడం రాష్ట్రానికి శుభసూచకం కాదు.

ఇంకెన్ని కడగండ్లు దాటితే తెలంగాణ వ్యవసాయం తేరుకుంటుంది? 'సాగుబడిని చంపేస్తిరి గదరా!' అని అన్నారం ఎల్లయ్య గుండె లోతుల నుంచి వచ్చిన మాట వెనుక ఎంత వేదన, ఎంతటి చేదు అనుభవం దాగి ఉన్నదో తెలంగాణ పల్లెల్లో తిరిగితే అర్థమవుతుంది. యూరియా దగ్గరా రైతు ఆందోళన తగ్గే సూచనలు కనిపించడం లేదు. ఈ ఖరీఫ్‌లో తెలంగాణకు 11.5 లక్షల టన్నుల యూరియా అవసరమని ప్రభుత్వమే అంచనా వేసింది. కేంద్రం 10 లక్షల మెట్రిక్ టన్నులకే ఒప్పుకోవడంతో సీజన్ మొదలయ్యే నాటికే 1.5 లక్షల టన్నుల లోటు స్పష్టమైంది.

ఇదే సమయంలో గత 125 ఏండ్లలోనే అత్యల్ప వర్షపాతం నమోదవడంతో 17 జిల్లాల్లో సాగు ఆశించిన స్థాయికి చేరలేదు. అయినా జూలై మొదటి వారానికే సుమారు 2.38 లక్షల టన్నుల యూరియా రైతుల చేతికి వెళ్లినట్టు ప్రభుత్వమే ప్రకటించింది. అసలు యూరియా వినియోగంలో అత్యంత కీలకమైన జూలైఆగస్టు నెలలు ఇప్పుడే మొదలవుతున్నయి. వ్యవసాయశాఖ అంచనాల ప్రకారమే ఈ రెండు నెలల్లో ప్రతి నెలా మరో 1.5 నుంచి 3 లక్షల టన్నుల వరకు అదనపు అవసరం ఉంటుంది. అంటే వర్షాలు ఆలస్యమైనంత మాత్రాన రైతు అవసరం తగ్గలేదు... వాయిదా పడింది అంతే. ఆ వాయిదా పడిన డిమాండ్ వానలు కుదిరిన వెంటనే ఒక్కసారిగా విరుచుకుపడటం ఖాయం.

యాప్‌లు, గణాంకాలతో ప్రభుత్వం మభ్యపెడుతున్నది. అవసరమైన బఫర్ నిల్వలు పెంచడం, అదనపు కేటాయింపులు ముందుగానే రాబట్టడం, జిల్లాల వారీగా రైతుకు స్పష్టమైన భరోసా కల్పించడం వంటి చర్యలు కనిపించడం లేదు. ఎరువుల కొరత అనేది వచ్చిన తర్వాత ఎదుర్కొనే సంక్షోభం కాదు... సంక్షోభం వచ్చిన తర్వాత సమీక్షలు పెట్టడం పరిపాలన ధర్మం కాదు. ముందే అంచనా వేసి నివారించాల్సిన బాధ్యత. ఆ వైఫల్యం చివరికి యూరియా కొరతగా కాదు... రైతు గుండె కోతగా బయటపడుతుంది. రెండు పాలనల మధ్య తేడాను గణాంకాలు మాత్రమే చెప్పడం లేదు. కేవలం నాయకుల ప్రసంగాలు మాత్రమే చెప్పడం లేదు... పంట పొలమే చెప్తున్నది. కేసీఆర్ నేలకు తగ్గ గింజ ఇచ్చిండు... నీళ్లిచ్చిండు... పెట్టుబడికి, గిట్టుబాటుకు భరోసా ఇచ్చిండు. రేవంత్‌రెడ్డి పాలనలో ఇప్పుడా సాగుబడి పునాదులు కదులుతున్నయనే ఆవేదనే రైతు మాటల్లో వినిపిస్తున్నది.

# అమ్ములపొదిలో పాశుపతాస్త్రం

**న్యూఢిల్లీ :** భారత రక్షణ రంగం పాశుపతాస్త్రంను సిద్ధం చేసింది. ఇప్పటికే ప్రపంచంలో అత్యంత శక్తి వంతంగా గుర్తింపు పొందిన ఇడియన్ ఆర్మీ చేతిలోకి ఇది రావడంతో మరింత బలం చేకూరినట్లయింది. పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన 'పినాకా లాంగ్ రేంజ్ గైడెడ్ రాకెట్ ను విజయవంతంగా పరీక్షించారు. దీంతో భారత సైన్యం దీర్ఘదూర దాడి సామర్థ్యం మరింత బలోపేతమైంది. అయితే ఇది ఎలా తయారైంది? దీని వల్ల సైన్యానికి ఎటువంటి ఉపయోగం?ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ లో 8, జూలై 2026న నిర్వహించిన ఈ పరీక్షలో రాకెట్ నిర్దేశించిన 60 కిలోమీటర్ల కనిష్ఠ దూరాన్ని అత్యంత కచ్చితత్వంతో చేరుకుని లక్ష్యాన్ని ఛేదించింది. పరీక్ష సందర్భంగా ప్రయోగించిన పినాకా ఎల్ఆర్‌జీఆర్ ముందుగా నిర్దేశించిన మార్గాన్నే అనుసరిస్తూ ఎలాంటి వ్యత్యాసం లేకుండా ప్రయాణించింది. చివరికి లక్ష్యాన్ని అత్యంత ఖచ్చితత్వంతో తాకింది. రాకెట్ గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థలు అద్భుతంగా పనిచేశాయని ఈ పరీక్ష మరోసారి నిరూపించింది. పినాకా ఎల్ఆర్‌జీఆర్‌ను డీఆర్‌డీవో ఆధ్వర్యంలో అభివృద్ధి చేశారు. పూణెలోని ఆర్మమెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ , హై ఎనర్జీ మెటీరియల్స్ రీసెర్చ్ లాబొరేటరీ (లు ఈ రాకెట్ రూపకల్పనలో కీలక పాత్ర పోషించాయి. అలాగే హైదరాబాద్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబొరేటరీ , రీసెర్చ్ సెంటర్ ఇమారత్ గైడెన్స్, నావిగేషన్, నియంత్రణ వ్యవస్థలకు అత్యాధునిక సాంకేతిక సహకారం అందించాయి. పినాకా ఎల్ఆర్‌జీఆర్ సాధారణ రాకెట్ కాదు. ఇది లక్ష్యానికి చేరుకునేంతవరకు తన దిశను సరిచేసుకుంటూ ప్రయాణించే గైడెడ్ రాకెట్. అందువల్ల శత్రు కమాండ్ సెంటర్లు, బంకర్లు, వ్యూహాత్మక స్థావరాలు వంటి కీలక లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ధ్వంసం చేయగలదు. తక్కువ సమయంలో భారీ అగ్నిశక్తిని ప్రదర్శించగల సామర్థ్యం దీనికి ప్రత్యేకత. ఈ విజయవంతమైన పరీక్షతో భారత సైన్యానికి అత్యాధునిక ఆయుధ వ్యవస్థ మరోటి అందుబాటులోకి రానుంది. సరిహద్దు భద్రత, ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లు, యుద్ధ పరిస్థితుల్లో వేగవంతమైన ప్రతిస్పందనకు ఈ రాకెట్ కీలకంగా ఉపయోగపడుతుందని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారత భూసేన అగ్నిశక్తిని మరింత పెంచడంలో పినాకా కీలక పాత్ర పోషించనుంది. ఈ పరీక్ష స్వదేశీ రక్షణ తయారీ సామర్థ్యానికి మరో నిదర్శనంగా నిలిచింది. విదేశీ ఆయుధాలపై ఆధారపడకుండా అత్యాధునిక రాకెట్ వ్యవస్థలను దేశీయంగానే అభివృద్ధి చేయగల సామర్థ్యం భారత్‌కు ఉందని ఈ పరీక్ష మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. రక్షణ రంగంలో స్వావలంబన లక్ష్యానికి ఇది మరింత బలాన్ని చేకూర్చనుంది. పినాకా లాంగ్ రేంజ్ గైడెడ్ రాకెట్ విజయవంతమైన పరీక్షతో భారత్ ఆధునిక రాకెట్ సాంకేతికతలో మరో కీలక అడుగు వేసింది. ఖచ్చితత్వం, దీర్ఘదూర దాడి సామర్థ్యం, స్వదేశీ అభివృద్ధి వంటి అంశాల్లో ఈ వ్యవస్థ భారత రక్షణ రంగానికి కొత్త బలాన్ని అందించనుంది. భవిష్యత్తులో మరిన్ని అత్యాధునిక ఆయుధ వ్యవస్థల అభివృద్ధికి ఇది మార్గదర్శకంగా నిలుస్తుందని రక్షణ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## పేదల కన్నీళ్లు తుడవడమే ప్రభుత్వ లక్ష్యం'

- సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి




ఆపదలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, పేదల కన్నీళ్లు తుడవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 129 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.35,91,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పాటు, ఖమ్మం రూరల్ మండలానికి చెందిన మూడు కళ్యాణలక్ష్మి చెక్కులను శనివారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. నిరుపేదలకు వైద్య ఖర్చుల భారం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధిని వేగంగా అందిస్తున్నామన్నారు. అలాగే ఆడబిడ్డల పెళ్లిళ్లకు కళ్యాణలక్ష్మి పథకం ఎంతో ఆసరాగా నిలుస్తోందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి , స్థానిక కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ బాధ్యత...

చల్లూర్ ఉర్దూ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**హుజురాబాద్:** వీణవంక మండలం చల్లూర్ గ్రామంలోని ఉర్దూ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు, బోధన విధానం, తరగతి గదుల నిర్వహణ, మధ్యాహ్న భోజనం నాణ్యత, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య పరిస్థితులు, మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి చదువు, పాఠశాలలో ఉన్న సౌకర్యాలు, అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న పోషకాహారం, నమోదు వివరాలు, నిర్వహణను కూడా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తనిఖీలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించి, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక వసతులు అందించడం ప్రభుత్వ బాధ్యత. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి పాఠశాలపై ప్రత్యేక దృష్టి సారించి, విద్యార్థుల భవిష్యత్తు కోసం అవసరమైన సౌకర్యాలన్నీ కల్పించేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తాం" అని తెలిపారు.

## ప్రపంచ జనాభా దినోత్సవంపై అవగాహన సదస్సు

**జయశంకర్ భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ డి ఎం అండ్ హెచ్ ఓ కార్యాలయంలో ప్రపంచ జనాభా దినోత్సవ అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించినారు ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జూలై 11 నుంచి 18 వరకు జిల్లా వ్యాప్తంగా జనాభా నియంత్రణ ,మాత శిశు సంరక్షణ ,అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు . బిడ్డకు బిడ్డకు మధ్య కనీసం మూడు సంవత్సరములు ఎడం ఉండాలని, ప్రభుత్వం అందిస్తున్న కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించాలని దీనివలన తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు బాల్య వివాహాలు ప్రోత్సహించరాదని ఆర్థిక అభివృద్ధి ,ఆరోగ్యం, విద్య సమానత్వం బాధ్యతయుతమైన జీవన విధానం చిన్న కుటుంబంతోనే సాధ్యమని తెలిపారు,ప్రతి సంవత్సరం జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం ఘనంగా నిర్వహిస్తారు, 2026 సంవత్సరానికి గాను దీని ప్రధాన థీమ్ యువత ఆశలు ఆకాంక్షలు నెరవేర్చడం నేడు మరియు భవిష్యత్తు కోసం-- తెలంగాణలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రవ్యాప్తంగా కుటుంబ నియంత్రణ ఆరోగ్య సంరక్షణ మరియు సుస్థిర అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి విద్యాసంస్థలు, మరియు స్వచ్ఛంద సంస్థలు, జనాభా నియంత్రణ మరియు వనరుల సద్వినియోగం పై ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నాయి .అదేవిధంగా డిఎం అండ్ హెచ్ ఓ మాట్లాడుతూ13-07-2026 నాడు నిర్వహించబోయే జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమమును విజయవంతముగా నిర్వహించాలని సూచించారు కుటుంబ నియంత్రణ కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించిన వారికి శాలువా మెమొంటోళ్ళతో సన్మానించారు బెస్ట్ ఫ్యామిలీ ప్లానింగ్ సర్జన్ డాక్టర్ దివ్య జి జి హెచ్, డాక్టర్ కేజీయ గైనకాలజిస్ట్, డాక్టర్ రోహిణి భూపాల్ పల్లి, శ్రీలత ఏఎన్ఎం మొగుళ్లపల్లి, రాజశ్రీ ఆశ పొట్లపల్లి విలేజ్ ,మధుమిత వైఫ్ ఆఫ్ సంతోష్ రాజీవ్ కాలనీ భూపాల్ పల్లి ఒక బిడ్డ కలిగి ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించు కున్నారు , ఈ కార్యక్రమంలో పి ఓ లు డాక్టర్ శ్రీదేవి సందీప్ డెమో కె శ్రీదేవి ఏ ఎం ఓ సుధాకర్, సూపర్వైజర్ లు ఏఎన్ఎంలు హెల్త్ అసిస్టెంట్లు ,ఆశాలు మొదలగు వారు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా రేణిగుంటలో వైయస్సార్‌సీపీ సర్ కార్యక్రమం..

రైతుల సమస్యలపై నేతలకు ఫిర్యాదు!...

**రేణిగుంట:** తిరుపతి జిల్లా రేణిగుంట మండలంలోని గుత్తివారిపల్లి గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఎస్ఐఆర్' కార్యక్రమం ఘనంగా జరిగింది. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ సమావేశానికి వైయస్సార్‌సీపీ శ్రేణులు, గ్రామస్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భూమాన కరుణాకర్ రెడ్డి, తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని, పార్టీ శ్రేణులతో మమేకమయ్యారు. నేతల రాకతో గుత్తివారిపల్లి గ్రామంలో ఒక్కసారిగా సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా కార్యకర్తలంతా సమిష్టిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు భూమాన కరుణాకర్ రెడ్డి, ఎంపీ గురుమూర్తితో కలిసి ఆయన స్థానిక నేతలకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఇదే సమయంలో గుత్తివారిపల్లి గ్రామ రైతులు తమ ఎదుర్కొంటున్న ఒక పెద్ద సమస్యను నేతల దృష్టికి తీసుకొచ్చారు. తమ పచ్చని పొలాలకు సాగునీరు అందకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు పంట కాలువలకు అడ్డంగా ప్రహరీ గోడలు నిర్మిస్తున్నారని, దీనివల్ల పొలాలకు సాగునీరు రాకుండా నిలిచిపోతోందని ప్రజాప్రతినిధుల ముందు వాపోయారు. తమ మొర ఆలకించి, సాగునీటి కాలువలను అడ్డుకుంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీ మద్దెల గురుమూర్తి, జిల్లా అధ్యక్షుడు భూమాన కరుణాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డిలకు గ్రామ రైతులు ఫిర్యాదు చేశారు. రైతుల సమస్యపై సానుకూలంగా స్పందించిన వైయస్సార్‌సీపీ కీలక నేతలు, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు సాగునీరు సక్రమంగా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు

## బిజినెస్

### విజింజం పోర్టులో అదానీ వాటా విక్రయంపై కమిటీ



దేశీయ నౌకాయాన రంగంలో వ్యూహాత్మకమైన విజింజం అంతర్జాతీయ పోర్టులో అదానీ గ్రూప్ తన 49 శాతం వాటాను ఉపసంహరించుకోవాలని భావిస్తున్న తరుణంలో కేరళ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రతిపాదిత వాటా విక్రయం వల్ల రాష్ట్ర ప్రయోజనాలపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశంపై సమగ్రంగా అధ్యయనం చేసేందుకు కేరళ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వీడీ సతీశన్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు.

**రాష్ట్ర ప్రయోజనాలే పరమావధి**

కేబినెట్ సమావేశం ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి సతీశన్ విలేకరులతో మాట్లాడారు. విజింజం పోర్టు కేరళ ఆర్థిక ప్రగతికి కీలకమన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఎలాంటి నిర్ణయాన్నీ ప్రభుత్వం తీసుకోబోదని ఆయన స్పష్టం చేశారు. మీడియాలో కథనాలు వచ్చేంత వరకు అదానీ గ్రూప్ తలపెట్టిన ఈ వాటా బదిలీ వ్యవహారం తమ ప్రభుత్వ దృష్టికి రాలేదని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. అంతర్జాతీయ షిప్పింగ్ దిగ్గజం ఎంఎస్‌సీ గ్రూప్‌తో అదానీ సంస్థ దాదాపు ఏడాది కాలంగా ఈ వ్యవహారంపై చర్చలు జరుపుతోందనే నిజాన్ని ప్రభుత్వం ఆ తర్వాతే గుర్తించిందని ఆయన వెల్లడించారు. 'వాటా బదిలీకి సంబంధించిన ప్రతిపాదనను అదానీ గ్రూప్ సెబీకి సమర్పించిన రోజే.. ముందస్తుగా రాష్ట్రానికి సమాచారం ఇవ్వకపోవడంపై అసంతృప్తిని తీవ్రంగా వ్యక్తం చేశాం. ఆ తర్వాతే కన్సెషన్ ఒప్పంద నిబంధనల ప్రకారం వాటా బదిలీకి ముందస్తు అనుమతి ఇవ్వాలని కోరుతూ అదానీ గ్రూప్ అధికారికంగా ప్రభుత్వం వద్దకు వచ్చింది' అని ముఖ్యమంత్రి అన్నారు.

**గుత్తాధిపత్యం అసాధ్యం**

విపక్ష నేత పినరయి విజయన్ చేస్తున్న విమర్శలను ముఖ్యమంత్రి పూర్తిగా కొట్టిపారేశారు. విజయన్ అసలు కన్సెషన్ అగ్రిమెంట్ (రాయితీ ఒప్పందం) చదవకుండానే గుడ్డిగా ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ డీల్ వల్ల ఎమ్మెస్సీ గ్రూప్ గుత్తాధిపత్యం ఏర్పడుతుందన్న వాదనలో వాస్తవం లేదన్నారు. ఏ ఒక్క సంస్థా దీనిపై పూర్తి ఆధిపత్యం చలాయించలేదని సీఎం స్పష్టం చేశారు.

**కేంద్ర అనుమతులు వస్తేనే డీల్ పూర్తి!**

ప్రస్తుతానికి వాటా బదిలీ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని, కాబట్టి రాయితీ ఒప్పందాన్ని అదానీ గ్రూప్ ఉల్లంఘించిందని చెప్పలేమని సీఎం వివరించారు. ఈ లావాదేవీ ముగియాలంటే కేవలం రాష్ట్ర ప్రభుత్వ అనుమతి మాత్రమే సరిపోదని.. దీనికి అనేక రకాల భద్రతా, వ్యూహాత్మక కోణాలు ముడిపడి ఉన్నాయని పేర్కొన్నారు.

# భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు.. మదుపర్ల సంపద రూ.8 లక్షల కోట్లు మాయం!

దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం కుప్పకూలాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఒక్క ప్రకటనతో సూచీలు అమాంతం పతనమయ్యాయి. ఈ అనూహ్య పరిణామాలతో దాదాపు రూ.8 లక్షల కోట్ల మేర మదుపర్ల సంపద ఆవిరైంది. నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 1600 పాయింట్లకు పైగా దిగజారగా.. నిఫ్టీ 24 వేల మార్క్‌ను కోల్పోయింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ఉదయం సూచీలు నష్టాలతోనే ప్రారంభమయ్యాయి. క్రితం ముగింపు (78,180)తో పోలిస్తే దాదాపు 400 పాయింట్ల నష్టంతో 77,816 వద్ద సెన్సెక్స్ నేడు ట్రేడింగ్‌ను ప్రారంభించింది. మధ్యాహ్నం వరకు ఒడుదొడుకులతోనే సాగిన సూచీ.. ఆ తర్వాత కుప్పకూలింది. ఇరాన్‌తో సీజ్‌ఫైర్ ముగిసిందంటూ ట్రంప్ చేసిన ప్రకటన మార్కెట్ల బ్లడ్‌బాత్‌కు దారితీసింది. కేవలం 30 నిమిషాల్లోనే సెన్సెక్స్ 1000 పాయింట్లు తగ్గింది. ఒక దశలో 1800 పాయింట్లకుపైగా పతనమైన సూచీ.. మార్కెట్ ముగిసే సమయానికి 1677.12 పాయింట్లు క్షీణించి 76,503.60 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ కూడా 516.65 పాయింట్ల నష్టంతో 23,882.05 వద్ద ముగిసింది. దాదాపు అన్ని రంగాల సూచీలు నష్టపోయాయి. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, శ్రీరామ్ ఫైనాన్స్, మారుతి సుజుకీ, హిందుస్థాన్ యునీలివర్ షేర్లు భారీగా పడిపోయాయి. ఓఎన్జీసీ, హిందాల్కో ఇండస్ట్రీస్, కోల్ ఇండియా, బజాజ్ ఆటో స్వల్పంగా లాభపడ్డాయి. జియో ఫైనాన్షియల్ షేరు 12 శాతం మేర కుంగింది. అమెరికా,



ఇరాన్ పరస్పర దాడులతో పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఈ నేపథ్యంలోనే బుధవారం మధ్యాహ్నం ట్రంప్ స్పందిస్తూ.. టెహ్రాన్‌తో కాల్పుల విరమణ ముగిసిందని ప్రకటించారు. ఆ దేశంతో చర్చలు జరపడం కూడా వృథా అని పేర్కొన్నారు. దాంతో మళ్లీ యుద్ధభయాలు నెలకొన్నాయి. ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర ఆరు శాతం పెరిగి 78.56 డాలర్లకు చేరింది. రూపాయి విలువ మరింత క్షీణించింది.

## అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు మళ్లీ తారాస్థాయికి..

# భగ్గుమన్న ముడిచమురు ధరలు

అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరోసారి తారాస్థాయికి చేరాయి. దాంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఇక ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేయడంతో ఇవాళ చమురు ధరలు ఆరు శాతానికిపైగా ఎగబాకాయి. పశ్చిమాసియా నుంచి ఇంధన సరఫరాపై నెలకొన్న ఆందోళనలే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచింది. అంతర్జాతీయ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 6.52 శాతం (4.69 డాలర్లు) పెరిగి బ్యారెల్‌కు దాదాపు 80 డాలర్ల వద్దకు చేరింది. అదేవిధంగా అమెరికా బెంచ్‌మార్క్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ధర కూడా 6 శాతం (4.85 డాలర్లు) పెరిగి బ్యారెల్‌కు 75 డాలర్ల సమీపంలో ట్రేడయ్యింది. ఓ అంతర్జాతీయ మీడియా సంస్థ తన కథనంలో ఈ వివరాలను వెల్లడించింది. టర్కీలోని అంకారాలో జరుగుతున్న నాటో సదస్సు సందర్భంగా ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. హార్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులకు ప్రతిగా తమ సైన్యం రాత్రికిరాత్రి ఇరాన్‌పై కొత్త దాడులు చేసిందని ఆయన తెలిపారు. "నా వరకు ఇరాన్‌తో ఒప్పందం ముగిసిపోయింది. వాళ్లతో ఇకపై చర్చలు జరపను. వాళ్లు రోగగ్రస్తులు, హింసావాదులు. అణుబాంబు దొరికితే దాన్ని వాడటానికి కూడా వెనుకాడరు. వాళ్లతో చర్చలు జరపడం అంటే సమయం వృథా చేసుకోవడమే. వాళ్లు అబద్ధాల కోరులు" అంటూ ఇరాన్ నేతలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ పరిణామం భారత మార్కెట్లపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది. ముడి చమురు ధరల పెరుగుదలతో మధ్యాహ్నం 3 గంటల సమయానికి సెన్సెక్స్ 1,900 పాయింట్లు (2 శాతానికి పైగా) నష్టపోయి 76,259 వద్ద ట్రేడ్ అయింది. నిఫ్టీ కూడా దాదాపు 600 పాయింట్లు పతనమై 23,805 వద్ద నిలిచింది.




## అక్తర్ రికార్డు బద్దలు కొడుతా'..

# భారత రైజింగ్ స్టార్ శపథం

గుజరాత్ టైటాన్స్ పేసర్ అశోక్ శర్మ పాకిస్తాన్ మాజీ క్రికెటర్ షోయబ్ అక్తర్ ప్రపంచ రికార్డును బద్దలు కొడుతానంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 161.3 కిమీవేగంతో అక్తర్ విసిరిన బంతి ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది. తాజాగా అక్తర్ రికార్డును తాను బద్దలు కొడుతానంటూ అశోక్ శర్మ శపథం చేయడం గమనార్హం.

ఏదోఒక రోజు అక్తర్ రికార్డును బద్దలు కొట్టే సత్తా తనకు ఉందని ధీమా వ్యక్తం చేశాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడిన అశోక్ శర్మ ఒక మ్యాచ్‌లో 154.2 కిలోమీటర్ వేగంతో (గంటకు 95.8 మైళ్ల వేగం) బంతి విసిరి ఐపీఎల్ చరిత్రలోనే ఫాస్టెస్ట్ డెలివరీతో రికార్డు సృష్టించాడు. అంతకముందు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ 2025 సీజన్‌లో 22 వికెట్లు తీయడమే గాక ప్రతీ మ్యాచ్‌లో దాదాపు 150 కిలోమీటర్ల వేగంతో స్థిరంగా బంతులు వేయడం విశేషం. ఒక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అశోక్ శర్మ మాట్లాడుతూ.. 'ఏదో ఒకరోజు అక్తర్ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాలనే సంకల్పంతోనే ఉన్నా. బౌలింగ్ వేగం విషయంలో మాత్రం ఎన్నటికీ రాజీపడను. నా దృష్టి ఎప్పుడు బౌలింగ్‌ను మెరుగుపరుచుకోవడంపైనే ఉంటుంది.

అంతా సవ్యంగా సాగితే, బహుశా ఒకరోజు అక్తర్ నెలకొల్పిన 161 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలుగుతానేమో. ఈ క్రమంలో నన్ను నేను మెరుగుపరచుకునేందుకు మరింత కష్టపడుతాను. అయితే నా బౌలింగ్‌ను మెరుగుపరచుకునే క్రమంలో ఆరోగ్యకరమైన పోటీ ఉండడాన్ని ఇష్టపడుతాను.' అని చెప్పుకొచ్చాడు. ఇక జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు ఎంపికైన అశోక్ శర్మకు తుది జట్టులో అవకాశం లభిస్తుందా? లేదా? అనేది పక్కనబెడితే ఐపీఎల్ ప్రదర్శనతో పాటు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ప్రదర్శనను పరిగణలోకి తీసుకొని ఎంపిక చేశారు. అయితే ఇండియా-ఏ జట్టు తరఫున అరంగేట్రం చేసినప్పటికీ పెద్దగా రాణించలేదు. ఒక వన్డే మ్యాచ్‌లో 75 పరుగులిచ్చి ఒక వికెట్ మాత్రమే తీశాడు. ఇక ఐపీఎల్ 2026 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆరు మ్యాచ్‌లాడిన అశోక్ శర్మ ఆరు వికెట్లు మాత్రమే తీశాడు. అయితే ప్రతీ జట్టుకు పేస్ బౌలర్లు ఆస్తిలాంటి వారు. జమ్మూ కశ్మీర్ సంచలనం ఉమ్రాన్ మాలిక్ ఐపీఎల్ 2022లో




సంచలన ప్రదర్శనతో జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. 2023లో వన్డేలు, టీ20ల్లో ఆడినప్పటికీ ఎక్కువకాలం జట్టులో కొనసాగలేకపోయాడు. తన వేగం బలమైనప్పటికీ దానిని నిలకడగా కొనసాగించడంలో విఫలమయ్యాడు. దీనికి తోడు తరచూ గాయాల బారీన పడడం కూడా అతడిని జట్టుకు దూరం చేసింది. మరి అశోక్ శర్మ ఏ మేరకు రాణిస్తాడనేది చూడాలి. ఒకవేళ టీమిండియాలో అవకాశం ఇవ్వాలనుకుంటే అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానా, బుమ్రా వంటి స్టార్ పేస్లరకు పని భారాన్ని తగ్గించే క్రమంలో అశోక్ శర్మ ఉపయోగపడగలడు. బుమ్రా ఒక్కడే టీమిండియా పేస్ బారాన్ని మోస్తున్న తరుణంలో అశోక్ శర్మ లాంటి యువ బౌలర్ల అవసరం టీమిండియాకు ఎంతో ఉంది.

**చెక్కుచెదరని అక్తర్ రికార్డు**

2003 వన్డే ప్రపంచకప్‌లో రావల్పిండి ఎక్స్‌ప్రెస్ షోయబ్ అక్తర్ అత్యంత ఫాస్టెస్ట్ బంతిని విసిరాడు. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో నిక్ నైట్‌కు (గంటకు 161.3 కిలోమీటర్ వేగంతో) బంతిని విసిరాడు. గంటకు 100 మైళ్ల వేగంతో విసిరడంతో అక్తర్ పేరు క్రికెట్ పుస్తకాల్లో నిలిచిపోయింది. ఇప్పటికీ ఆ రికార్డు చెక్కుచెదరకుండా ఉంది. ఆసీస్ స్పీడస్టర్లు బ్రెట్ లీ, షాన్ టైట్‌లు అక్తర్ రికార్డుకు సమీప దూరంలో నిలిచిపోయారు. బ్రెట్ లీ ఒక మ్యాచ్‌లో గంటకు 161.1 కిలోమీటర్ల వేగం నమోదు చేయగా, షాన్ టైట్ రెండుసార్లు (2005, 2010) అక్తర్ రికార్డుకు దగ్గరగా వచ్చాడు. 2005లో గంటకు 160.7 కిలోమీటర్ల వేగంతో విసరగా, 2010లో గంటకు 161.1 కిలోమీటర్ వేగంతో విసిరాడు.

## స్పోర్ట్స్


### కొలంబియా షూటౌట్.. క్వార్టర్స్‌లోకి స్విట్జర్లాండ్



**వాంకోవర్:** ఫిఫా వరల్డ్‌కప్‌లో మంగళవారం మరో మ్యాచ్ ఉత్కంఠంగా జరిగింది. స్విట్జర్లాండ్ పెనాల్టీ షూటౌట్ ఆధారంగా కొలంబియాపై విజయాన్ని నమోదు చేసింది. 4-3 గోల్స్ తేడాతో షూటౌట్‌లో స్విస్ నెగ్గింది. తొలుత ఇరు జట్ల మధ్య రౌండ్16 మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఎక్స్‌ట్రా టైంలో కూడా రెండు జట్లు గోల్స్ చేయలేకపోయాయి. అయితే పెనాల్టీ షూటౌట్‌లో మాత్రం స్విస్‌కు కలిసి వచ్చింది. కీలకమైన నిర్ణయాత్మక పెనాల్టీని రూబెన్ వర్గాస్ గోల్‌గా మలచడంతో స్విట్జర్లాండ్ బృందంలో సంబరాలు మొదలయ్యాయి. కొలంబియాపై 4-3 తేడాతో షూటౌట్‌లో నెగ్గిన స్విట్జర్లాండ్.. క్వార్టర్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాతో తలపడనున్నది. మిస్సోరీలోని కన్సాస్ సిటీలో శనివారం ఈ మ్యాచ్ జరగనున్నది. ఫిఫా వరల్డ్‌కప్‌లో 1954 నుంచి ఇప్పటి వరకు స్విట్జర్లాండ్ క్వార్టర్స్‌లోకి ప్రవేశించలేదు. వరల్డ్‌కప్‌లో రెండు గోల్స్ కొట్టిన స్విస్ ప్లేయర్ వర్గాస్ ఈ మ్యాచ్‌లో స్టాపేజ్ టైంలో ఎంట్రీ ఇచ్చాడు. కొలంబియా ప్లేయర్లు దేవిన్‌సన్ సాంచేజ్, కూచో హెర్నాండేజ్ .. షూటౌట్‌లో విఫలం అయ్యారు. దీంతో స్విట్జర్లాండ్ విక్టరీకి మార్గం ఈజీ అయ్యింది. వాస్తవానికి స్విట్జర్లాండ్ జట్టులో కీలక ప్లేయర్ అయిన జోహన్ మన్‌జంబీ.. మోకాలి గాయం వల్ల ఈ మ్యాచ్‌లో ఆడలేదు. అటాక్ ప్లేయర్ లేకపోవడంతో స్విస్ తీవ్ర ఇబ్బందులు పడింది.

# యష్, కియారా అద్వానీ క్రేజీ రొమాన్స్.. టాక్సిక్ నుంచి 'తబాహి' వీడియో సాంగ్ విడుదల

రాకింగ్ స్టార్ యష్ హీరోగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టాక్సిక్' సినిమా నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాలోని మొదటి సింగిల్ 'తబాహి' వీడియో సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ వీడియోలో యష్, కియారా అద్వానీల మధ్య ఉన్న హాట్ కెమిస్ట్రీ స్క్రీన్‌పై మ్యాజిక్ క్రియేట్ చేసింది. ప్రతి ఫ్రేమ్‌లోనూ వీరిద్దరి లవ్ అండ్ ఇంటెన్సిటీ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. పాట యావరేజ్‌గా ఉన్నప్పటికీ, విజువల్స్ మాత్రం సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేశాయి. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత, అక్షయ్ ఒబెరాయ్, సుదేవ్ నాయర్, అమిత్ తివారీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రవి బస్రూర్, తనిష్క్ బాగ్చి, ఫహీమ్ అబ్దుల్లా తదితరులు సంగీతం అందిస్తుండగా, ఈ తెలుగు వర్షన్ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కె. నారాయణ, యష్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 2026 ఆగష్టు 26న ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.




# అతడు స్టార్ నటుడు అనుకోలేదు.. మహేష్ బాబు క్రేజ్‌పై కృతి సనన్ కామెంట్స్!



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుకి ఉన్న క్రేజ్ ఎలాంటిదో బాలీవుడ్ స్టార్ బ్యూటీ కృతి సనన్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన సైకలాజికల్ థ్రిల్లర్ '1: నేనొక్కడినే' (2014) సినిమాతోనే కృతి సనన్ వెండితెరకు పరిచయమైన సంగతి తెలిసిందే. ఈ డెబ్యూ మూవీ జ్ఞాపకాలను పంచుకుంటూ, సినిమా ఒప్పుకునే సమయానికి తనకు తెలుగు సినిమాలపై గానీ, మహేష్ బాబు రేంజ్ ఏంటో గానీ పెద్దగా అవగాహన లేదని ఆమె చెప్పారు. తాను హిందీ సినిమాలు చూస్తూ పెరగడం వల్ల మొదట్లో మహేష్ బాబుని కలిసినప్పుడు ఒక నార్మల్ సీనియర్ నటుడిలా చాలా క్యాజువల్‌గా కలిశానని, ఆయనకున్న క్రేజ్ ఏంటో తనకు అప్పుడు తెలియదని అన్నారు. కానీ, ఎప్పుడైతే తాను '1: నేనొక్కడినే' షూటింగ్ సెట్స్‌లోకి అడుగుపెట్టానో, ఆ తర్వాత జరిగిన భారీ ఆడియో లాంచ్ ఈవెంట్‌ను కళ్లారా చూశానో... అప్పుడు సూపర్ స్టార్ మహేష్ బాబు రేంజ్, ఆయనకున్న స్టార్‌డమ్, అబిమానుల్లో ఉన్న విపరీతమైన క్రేజ్ ఏంటో తనకు పూర్తిగా అర్థమైందని కృతి సనన్ వివరించారు. నటనలో ఎలాంటి ముందస్తు శిక్షణ లేకపోయినా డైరెక్టర్ సుకుమార్ తనను నమ్మి ఈ సినిమాలో హీరోయిన్ ఛాన్స్ ఇచ్చారని, షూటింగ్ లొకేషన్స్ కి వచ్చే జనాల్ని, ముఖ్యంగా థియేటర్లలో జరిగిన ఆడియో ఫంక్షన్‌కు వచ్చిన ఊహించని రద్దీని చూసి తాను షాక్ అయ్యానని ఈ బాలీవుడ్ భామ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 2014 జనవరిలో విడుదలైన ఈ సినిమా పరాజయం పాలవ్వగా.. ప్రస్తుతం బాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా దూసుకుపోతున్న కృతి సనన్, తన కెరీర్ టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుతో ప్రారంభం కావడం ఎప్పటికీ స్పెషల్ అని సంతోషం వ్యక్తం చేశారు.

# 22 ఏళ్ల తర్వాత నటుడిగా థమన్.. ఆసక్తికరంగా 'హృదయం మురళి' ట్రైలర్




కోలీవుడ్ యంగ్ హీరో అథర్వ మురళి, మలయాళ స్టార్ యాక్టర్ ఫహద్ ఫాజిల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'హృదయం మురళి' ఆకాష్ భాస్కరన్ దర్శకత్వంలో యూత్ ఫుల్ ఎమోషనల్ అండ్ రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక యువకుడి జీవితంలో ఎదురయ్యే వన్-సైడెడ్ లవ్, భావోద్వేగాల చుట్టూ ఈ కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. జీవితం ముందుకు సాగుతున్నా కొన్ని జ్ఞాపకాలు, భావాలు ఎప్పటికీ చెరిగిపోవనే పాయింట్ తో ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు మేకర్స్. ఇక ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్, కాయదు లోహర్ కథానాయికలుగా నటిస్తుండగా, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ ఎస్ దాదాపు 22 ఏళ్ల తర్వాత మళ్లీ నటుడిగా మెరవబోతుండటం విశేషం. అంతేకాకుండా ఈ సినిమాకు థమన్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మితమైన ఈ చిత్రంలో ఫహద్ ఫాజిల్ ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్‌లో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను తెలుగులో అందిస్తుండగా, జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రస్తుతం విడుదలైన ఈ ట్రైలర్ యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.

# రూ.100 కోట్ల బడ్జెట్.. రూ.15 కోట్ల కలెక్షన్లు బాక్సాఫీస్ వద్ద కొట్టుమిట్టాడుతున్న 'నాగబంధం'.. వర్కవుట్ కాని 'సనాతన కార్డ్'!



టాలీవుడ్‌లో సనాతన ధర్మం, పురాతన ఆలయాల రహస్యాల నేపథ్యంలో తెరకెక్కిన తాజా సోషియో ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' బాక్సాఫీస్ వద్ద తీవ్రంగా కొట్టుమిట్టాడుతోంది. సుమారు రూ. 100 కోట్ల భారీ బడ్జెట్‌తో, విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్య మీనన్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు అభిషేక్ నామా రూపొందించిన ఈ పాన్-ఇండియా చిత్రం జూలై 3న విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో పూర్తిగా విఫలమైంది. ఇటీవలి కాలంలో భక్తి, సనాతన ధర్మం బ్యాక్‌డ్రాప్‌తో వచ్చిన సినిమాలు ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేకపోతున్న సంగతి తెలిసిందే. మేకర్స్ ఎంత సనాతనం కార్డు వాడిన సినిమాలో మ్యాటర్ లేకపోతే ప్రేక్షకుల ఆ వైపు కూడా చూడాట్లేదు. అయితే తాజాగా ఈ సినిమా కూడా అలాగే 'సనాతన కార్డ్'తో రాగా.. బలహీనమైన కథనం, దర్శకత్వ లోపాలు, ఎక్కువ నిడివి కారణంగా థియేటర్లలో అస్సలు వర్కవుట్ కాలేదు. సినిమాపై భారీ బడ్జెట్ పెట్టినప్పటికీ.. థియేటర్లలో మాత్రం ఈ సినిమా వసూళ్లు అత్యంత ఘోరంగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2100 స్క్రీన్లలో విడుదలైన ఈ చిత్రం, మొదటి మూడు రోజుల్లో (వీకెండ్) కలిపి ఇండియా నెట్ కలెక్షన్ల పరంగా కేవలం రూ. 9.75 కోట్లు మాత్రమే రాబట్టింది. ఇక గ్రాస్ వసూళ్లు, ఓవర్సీస్ కలెక్షన్లు అన్నీ కలిపినా మొదటి వీకెండ్ ముగిసేసరికి వరల్డ్‌వైడ్ కలెక్షన్లు రూ. 13.70 కోట్ల నుండి రూ. 15 కోట్ల లోపే పరిమితమయ్యాయి. సినిమా రన్‌టైమ్ ఎక్కువ ఉందని దాదాపు 20 నిమిషాలు తగ్గించిన కూడా ఆశించిన స్థాయిలో సినిమా లేకపోవడంతో ప్రేక్షకులు ఈ అడ్వెంచర్ రైడ్‌ను తిరస్కరిస్తున్నారు. జగపతి బాబు, అనసూయ భరద్వాజ్ వంటి భారీ తారాగణం ఉన్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద 'నాగబంధం' గట్టెక్కడం కష్టంగానే కనిపిస్తోంది.



# రవితేజ -- శ్రీ విష్ణు మల్టీస్టారర్‌కు క్రేజీ టైటిల్.. సంక్రాంతి బరిలో నవ్వుల జాతర!



టాలీవుడ్‌లో మరో ఇంట్రెస్టింగ్ మల్టీస్టారర్‌కు రంగం సిద్ధమవుతోంది. మాస్ మహారాజా రవితేజతో పాటు తన కామెడీ టైమింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శ్రీ విష్ణు తొలిసారి ఒకే సినిమాలో నటించనున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రానికి 'వీరాధి వీరులంట' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, ఈ టైటిల్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా కథ, కామెడీ టోన్‌కు తగ్గట్టుగానే ఈ టైటిల్ ఉంటుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. వీశీజఅవం ఈ చిత్రానికి హసిత్ గోలి దర్శకత్వం వహించనున్నారు. ఇప్పటికే శ్రీ విష్ణుతో 'రాజా రాజా చోర', 'స్వాగ్' వంటి చిత్రాలను తెరకెక్కించిన హసిత్ గోలి.. ఇప్పుడు రవితేజతో కలిసి మరో వినోదభరితమైన కథను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. దీంతో శ్రీ విష్ణు-హసిత్ గోలి కాంబినేషన్‌లో ఇది హ్యాట్రిక్ మూవీ కానుంది.పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొంద నున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై స్టార్ నిర్మాత దిల్ రాజు, ఆయన సోదరుడు శిరీష్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని సమాచారం. షూటింగ్‌ను ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభించేలా చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. అలాగే సినిమాను 2027 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో ప్లానింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. రవితేజ ఎనర్జీ, కామెడీ టైమింగ్‌కు.. శ్రీ విష్ణు సహజమైన హాస్యం తోడైతే ఈ సినిమా వినోదానికి కొత్త నిర్వచనం ఇవ్వడం ఖాయమనే అభిప్రాయం అభిమానుల్లో వ్యక్తమవుతోంది. షూటింగ్ ప్రారంభం కాకముందే ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొనడం విశేషం. అయితే సినిమా టైటిల్, విడుదల తేదీతో పాటు నటీనటుల పూర్తి వివరాలపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అప్పటి వరకు 'వీరాధి వీరులంట' అనే టైటిల్‌తో ఈ క్రేజీ మల్టీస్టారర్ వార్తలు టాలీవుడ్‌లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

# ఆల్కహాల్ ఉన్న ఔషధాలపై కేంద్రం నిఘా



ఔషధాల దుర్వినియోగాన్ని అరికట్టడం, వాటిని మత్తు కోసం వాడకుండా నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 12 శాతానికి పైగా ఇథైల్ ఆల్కహాల్ ఉండే ఔషధాలకు ఇకపై లైసెన్స్ తప్పనిసరి చేసింది. వీటికి కఠిన నియంత్రణలు వర్తిస్తాయని, ఈ ఔషధాలు విక్రయించాలంటే లైసెన్స్, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసింది. 12 శాతానికి పైగా ఇథైల్ ఆల్కహాల్ ఉండే ఔషధాలకు ఇప్పటి వరకు లైసెన్స్ నుంచి మినహాయింపు ఉండేది. అయితే తాజాగా ఈ మినహాయింపును ప్రభుత్వం రద్దు చేసింది. డ్రగ్స్ రూల్స్, 1945లోని షెడ్యూల్ ఖ ప్రకారం, ఇప్పటి వరకు యాలకులు, అల్లం, ఇతర సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన 'టింక్చర్స్' లాంటి కొన్ని ఔషధ ఉత్పత్తులకు ఇంత వరకు లైసెన్స్ అవసరం లేకుండా మినహాయింపు ఉండేదని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ తెలిపింది. అయితే ఈ రకమైన కొన్ని ఔషధాల్లో ఇథైల్ ఆల్కహాల్ పరిమాణం చాలా ఎక్కువగా ఉంటోంది. కొన్నింటిలో అయితే ఏకంగా 80 నుంచి 90 శాతం వరకు ఆల్కహాల్ ఉంటోంది. అందువల్ల వీటిని మత్తు కోసం దుర్వినియోగం చేసే అవకాశం ఎక్కువగా ఉందని ప్రభుత్వం గుర్తించింది.

ఈ సమస్యను పరిష్కరించడానికి 30 మిల్లీ లీటర్ల కంటే ఎక్కువ పరిమాణంలో ఉండి, 12 శాతానికిపైగా పైగా ఇథైల్ ఆల్కహాల్ కలిగిన అన్ని రకాల ఔషధాలకు షెడ్యూల్–కె కింద ఇచ్చే మినహాయింపును ప్రభుత్వం రద్దు చేసింది. ఇటువంటి ఉత్పత్తులకు ఇకపై 'డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్, 1940' కింద అవసరమైన లైసెన్సులను కచ్చితంగా తీసుకోవాల్సి ఉంటుంది. అంతేకాదు, ఈ సవరణ ద్వారా ఈ ఔషధాలను డ్రగ్స్ రూల్స్, 1945లోని షెడ్యూల్ ఎ1 పరిధిలోకి మార్చారు. దీని ప్రకారం, రిజిస్టర్డ్ డాక్టర్ రాసిన మందుల చీటీ ఉంటేనే ఈ ఔషధాలను విక్రయించాల్సి ఉంటుంది. అలాగే ఆ విక్రయాలకు సంబంధించిన రికార్డులను చాలా కఠినంగా నిర్వహించాల్సి ఉంటుంది.

"ఈ సవరణ ద్వారా ఆల్కహాల్ ఉన్న ఔషధ ఉత్పత్తులపై నియంత్రణ ఏర్పడుతుంది. ఇవి కేవలం గుర్తింపు పొందిన ఫార్మాస్యూటికల్ సప్లై చైన్ ద్వారానే సరఫరా అవుతాయి. ఫలితంగా ఈ డ్రగ్స్ పక్కదారి పట్టే అవకాశం, దుర్వినియోగం అయ్యే ప్రమాదం చాలా వరకు తగ్గుతుంది. అదే సమయంలో నిజమైన వైద్య అవసరాల కోసం ఇవి నిరంతరం అందుబాటులో ఉంటాయి" అని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ పేర్కొంది.

ప్రస్తుతం ఉన్న డ్రగ్స్ నిబంధనల ప్రకారం, వివిధ సంప్రదాయ వైద్య విధానాల్లో ఇప్పటికే ఆల్కహాల్ పరిమితులు అమలులో ఉన్నాయి. రూల్ 161 ప్రకారం, ఆయుర్వేద, సిద్ధ, యునాని సిరప్?లలో గరిష్ఠంగా 16 శాతం ఆల్కహాల్? మాత్రమే అనుమతిస్తారు. అదే విధంగా రూల్? 106బీ ప్రకారం, హోమియోపతి మందుల్లో ఆల్కహాల్ పరిమాణం 12 శాతానికి పరిమితం చేస్తారు. తాజా సవరణ ప్రకారం, కేవలం యాలకులు, అల్లం, ఇతర సుగంధ ద్రవ్యాలు ఉన్నాయనే కారణంతో 12 శాతానికి పైగా ఇథైల్ ఆల్కహాల్ ఉన్న ఔషధాలకు ఇకపై షెడ్యూల్?–కె కింద మినహాయింపు ఇవ్వరు. నిజమైన వైద్య అవసరాల కోసం వీటిని నిరంతరం అందుబాటులో ఉంచుతూనే, దుర్వినియోగాన్ని అరికట్టడానికి ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఔషధాల నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేయడం, మందుల బాధ్యతాయుమైన, సరైన వినియోగాన్ని ప్రోత్సహించడం, ప్రజారోగ్యాన్ని రక్షించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన గెజిట్? నోటిఫికేషన్? ఆరోగ్య మంత్రిత్వశాఖ తన అధికారిక వెబ్?సైట్?లో అందుబాటులో ఉంటుంది.

# జాతీయ గీతం తప్పనిసరి!

జాతీయ గీతం జనగణమన, జాతీయ గేయం వందేమాతరం ఆలపించేటప్పుడు ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. వీటిని ఆలపించేటప్పుడు లేదా వాయిద్య ప్రదర్శన సమయంలో అధికారికంగా నిర్దేశించిన సాహిత్యాన్ని, స్పష్టమైన ఉచ్చారణను, పదాల స్పష్టతను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించింది. అధికారిక లిపిని, పద వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చకూడదని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ శాఖలతో సహా అన్ని రాష్ట్రాల గవర్నర్ కార్యాలయాలకు జులై 9న హోం శాఖ తాజా మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ఉత్తర్వుల్లో జాతీయ గీతం, జాతీయ గేయాన్ని ఏ సందర్భాల్లో తప్పనిసరిగా ఆలపించాలి లేదా వినిపించాలి. ఏ సందర్భంలో అవసరాన్ని బట్టి వినిపించొచ్చు అనే దానికి సంబంధించి ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనల్ని హోం శాఖ పునరుద్ఘాటించింది. హోం శాఖ ఆదేశాల ప్రకారం– జాతీయ గీతం, జాతీయ గేయాలను ఆలపించే లేదా ప్లే చేసే ప్రతి సందర్భంలోనూ అధికారికంగా ఆమోదించిన సాహిత్యాన్నే ఉపయోగించాలి. పదాల ఉచ్చారణ, స్పష్టతలో (డిక్షన్) ఎలాంటి పొరపాట్లు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించిన అధికారిక సాహిత్యం, ఉచ్చారణ మార్గదర్శకాలను హోం శాఖ తన అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించింది.

### వందేమాతరం ఎప్పుడు ఆలపించాలి?

కేంద్ర హోం శాఖ మార్గదర్శకాల ప్రకారం– పౌర పురస్కారాల ప్రదానోత్సవాలు, రాష్ట్రపతి అధికారిక కార్యక్రమాల్లో ఆయన




వచ్చే సమయంలో, తిరిగి వెళ్లే సమయాల్లో వందేమాతరం ఆలపించాలి. రాష్ట్రపతి రేడియో (ఆకాశవాణి), టీవీల ద్వారా దేశ ప్రజల్ని ఉద్దేశించి ప్రసంగించే ముందు, ప్రసంగం ముగిసిన తర్వాత కూడా దీనిని వినిపించాల్సి ఉంటుంది. రాష్ట్రాల్లో గవర్నర్, కేంద్ర పాలిత ప్రాంతాల్లో లెఫ్టినెంట్ గవర్నర్లు అధికారిక కార్యక్రమాలకు వచ్చినప్పుడు, తిరిగి వెళ్లేటప్పుడు, ఇంకా పరేడ్‌లో జాతీయ జెండాను తీసుకొచ్చే సందర్భాల్లో జాతీయ గేయం వందేమాతరం వినిపించాలని స్పష్టం చేసింది. వీటితో సహా ఇంకా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదేశించే ఇతర సందర్భాల్లోనూ జాతీయ గేయాన్ని వాడుకోవచ్చని పేర్కొంది.

### రాష్ట్ర గీతం ఉంటే పాటించాల్సిన క్రమం ఇదే

కొన్ని రాష్ట్రాల్లో జాతీయ గీతం లేదా జాతీయ గేయంతో పాటు రాష్ట్ర గీతాన్ని కూడా ఆలపించే ఆనవాయితీ ఉందని హోం శాఖ పేర్కొంది. అలాంటి సందర్భాల్లో ముందుగా వందేమాతరం, ఆ తర్వాత జనగణమన ఆలపించాలని స్పష్టం చేసింది. జాతీయ గేయం, జాతీయ గీతానికి సముచిత గౌరవం కల్పించే విధంగా ఈ క్రమాన్ని పాటించాలని సూచించింది. ఈ ఏడాది జనవరి 28న హోం శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను కూడా తాజా ఉత్తర్వుల్లో ప్రస్తావించింది. అధికారిక కార్యక్రమాల్లో 3 నిమిషాల 10 సెకన్ల నిడివి గల ఆరు చరణాల అధికారిక రూపంలోని వందేమాతరం ఆలపించాలని పేర్కొంది. జాతీయ గేయం ఆలపించే సమయంలో సభలో ఉన్న ప్రతి ఒక్కరూ అటెన్షన్ పొజిషన్‌లో కచ్చితంగా నిల్చోవాలని స్పష్టం చేసింది.

### వందేమాతరం, జనగణమనకు సమాన హోదా, గౌరవం

వందేమాతరం ఎప్పుడు పాడాలనే అంశంపై అన్ని సందర్భాలను ఒక జాబితా రూపంలో నిర్దేశించలేమని కేంద్రం పేర్కొంది. కానీ జాతీయ గేయానికి ఇవ్వాల్సిన సముచిత గౌరవాన్ని, క్రమశిక్షణను పాటిస్తూ– ప్రజలు ఎక్కడైనా, సామూహికంగా దీనిని ఆలపించవచ్చని, అందుకు ఎలాంటి ఆంక్షలు లేదా అభ్యంతరాలు లేవని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలోనే ఈ మార్గదర్శకాల్ని మరోసారి గుర్తు చేసింది. 1950 జనవరి 24న రాజ్యాంగ పరిషత్ ఆమోదించిన తీర్మానం ప్రకారం రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన 'జనగణమన' ను భారత జాతీయ గీతంగా గుర్తించింది. అదే తీర్మానంలో భారత స్వాతంత్రోద్యమంలో చారిత్రక పాత్ర పోషించిన బంకిం చంద్ర ఛటర్జీ రాసిన వందేమాతరానికి కూడా జనగణమనతో సమాన గౌరవ హోదా కల్పించాలని నిర్ణయించింది.

# ఇతర దేశాలపై ఆధారపడడాన్ని తగ్గించడమే లక్ష్యం

ఇథనాల్ 20 పెట్రోల్ కారణంగా కొన్ని వాహనాల్లో మైలేజీ 3 నుంచి 5 శాతం తగ్గొచ్చని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కానీ దీని ప్రభావం కంటే ప్రయోజనాలే ఎక్కువ ఉన్నాయని వివరించింది. ఈ 20 పెట్రోల్‌తో మంచి ఇంజిన్ పనితీరు, మెరుగైన పికప్, తక్కువ కర్బన ఉద్గారాల విడుదల వంటి ఉపయోగాలు ఉన్నాయని తెలిపింది. ఇది అధిక నాణ్యత, సమర్థవంతమైన ఇంధనం అని పేర్కొంది. అనేక సంవత్సరాలుగా శాస్త్రీయ పరీక్షల తర్వాతే దీనిని ప్రవేశపెట్టినట్లు తెలిపింది. ఈ మేరకు పెట్రోల్‌లో ఇథనాల్‌ను కలిపే కార్యక్రమంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టేందుకు 'సందేహాలు– సమాధానాలు' పేరుతో ఒక డాక్యుమెంట్‌ను శుక్రవారం విడుదల చేసింది. పెట్రోల్‌లో ఇథనాల్ కలిపే ప్రక్రియను చాలా వేగంగా అమలు చేశారన్న ఆందోళనలను మంత్రిత్వ శాఖ తోసిపుచ్చింది. సైంటిఫిక్ పరీక్షలు, ఆటోమొబైల్ తయారీదారులతో సంప్రదింపులు, దేశీయంగా ఇథనాల్ ఉత్పత్తి పెంపు చేపట్టిన అనంతరమే దశలవారీగా ఈ20 పెట్రోల్ వినియోగాన్ని తీసుకొచ్చినట్లు వివరించింది. భారత్‌లో ఈ కార్యక్రమం 2001లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైందని, 2006 నాటికి దేశంలోని కొన్ని ప్రాంతాల్లో 5 శాతం బ్లెండింగ్ అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. 2014లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు 1.5 శాతం ఇథనాల్ బ్లెండింగ్ విధానమే అమల్లో ఉందని చెప్పింది. 2018లో జీవ ఇంధనాలపై జాతీయ విధానాన్ని ప్రవేశపెట్టి ఉత్పత్తిని ప్రభుత్వం వేగవంతం చేసిందని తెలిపింది. ప్రత్యేక ఇథనాల్ ప్లాంట్లు, నిల్వ, లాజిస్టిక్స్‌లో పెట్టుబడుల తర్వాత భారత్ 2022లోనే నిర్దేశిత సమయానికి ముందే 10 శాతం ఇథనాల్ మిశ్రమాన్ని సాధించిందని




చెప్పింది. 2025–26 ఇథనాల్ సరఫరా సంవత్సరంలో 20 శాతం మిశ్రమాన్ని చేరుకుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

### పాత వాహనాలు పాడవుతాయా?

పాత వాహనాలు పాడవుతాయన్న ఆందోళనలపైనా కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పందించింది. దేశవ్యాప్తంగా ఈ20ను పెట్రోల్?ను ప్రవేశపెట్టే ముందు ఇంజిన్ మన్నిక, ఇంధన వ్యవస్థలు, మెటీరియల్ అనుకూలత, తుప్పు నిరోధకత, పికప్?, ఉద్గారాలపై విస్తృతమైన పరీక్షలు చేశామని చెప్పింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ20 వల్ల వాహనంలో తుప్పు, అసాధారణ అరుగుదల లేదా భాగాల జీవితకాలం దెబ్బతినడం వంటి సమస్యలను సర్వీస్ చేసిన వాహనాల్లో తాము ఎదుర్కోలేదని మారుతి సుజుకి, హీరో మోటోకార్ప్‌తో సహా ఆటోమొబైల్ తయారీదారుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను ప్రస్తావించింది.

### వేర్వేరు పెట్రోల్‌లు సాధ్యం కాదు

పెట్రోల్ పంపులు శుద్ధమైన పెట్రోల్, ఈ10, ఈ20 వంటి ఇంధన గ్రేడ్‌లను అందించాలన్న డిమాండ్లపైనా కేంద్రం స్పందించింది. దేశవ్యాప్తంగా ఆ స్థాయిలో సప్లయ్ చైన్‌లు నిర్వహించడం వల్ల లాజిస్టిక్ ఖర్చులు పెరుగుతాయని వివరించింది. దీని వల్ల దేశంలో ఉన్న లక్షకుపైగా రిటైల్ ఔట్‌లెట్లకు ఇంధన పంపిణీ ప్రక్రియ సంక్లిష్టంగా మారుతుందని పేర్కొంది.

### ఇతర దేశాలపై ఆధారపడడాన్ని తగ్గించడమే లక్ష్యం

ఇక ధరల విషయానికొస్తే, రైతులకు మెరుగైన ఆదాయం అందించే ఉద్దేశంతో ఇథనాల్ సేకరణకు ఒక నిర్దిష్ట మొత్తం నిర్ణయించినట్లు కేంద్రం తెలిపింది. అంతర్జాతీయ ముడి చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు ఈ ధరలు పెట్రోల్ ధరను మించవచ్చని అంచనా వేసింది. అందువల్ల సంప్రదాయ పెట్రోల్ కంటే చౌకేమీ కాదని స్పష్టం చేసింది. ధరలను తగ్గించడం కంటే దిగుమతి చేసుకున్న ముడి చమురుపై భారత్? ఆధారపడటాన్ని తగ్గించడం, ధరల స్థిరత్వాన్ని మెరుగుపరచడం, ఇంధన భద్రతను బలోపేతం చేయడమే దీని ప్రధాన లక్ష్యమని పేర్కొంది.

### ఇప్పటి వరకు రూ.1.97 లక్షల కోట్లు ఆదా

ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్ వల్ల 2014–15 నుంచి రూ.1.97 లక్షల కోట్ల విదేశీ మారకం ఆదా అయ్యిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. సుమారు 316 లక్షల టన్నుల క్రూడాయిల్ దిగుమతుల్ని, 952 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించగలిగామని గణాంకాలను విడుదల చేసింది. 2014–15 నుంచి ఇప్పటి వరకు ఇథనాల్ సప్లయ్ వల్ల రైతులకు రూ.1.66 లక్షల కోట్లు ఆదాయం సమకూరిందని వివరించింది. కాబట్టి ఈ20 పెట్రోల్ గురించి అవాస్తవ సమాచారాన్ని విశ్వసించొద్దని కేంద్రం పౌరులకు సూచించింది.

## ఉక్కపోతతో అల్లాడుతున్న బ్రిటన్

యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లో ఎండలు మండిపోతున్న వేళ, చల్లదనం కోసం చూస్తున్న ప్రజలే లక్ష్యంగా ఓ భారీ ఆన్‌లైన్ మోసం వెలుగులోకి వచ్చింది. "నాసా మాజీ ఇంజనీర్లు రూపొందించారు", "కేవలం 90 సెకన్లలో గదిని చల్లబరుస్తుంది" వంటి ఆకర్షణీయమైన ప్రకటనలతో ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో పోర్టబుల్ ఎయిర్ కండీషనర్ల (ఏసీ) అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అయితే, ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, ఇదంతా ఓ పెద్ద స్కామ్ అని తేలింది. ఈ వ్యవహారంపై బీబీసీ ప్రచురించిన కథనం ప్రకారం, ఈ పరికరాలు ఏసీలు కావని, కేవలం సాధారణ ఫ్యాన్లు మాత్రమేనని స్పష్టమైంది. ఈ మోసపూరిత ప్రకటనల్లో, చిన్నగా ఉండే ఈ పరికరాలను శక్తివంతమైన ఏసీలుగా చిత్రీకరిస్తున్నారు. సుమారు 70 నుంచి 120 పౌండ్లు (దాదాపు రూ. 7,000 నుంచి రూ. 12,000) ధర పలికే ఈ పరికరాలకు నాసా టెక్నాలజీని జోడించి ప్రచారం చేస్తున్నారు. ప్రత్యేకమైన కూలింగ్ క్యాట్రిడ్జ్‌లు, తక్కువ విద్యుత్ వినియోగం వంటి ఫీచర్లతో వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తున్నారు. వీటిని అత్యాధునికంగా చూపించేందుకు, రాగి తీగలు, మెటల్ బాక్సులతో ఉన్నట్టుగా కృత్రిమ మేధ (ఏఐ)తో సృష్టించిన ఫోటోలను వాడుతున్నారు. వాస్తవానికి, ఇవి ఏసీలు కానే కావు. వీటిని "స్వాంప్ కూలర్లు" అని పిలిచే సాధారణ ఎవాపరేటివ్ కూలర్లుగా నిపుణులు తేల్చారు. అంటే, ఒక ఫ్యాన్‌కు తడి అట్ట లేదా స్పాంజ్ లాంటిదాన్ని అమర్చి, దాని ద్వారా గాలిని బయటకు పంపే పరికరాలు. అసలైన ఏసీలలో గదిలోని వేడిని బయటకు పంపేందుకు కంప్రెసర్, ఎగ్జాస్ట్ పైపు ఉంటాయి. కానీ, ఈ నకిలీ పరికరాల్లో అలాంటి వ్యవస్థ ఉండదు. పైగా, ఇవి గదిలోని తేమను మరింత పెంచుతాయి. యూకే వంటి తేమతో కూడిన వాతావరణంలో ఇవి గదిని చల్లబరచకపోగా, మరింత ఉక్కపోతను సృష్టిస్తాయి. "ప్రాపర్ డీఐవై" యూట్యూబర్ స్టువర్ట్ మాథ్యూస్ వీటిని పరీక్షించి, ఇవి "చౌకబారు విడిభాగాలతో, తప్పుడు శాస్త్రీయ సూత్రం ఆధారంగా పనిచేసే పనికిరాని వస్తువులు" అని తేల్చిచెప్పారు. యూకేకు చెందిన అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ అథారిటీ (ఏఎస్‌ఏ) కూడా ఈ ప్రకటనలపై వినియోగదారులను హెచ్చరించింది. "నమ్మశక్యం కాని హామీలు, రహస్య ఆవిష్కరణల కథలు, నకిలీ రివ్యూలు" వంటివి కనిపిస్తే అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇలాంటి ప్రకటనలపై చర్యలు తీసుకుంటున్నప్పటికీ, నేరుగా జరిమానాలు విధించే అధికారం తమకు లేదని ఏఎస్‌ఏ తెలిపింది. ఏదైనా పరికరం కొనే ముందు, దానిపై స్వతంత్ర రివ్యూలను పరిశీలించడం చాలా ముఖ్యమని నిపుణులు సలహా ఇస్తున్నారు.

## తొక్కిసలాట సమయంలో పోలీసులు నాటకం చూశారు

కరూర్ తొక్కిసలాట ఘటనను అడ్డుపెట్టుకుని అప్పటి అధికార పార్టీ ఐవీఖ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నించిందని తమిళనాడు సీఎం విజయ్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో కరూర్‌లో పర్యటించకుండా అప్పటి ఐవీఖ ప్రభుత్వం అడ్డుకుందని చెప్పారు. కరూర్ తొక్కిసలాటలో బాధితుల కుటుంబసభ్యులకు సీఎం విజయ్ ప్రభుత్వ ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారు. 32 కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలను సీఎం ఇచ్చారు. ఈ ఏడాది మే నెలలో తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ తొలిసారి కరూర్‌లో పర్యటిస్తున్నారు. తొక్కిసలాట ఘటనలో ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటుంబాలను ఆయన పరామర్శించారు. తొక్కిసలాట ఘటన తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐవీఖతో పాటు కరూర్ పోలీసులపై విజయ్ విమర్శలు గుప్పించారు. ర్యాలీకి జనం పోటెత్తుతున్నప్పుడు సభను రద్దు చేసే పూర్తి అధికారం పోలీసులకు ఉన్నప్పటికీ, వారు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని విజయ్ మండిపడ్డారు. తాను పోలీసులను పూర్తిగా నమ్మానని, కానీ ఇదంతా ఎవరి ఆదేశాలతో జరిగిన నాటకమో చెప్పాలని ఆయన నిలదీశారు. నల్ల దుస్తులు ధరించి సభకు హాజరైన సీఎం విజయ్ తొక్కిసలాటలో మరణించిన చిన్న పిల్లలు, ఇతర బాధితుల జ్ఞాపకార్థం తమ పార్టీ తరఫున ఒక స్మారక చిహ్నాన్ని నిర్మిస్తామని ప్రకటించారు. కరూర్ తొక్కిసలాట బాధ తన జీవితంలో ఏ విజయమూ చెరపలేదని విజయ్ పేర్కొన్నారు. ఎంతోమంది అమాయక పిల్లలు ఈ ప్రమాదంలో చనిపోవడం తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు.

"ఒక మనిషి ఉన్నత శిఖరాలను అధిరోహించినా సరే తన జీవితంలో ఎక్కడో ఓ చోట బాధాకరమైన క్షణాలను ఎదుర్కోక తప్పదు. నా రాజకీయ ప్రయాణంలో కరూర్ ఘటన అలాంటిదే. ఆ తొక్కిసలాటలో ఎంతోమంది తల్లులు తమ బిడ్డలను కోల్పోయారు. దీనికి బాధ్యులెవరు? ఆ రోజు ర్యాలీకి రద్దీ ఎక్కువగా ఉందని పోలీసులకు అనిపించినప్పుడు మమ్మల్ని అలర్ట్ చేయాల్సింది. లేదా సమావేశాన్ని రద్దు చేయాల్సింది. వారికి అన్ని హక్కులూ ఉన్నాయి కదా! కానీ, అవేవీ చేయకుండా వారు డ్రామా చూశారు. బహుశా అలా చేయమని వారిపై ఎవరి (నాటి డీఎంకే ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ) ఒత్తిడైనా ఉండి ఉంటుంది. రద్దీని నియంత్రించగలరని నేను పోలీసులను నమ్మాను. కానీ, నా వల్లే మరణాలు జరిగాయని నాడు నాపై నిందలేశారు. ఘటన తర్వాత నేను పారిపోయానని ప్రత్యర్థులు నాపై బురదజల్లారు. కానీ, నేను పారిపోలేదు. ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా"

### సీఎం పర్యటనలో భద్రతా వైఫల్యం

ఇదిలా ఉండగా, సీఎం పర్యటనలో భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. భారీ సంఖ్యలో ఉన్న మద్దతుదారుల మధ్య ఒక వ్యక్తి బారికేడ్లను దాటుకుని ముఖ్యమంత్రి కాన్వాయ్ వైపు దూసుకెళ్లాడు. వెంటనే స్పందించిన భద్రతా సిబ్బంది, ఆ వ్యక్తి ముఖ్యమంత్రి వాహనాన్ని చేరుకోకముందే అడ్డుకుని అక్కడి నుంచి తరలించారు. ఆ తర్వాత కాన్వాయ్ ఎటువంటి అంతరాయం లేకుండా తన గమ్యస్థానానికి చేరుకుంది. అటు విజయ్ పర్యటన నేపథ్యంలో కరూర్‌లో అధికారులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. కరూర్ అంతటా భారీగా పోలీసు బలగాల మోహరింపు, ఇనుప బారికేడ్లు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా సభకు హాజరయ్యే వారికోసం ప్రత్యేకంగా ఞ= కోడ్ ఆధారిత ప్రవేశ పాస్‌లు జారీ చేశారు. మరోవైపు ఈ పర్యటనపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. సీఎం కరూర్ పర్యటన కేవలం రాజకీయ ప్రేరేపితమని, ఇది ఈ కేసుపై జరుగుతున్న జదీ× విచారణను ప్రభావితం చేస్తుందని ఆరోపిస్తున్నాయి. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో గతేడాది సెప్టెంబరులో కరూర్ ఘటన జరిగింది. గతేడాది సెప్టెంబర్ 27న ఎఖ ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన విజయ్, అధికారంలోకి వచ్చిన తర్వాత బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తానని ప్రకటించారు. ఆ మేరకు తాజాగా అర్హులైన వారికి నియామక పత్రాలు అందజేశారు.

## 2030 కామన్వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు రెడీ

2030లో కామన్వెల్త్ క్రీడలకు భారతదేశం ఆతిథ్యం ఇవ్వనుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 2036లో భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించడానికి తాము తీవ్రంగా శ్రమిస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. ఈ ప్రపంచ స్థాయి ఈవెంట్‌లను నిర్వహించడానికి క్రీడా మౌలిక సదుపాయాలను భారీ స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. 2032లో బ్రిస్బేన్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. చెన్నైలో బిగ్ బాష్ లీగ్ మ్యాచ్ జరగనుండటం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఏ క్రీడా లీగ్‌కైనా, భారతదేశంలో ఒక ఈవెంట్‌ను నిర్వహించడం విస్తృతమైన గుర్తింపు లభిస్తాయని చెప్పారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న మోదీ, మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ సందర్శించారు. అనంతరం ఆయన ఈ మేరకు మాట్లాడారు.

### యువ క్రికెటర్లతో ముచ్చటించిన మోదీ

చరిత్రాత్మక క్రీడా వేదికను సందర్శించిన సందర్భంగా ప్రధాని మోదీ, యువ క్రికెటర్ల జెర్సీలపై సంతకాలు చేశారు. అనంతరం, క్రీడా ప్రతిభావంతులతో ముచ్చటించారు. ఆస్ట్రేలియా అధికారిక చిహ్నమైన "రూబీ ది రూ"తో ఫొటోలు దిగుతూ సరదాగా గడిపారు. ఈ కార్యక్రమానికి క్రికెట్ శోభను మరింత పెంచుతూ, ఆస్ట్రేలియా పురుషుల క్రికెట్ జట్టు దిగ్గజ మాజీ కెప్టెన్ స్టీవ్ వా స్టేడియంలో మోదీని కలిశారు. "ఏీజ+లోకి అడుగుపెట్టగానే ఏ భారతీయుడికైనా ఒకేసారి రెండు భావోద్వేగాలు కలుగుతాయి. మొదటిది, భారత్–ఆస్ట్రేలియా మ్యాచ్ ఉత్సాహం. రెండోది, మన రెండు దేశాల్లో క్రికెట్ కేవలం ఒక క్రీడ మాత్రమే కాదని, అది ఒక ఉమ్మడి అభిరుచి అనే వాస్తవం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇక, స్టేడియం పర్యటనకు ముందు ఆస్ట్రేలియా ప్రతిపక్ష నేత అంగస్ టేలర్‌తో మోదీ సమావేశమయ్యారు. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ఇరువురు నేతలల విస్తృత చర్చలు జరిపారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137